జాతీయ తెలుగు దినపత్రిక

# ప్రజాజ్యోతి

ప్రతి అక్షరం ప్రజల కోసం

## ఆదిలాబాద్

## మంచిర్యాల-కుమరం భీం-నిర్మల్

శుక్రవారం 28 ఆగస్టు 2026 — పేజీలు : 8




## మాదక ద్రవ్యాల నియంత్రణ, రోడ్డు ప్రమాదాల నివారణకు పకడ్బందీ చర్యలు



- మాదక ద్రవ్య రహిత మంచిర్యాల జిల్లా సాధనకు కృషి
- జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్
- విద్యాసంస్థల్లో యాంటీ డ్రగ్ కమిటీలతో నిరంతర అవగాహన
- రోడ్డు భద్రత నిబంధనలు ఉల్లంఘిస్తే కఠిన చర్యలు



## గ్రామాల్లో పోలీసు-ప్రజల సత్సంబంధాల

# బలోపేతమే లక్ష్యం

- ఇచ్చోడ మండలం దాబాబి గ్రామంలో 'పోలీసులు మీకోసం' కార్యక్రమం
- గంజాయి, గుడుంబా పై ఉక్కుపాదం జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్
- సమాచారం ఉంటే పోలీసు లకు తెలియజేయాలి
- రోడ్డు భద్రతపై అవగాహన..ఉచిత వైద్య శిబిరం నిర్వాహణ
- హెల్మెట్‌తో ప్రమాదాల శాతం తగ్గే అవకాశం
- మహిళలు, బాలికల ఆరోగ్యం పై ప్రత్యేక అవగాన





# కేజీబీవీలలో విద్యార్థులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా చూడాలి

జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా



కేజీబీవీలలో విద్యార్థులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా చూడాలని జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా అధికారులను ఆదేశించారు. గురువారం జిల్లా కలెక్టర్ భైంసా కేజీబీవీను (కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయం) ఆకస్మికంగా తనిఖీ చేశారు.పాఠశాల పరిసర ప్రాంతాలను పరిశీలించారు. పరిసరాలను ఎప్పటికప్పుడు శుభ్రం చేసుకుంటూ ఉండాలన్నారు. విద్యార్థులు ఉపాధ్యాయులు, సిబ్బంది సంఖ్య, హాజరైన వారి సంఖ్య, విద్యార్థులకు కల్పిస్తున్న సౌకర్యాలు, ప్రతిరోజు అందిస్తున్న భోజనం, విద్య, తదితర వివరాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించడమే కాకుండా, మెరుగైన వసతులను, మెనూ ప్రకారం ఆహారాన్ని తప్పనిసరిగా అందించాలన్నారు.

# మాదక ద్రవ్యాల నియంత్రణ, రోడ్డు ప్రమాదాల నివారణకు పకడ్బందీ చర్యలు

**మాదక ద్రవ్య రహిత మంచిర్యాల జిల్లా సాధనకు కృషి**

**జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్**

**విద్యాసంస్థల్లో యాంటీ డ్రగ్ కమిటీలతో నిరంతర అవగాహన**

**రోడ్డు భద్రత నిబంధనలు ఉల్లంఘిస్తే కఠిన చర్యలు**



**మంచిర్యాల, 27, ఆగస్టు (ప్రజాజ్యోతి):**జిల్లాలో మాదక ద్రవ్యాల నియంత్రణ దిశగా అధికారులు పకడ్బందీ చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ ఆదేశించారు. గురువారం నస్పూర్‌లోని సమీకృత జిల్లా కార్యాలయాల భవన సముదాయంలోని కలెక్టర్ సమావేశ మందిరంలో డీసీపీ ఎ. భాస్కర్, అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) పి. చంద్రయ్య, బెల్లంపల్లి సబ్ కలెక్టర్ మనోజ్ఞతో కలిసి మాదక ద్రవ్యాల నియంత్రణపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ మాదక ద్రవ్య రహిత మంచిర్యాల జిల్లా సాధనలో భాగంగా విస్తృతంగా అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. జిల్లాలో ఈ ఏడాది ఇప్పటి వరకు 49 కేసులు నమోదు చేసి, 103 మందిని గుర్తించినట్లు వెల్లడించారు. మాదక ద్రవ్యాల వినియోగదారులను గుర్తించి, కోర్టు ద్వారా 30 మందిని డ్రగ్ డీ-అడిక్షన్ కేంద్రాలకు తరలించి కౌన్సెలింగ్ అందిస్తున్నట్లు తెలిపారు. విద్యాసంస్థల్లో విద్యార్థులతో యాంటీ డ్రగ్ కమిటీలను ఏర్పాటు చేశామని, వాటి ఆధ్వర్యంలో ప్రతి నెల అవగాహన కార్యక్రమాలతో పాటు మాదక ద్రవ్యాల నియంత్రణపై క్విజ్, డ్రాయింగ్ తదితర పోటీలు నిర్వహించాలని సూచించారు. విద్యాసంస్థలకు 100 మీటర్ల పరిధిలో బెల్ట్ షాపులు నిర్వహించడం, పొగాకు ఉత్పత్తులు విక్రయించడాన్ని నియంత్రించాలని అధికారులను ఆదేశించారు. మెడికల్, ఐటీఐ, ప్రభుత్వ జూనియర్, డిగ్రీ కళాశాలల్లో విద్యార్థుల ప్రవర్తనను నిరంతరం గమనిస్తూ మాదక ద్రవ్యాల వల్ల కలిగే అనర్థాలపై అవగాహన కల్పించాలన్నారు. జిల్లాలో మద్యం దుకాణాలు నిర్ణీత సమయానికి మూసివేసేలా చర్యలు తీసుకోవాలని, బెల్ట్ షాపులను నియంత్రించాలని తెలిపారు. వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో గంజాయి తదితర మాదక మొక్కల సాగును గుర్తించి చర్యలు చేపట్టాలని సూచించారు. డ్రగ్ ఇన్‌స్పెక్టర్ ఆధ్వర్యంలో మెడికల్ షాపులను నిత్యం పర్యవేక్షిస్తూ, సరైన ప్రిస్క్రిప్షన్ లేకుండా మందులు విక్రయించే దుకాణాలపై కఠిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. నంతరం పోలీస్, రవాణా, జాతీయ రహదారులు, రోడ్లు భవనాలు, ఆర్టీసీ, విద్యుత్, పంచాయతీరాజ్ శాఖల అధికారులు, మున్సిపల్ కమిషనర్లు, సంబంధిత అధికారులతో రోడ్డు భద్రత కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, జిల్లాలో రోడ్డు ప్రమాదాల నివారణ చర్యలను పటిష్టంగా అమలు చేయాలని, వాహనదారులు రోడ్డు భద్రత నిబంధనలను తప్పనిసరిగా పాటించేలా చర్యలు చేపట్టాలని సూచించారు. మున్సిపల్ పరిధిలో అవసరమైన చోట్ల స్పీడ్ బ్రేకర్లు, రోడ్డు భద్రత సూచికలు ఏర్పాటు చేయాలని, రోడ్లపై చెత్త, ఇతర ఆటంకాలను వెంటనే తొలగించాలని ఆదేశించారు. అనధికార వాహనాల పార్కింగ్, ట్రాఫిక్ నిబంధనల ఉల్లంఘనలపై కఠిన చర్యలు తీసుకోవాలన్నారు. తక్కువ విజిబిలిటీ ఉన్న ప్రాంతాల్లో లైటింగ్ ఏర్పాటు చేయడంతో పాటు జాతీయ రహదారులపై రంబుల్ స్ట్రిప్స్, లైటింగ్, హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయాలని తెలిపారు. ఓవర్‌లోడింగ్, అతివేగం, డ్రంక్ అండ్ డ్రైవింగ్, రాంగ్ సైడ్ డ్రైవింగ్‌పై కఠిన చర్యలు తీసుకోవడంతో పాటు ప్రజలకు అవగాహన కల్పించాలని సూచించారు. రవాణా శాఖ ఆధ్వర్యంలో అదుపు తప్పిన, ఓవర్‌లోడెడ్, పరిమితికి మించి వేగంగా నడిచే వాహనాలపై చర్యలు తీసుకోవాలని తెలిపారు. జిల్లాలో ఈ ఏడాది ఇప్పటి వరకు 95 డ్రైవింగ్ లైసెన్సులు రద్దు చేసినట్లు వెల్లడించారు. ఫిట్‌నెస్ లేని స్కూల్ బస్సులపై కూడా చర్యలు తీసుకోవాలని సూచించారు. ద్విచక్ర వాహనదారులు హెల్మెట్ తప్పనిసరిగా ధరించేలా ట్రాఫిక్ పోలీసులు కఠినంగా వ్యవహరించాలన్నారు. జిల్లా వ్యాప్తంగా వేగ పరిమితి, హెచ్చరిక, జాగ్రత్త సూచిక బోర్డులు ఏర్పాటు చేయాలని, గ్రామీణ, అంతర్గత రహదారుల్లోనూ ప్రమాదాల నివారణకు తగిన చర్యలు చేపట్టాలని తెలిపారు. రోడ్లపై సంచరించే పశువులను అందుబాటులో ఉన్న గోశాలలకు తరలించాలని, నూతన గోశాల ఏర్పాటుకు భూమి కేటాయించి నందున పనులను త్వరితగతిన పూర్తి చేయాలని ఆదేశించారు. రహదారి ప్రమాదాలు, మరణాలను తగ్గించేలా అన్ని శాఖల అధికారులు పరస్పర సమన్వయంతో పనిచేయాలని కలెక్టర్ కుమార్ దీపక్ సూచించారు. ఈ సమావేశంలో మంచిర్యాల ఆర్డీవో శ్రీనివాసరావు, ట్రైనీ డిప్యూటీ కలెక్టర్ విలాయత్ అలీ, మంచిర్యాల, బెల్లంపల్లి, జైపూర్ ఏసీపీలు, సంబంధిత శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## లోతొర్రె గ్రామంలో ఉచిత వైద్య శిబిరం



**జన్నారం,ఆగస్ట్27(ప్రజాజ్యోతి)** ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి డాక్టర్ ఉమాశ్రీ ఆదేశాల మేరకు గురువారం రోజున జన్నారం మండలంలోని లోతొర్రె గ్రామంలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. గ్రామస్తులకు రాపిడ్ టెస్టులు మరియు రక్త పూతలు తీసి మందులు పంపిణీ చేశారు. అలాగే సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలని,వ్యాధుల పట్ల తీసుకోవాల్సిన జాగ్రత్తల పై గ్రామస్తులకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో హెల్త్ సూపర్వైజర్ లక్ష్మి, హెల్త్ అసిస్టెంట్లు పోచయ్య, కమలాకర్, ఏఎన్ఎం ప్రియాంక, ఆశా కార్యకర్త లీల, అంగన్వాడీ టీచర్ కవిత తదితరులు పాల్గొన్నారు

## ఎస్ఐఆర్ సవరణలో భాగంగా నోటీసుల జారీ



**మంచిర్యాల, 27, ఆగస్టు (ప్రజాజ్యోతి):** ఎస్ఐఆర్ సవరణ ప్రక్రియలో భాగంగా చెన్నూర్ పట్టణంలోని జెబీఎస్ స్కూల్, కొండా పోచమ్మ టెంపుల్--కొత్తగూడెం, బేతాలవాడ టెంపుల్, లైన్‌గడ్డ ప్రాంతాల్లో గురువారం ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా అధికారులు ఓటరు వివరాలు, కుటుంబ సభ్యుల వివరాలు, సంబంధిత ధ్రువపత్రాలను పరిశీలించారు. ఫారాలను సక్రమంగా నింపని వారు, కుటుంబ సభ్యుల వివరాలతో సరైన అనుసంధానం లేని వివరాలు ఉన్న వారిని గుర్తించి, సంబంధిత వ్యక్తులకు ఎంఆర్ఓ కార్యాలయం ద్వారా నోటీసులు జారీ చేశారు నోటీసులు అందుకున్న వారు ఎలాంటి ఆందోళన చెందాల్సిన అవసరం లేదని అధికారులు తెలిపారు. తమ వద్ద ఉన్న సరైన ధ్రువపత్రాలను సమర్పించి, కుటుంబ సభ్యుల వివరాలకు అవసరమైన అనుసంధానం పూర్తి చేసి, ఫారంలో సూచించిన తేదీల్లో ఎంఆర్ఓ కార్యాలయంలో హాజరై సంబంధిత పత్రాలను అందజేయాలని సూచించారు. ఎస్ఐఆర్ సవరణలో ప్రతి ఓటరు వివరాలు సక్రమంగా నమోదు కావడంతో పాటు, అర్హులైన ప్రతి ఒక్కరి వివరాలు ఎలాంటి తప్పులు లేకుండా ఉండేలా చర్యలు చేపడుతున్నట్లు అధికారులు తెలిపారు. ప్రజలు తమ ఓటరు వివరాలను పరిశీలించుకుని, అవసరమైన పత్రాలను నిర్ణీత సమయంలో సమర్పించి అధికారులకు సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో చెన్నూర్ మున్సిపల్ చైర్మన్ పెద్దింటి పద్మ శ్రీనివాస్, వైస్ చైర్మన్ నాయకపు వినయ్, వార్డు కౌన్సిలర్లు ఎండీ అజ్జీమ్ ఉద్దీన్, అంబటి శంకర్, పెండ్యాల సాగర్, సుంకరి శిరీష సంతోష్, చెన్నూరి స్వప్న రాజేష్, కొమ్మర విజయలక్ష్మి బ్రహ్మయ్య, కో-ఆప్షన్ సభ్యులు సయ్యద్ సాహిర్, సాధనబోయిన కృష్ణ, ఎండీ ఖాజా బేగం, తనుగుల సరోజన, చెన్నూర్ పట్టణ కన్వీనర్ లింగంపల్లి మహేష్, పాతర్ల నాగరాజు, ఎండీ నవాజ్, చింతల లక్ష్మణ్, ఎండీ సుల్తాన్, చెన్న వెంకటేష్, దాసరి కమలాకర్, తనుగుల సతీష్, తనుగుల రవి, వహీద్, రమేష్ హాజ్, మధ్యల సురేష్, వసీం, నవీన్, సచిన్, లక్ష్మణ్ తదితరులతో పాటు బూత్ లెవల్ ఏజెంట్లు, అధికారులు, కార్యకర్తలు, ప్రజలు పాల్గొన్నారు. ప్రజల భాగస్వామ్యంతో ఎస్ఐఆర్ సవరణ ప్రక్రియను పారదర్శకంగా, సక్రమంగా పూర్తి చేసేందుకు అధికారులు చర్యలు కొనసాగిస్తున్నారు.

## ఓటరు జాబితా సవరణకు సహకరించాలి

**నో మ్యాపింగ్, అనామలీస్ ఓటర్లకు నోటీసులు**



**మంచిర్యాల, ఆగస్టు 27 (ప్రజాజ్యోతి):** నాలుగో డివిజన్ పరిధిలో ఓటరు జాబితా సమగ్ర సర్వే, సవరణ కార్యక్రమంలో భాగంగా నస్పూర్ ఎంఆర్ఓ సంతోష్, ఆర్ఐ చందర్ ఆధ్వర్యంలో, 4వ డివిజన్ కార్పొరేటర్ గుమ్మడి శ్రీనివాస్ సమక్షంలో ప్రజలకు అవగాహన కల్పించారు. ఆగస్టు 17న ముసాయిదా ఓటరు జాబితా ప్రచురించగా, అందులో నో మ్యాపింగ్ ఓటర్లు, అనామలీస్ ఓటర్లుగా గుర్తించిన వారికి నోటీసులు జారీ చేసినట్లు తెలిపారు. నోటీసులు అందుకున్న వారు తమ సరైన వివరాలను సమర్పించి ఓటు హక్కును కాపాడుకోవాలని అధికారులు సూచించారు. ఈ ప్రక్రియ సెప్టెంబర్ 30 వరకు కొనసాగుతుందని తెలిపారు. ప్రభుత్వం సూచించిన 33 రకాల ఆధారాల్లో తగిన ప్రూఫ్‌ను, ఆధార్ జిరాక్స్‌తో పాటు నోటీసుకు జతచేసి సమర్పించాలని కోరారు. ఆన్‌లైన్‌లో నోటీసు జారీ అయిన ప్రతి వ్యక్తి తప్పనిసరిగా సంబంధిత బీఎల్ఓ వద్దకు హాజరై ఫొటో దిగాలని అధికారులు సూచించారు. ప్రజలందరూ ఓటరు సమగ్ర సర్వేలో భాగస్వాములు కావాలని, నోటీసులు అందుకున్న వారు ఆలస్యం చేయకుండా బీఎల్ఓలను సంప్రదించి తగిన ఆధారాలు సమర్పించాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో బీఎల్ఓలు పి. లక్ష్మి, అనూష, బీఎల్ఏలు, వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులు, మంచిర్యాల నియోజకవర్గం బూత్ నంబర్లు 93, 94, 95 పరిధిలోని ప్రజలు పాల్గొన్నారు. ఓటు హక్కుకు సంబంధించిన వివరాలు, సవరణ ప్రక్రియపై ప్రజలకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో 4వ వార్డు ఆఫీసర్ ఎం. నాగార్జున పాల్గొన్నారు.

# ఉద్యోగులు సుదీర్ఘకాలంగా ఎదుర్కొంటున్న సమస్యలను ప్రభుత్వం తక్షణమే పరిష్కరించాలి

**టీజీఈజేఏసీ మంచిర్యాల జిల్లా చైర్మన్ గడియారం శ్రీహరి**

**ఐడీఓసీ నస్పూర్ వద్ద టీజీఈజేఏసీ ఆధ్వర్యంలో మహా ధర్నా**

**కలెక్టర్‌కు వినతిపత్రం**





**మంచిర్యాల, ఆగస్టు 27 (ప్రజాజ్యోతి):** ఉద్యోగ, ఉపాధ్యాయ, కార్మిక మరియు పెన్షనర్ల సమస్యల పరిష్కారం కోసం తెలంగాణ ఉద్యోగ, ఉపాధ్యాయ, కార్మిక మరియు పెన్షనర్ల జాయింట్ యాక్షన్ కమిటీ (టీజీఈజేఏసీ) రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు మంచిర్యాల జిల్లా కమిటీ ఆధ్వర్యంలో గురువారం ఐడీఓసీ నస్పూర్ వద్ద మహా ధర్నా నిర్వహించారు. టీజీఈజేఏసీ రాష్ట్ర చైర్మన్ మారం జగదీశ్వర్, సెక్రటరీ జనరల్ శ్రీ ఏలూరి శ్రీనివాస్ రావు మరియు రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు జిల్లా చైర్మన్ గడియారం శ్రీహరి, జిల్లా సెక్రటరీ జనరల్ శ్రీమతి వనజా రెడ్డి ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది. జిల్లాలోని అన్ని ఉద్యోగ, ఉపాధ్యాయ, కార్మిక, పెన్షనర్ల సంఘాల నాయకులు, ప్రతినిధులు, కార్యాలయ సబార్డినేట్ నుంచి జిల్లా స్థాయి అధికారి వరకు వివిధ శాఖలకు చెందిన ఉద్యోగులు భారీ సంఖ్యలో పాల్గొన్నారు. ఐడీఓసీ ప్రధాన ద్వారం నుంచి కలెక్టర్ కార్యాలయం వరకు భారీ ర్యాలీ నిర్వహించి, అనంతరం కలెక్టర్ కార్యాలయం వద్ద నిరసన తెలిపారు. అనంతరం తమ సమస్యల పరిష్కారం కోసం జిల్లా కలెక్టర్ శ్రీ కుమార్ దీపక్, ఐఏఎస్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా టీజీఈజేఏసీ మంచిర్యాల జిల్లా చైర్మన్ గడియారం శ్రీహరి మాట్లాడుతూ ఉద్యోగులు సుదీర్ఘకాలంగా ఎదుర్కొంటున్న సమస్యలను ప్రభుత్వం తక్షణమే పరిష్కరించాలని డిమాండ్ చేశారు. పెండింగ్‌లో ఉన్న ఆర్థిక ప్రయోజనాలను వెంటనే విడుదల చేయడంతో పాటు ఉద్యోగుల న్యాయమైన డిమాండ్ల సాధన కోసం అన్ని ఉద్యోగ సంఘాలు ఐక్యంగా కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఉద్యోగుల ఆర్థిక, సామాజిక, సేవా ప్రయోజనాలకు సంబంధించిన సమస్యలపై ప్రభుత్వం వెంటనే స్పందించి ఉద్యోగ సంఘాలను చర్చలకు పిలవాలని కోరారు. మహా ధర్నాలో ప్రధానంగా రెండవ వేతన సవరణ సంఘాన్ని తక్షణమే అమలు చేయాలని, ఉద్యోగులకు పెండింగ్‌లో ఉన్న ఆరు విడతల కరువు భత్యాన్ని వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ఉద్యోగులు, పెన్షనర్లకు సంబంధించిన ఉద్యోగుల ఆరోగ్య పథకాన్ని సమర్థవంతంగా, తక్షణమే అమలు చేయాలని కోరారు. పెండింగ్‌లో ఉన్న అన్ని బిల్లులను క్లియర్ చేయడానికి ప్రతి నెల రూ.2,000 కోట్లు విడుదల చేసి ఉద్యోగుల బకాయిలను త్వరితగతిన చెల్లించాలని డిమాండ్ చేశారు. అదేవిధంగా ఉద్యోగుల కాంట్రిబ్యూటరీ పెన్షన్ పథకం సమస్యను పరిష్కరించి ఉద్యోగులకు న్యాయం చేయాలని, రాష్ట్రంలోని ఉద్యోగ సంఘాలు, అసోసియేషన్లకు తగిన గుర్తింపు కల్పించి వాటి సమస్యలను అధికారికంగా పరిష్కరించే విధంగా చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ డిమాండ్లన్నింటినీ మహా ధర్నాలో ఏకగ్రీవంగా ఆమోదించి ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లాలని నిర్ణయించారు. టీజీఈజేఏసీ మంచిర్యాల జిల్లా సెక్రటరీ జనరల్ శ్రీమతి వనజా రెడ్డి మాట్లాడుతూ ఉద్యోగ, ఉపాధ్యాయ, కార్మిక, పెన్షనర్ల న్యాయమైన డిమాండ్లపై ప్రభుత్వం వెంటనే చర్యలు జరిపి సమస్యలను పరిష్కరించాలని అన్నారు. ఉద్యోగ సంఘాలతో చర్చలకు పిలిచి సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపాలని కోరారు. ప్రభుత్వం స్పందించని పక్షంలో భవిష్యత్ కార్యాచరణ ప్రకటించి ఉద్యమాన్ని మరింత తీవ్రతరం చేస్తామని హెచ్చరించారు. ఈ మహా ధర్నాలో టీజీఈజేఏసీ అదనపు సెక్రటరీ జనరల్ కె. శంకర్, కో–చైర్మన్లు జి. చక్రపాణి, శ్రీనివాస్ దేశ్‌పాండే, పొన్న మల్లయ్య, శ్రీపతి బాపురావు, బట్టారి వెంకటేశ్వర్లు, గుండేటి నాందేవ్, సుమిత్, పోడేటి సంజీవ్, పొలాస సత్యనారాయణ, ధరణికోట వేణుగోపాల్, పత్తి సత్తయ్య, బి. ప్రభాకర్, దుర్గ ప్రసాద్, బి. రామ్ మోహన్, కె.వి.ఎల్.ఎన్. మూర్తి, రాజేశ్వర్, ఎం.డి. అజర్, రాసపల్లి రవి, జి. రాజగోపాల్, డిప్యూటీ సెక్రటరీ జనరల్స్ బొద్దు శ్రావణ్ కుమార్, ఎ. సుధాకర్, వైస్ చైర్మన్లు బి. మోహన్, జి. రాజవేణు, ఓ. కృష్ణ, బి. మనోజ్, మోతె జయకృష్ణ, సూరినేని గంగాధర్, బన్న రవీందర్, ఎస్. కిషన్, బాలకృష్ణ, ఎ. సునీత, ఎన్. గోపాల్, బెజ్జంకి జగన్, ఎ. రాజేందర్ రెడ్డి, మోషిన్ అహ్మద్, వెంకటరమణ, ఎం. రమేష్, రాథోడ్ రమేష్ పాల్గొన్నారు. ఫైనాన్స్ సెక్రటరీ అనుముల సతీష్ కుమార్, పబ్లిసిటీ సెక్రటరీ జె. రామ్ కుమార్, సెక్రటరీలు నడిమెట్ల సత్యనారాయణ, తిరుపతి, మేడి శంకర్, గుండు వెంకటేశం, జి. వెంకటస్వామి, కె. శ్రీధర్ స్వామి తదితరులు పాల్గొన్నారు. అలాగే టీజీఓ, టీఎన్‌జీఓ నాయకులు, వివిధ ఉద్యోగ, ఉపాధ్యాయ, కార్మిక, పెన్షనర్ల సంఘాల ప్రతినిధులు, నాయకులు, జిల్లాలోని అన్ని శాఖలకు చెందిన ఉద్యోగులు భారీ సంఖ్యలో హాజరయ్యారు. ఈ మహా ధర్నాలో సుమారు 4,500 మంది పాల్గొన్నట్లు నిర్వాహకులు తెలిపారు.

# కోల్ ఇండియాకు రూ.25.32 లక్షల జరిమానా

**బోర్డు నిర్మాణ నిబంధనల ఉల్లంఘనపై బీఎస్ఈ, ఎన్ఎస్ఈ చర్యలు**

**మంచిర్యాల, 27, ఆగస్టు (ప్రజాజ్యోతి):** ప్రభుత్వ రంగ దిగ్గజ సంస్థ కోల్ ఇండియా లిమిటెడ్ (సీఐఎల్)పై బాంబే స్టాక్ ఎక్స్ఛేంజ్ (బీఎస్ఈ), నేషనల్ స్టాక్ ఎక్స్ఛేంజ్ (ఎన్ఎస్ఈ)లు మొత్తం రూ.25.32 లక్షల జరిమానా విధించాయి. రెండు స్టాక్ ఎక్స్ఛేంజ్‌లు చెరో రూ.12.66 లక్షలు, జీఎస్టీతో కలిపి మొత్తం రూ.25,32,280 జరిమానా విధించినట్లు సమాచారం. 2026 జూన్ 30తో ముగిసిన త్రైమాసికానికి సంబంధించి సెబీ లిస్టింగ్ ఆబ్లిగేషన్స్ అండ్ డిస్క్లోజర్ రిక్వైర్‌మెంట్స్ (ఎల్ఓడీఆర్) నిబంధనల్లోని పలు అంశాలను కోల్ ఇండియా పాటించలేదన్న కారణంతో ఈ చర్య తీసుకున్నారు. రెగ్యులేషన్ 17(1), 17(2ఎ), 18(1), 19(1), 19(2), 20(2)/(2), 21(2) నిబంధనలు ప్రధానంగా కంపెనీ బోర్డు నిర్మాణం, డైరెక్టర్ల నియామకం, స్వతంత్ర డైరెక్టర్ల ప్రాతినిధ్యం, మహిళా స్వతంత్ర డైరెక్టర్ తదితర కార్పొరేట్ గవర్నెన్స్ అంశాలకు సంబంధించినవి.

**నియామకాలు తమ పరిధిలో లేవన్న కోల్ ఇండియా.....**

జరిగిన నిబంధనల ఉల్లంఘనలను కంపెనీ యాజమాన్యం నిర్లక్ష్యంగా వ్యవహరించినట్లు లేదా ఉద్దేశపూర్వకంగా నిబంధనలు ఉల్లంఘించినట్లు పరిగణించరాదని కోల్ ఇండియా స్పష్టం చేసింది. ప్రభుత్వ రంగ సంస్థ కావడంతో బోర్డులో అవసరమైన డైరెక్టర్ల నియామకం నేరుగా కంపెనీ యాజమాన్యం పరిధిలో ఉండదని పేర్కొంది. అవసరమైన డైరెక్టర్ల నియామకానికి సంబంధించి కేంద్ర బొగ్గు మంత్రిత్వ శాఖతో నిరంతరం సంప్రదింపులు జరుపుతున్నామని తెలిపింది. బీఎస్ఈ విధించిన జరిమానాను మాఫీ చేయాలని కూడా కోల్ ఇండియా అభ్యర్థించినట్లు వెల్లడించింది. బోర్డు నియామకాల అంశంపై మంత్రిత్వ శాఖ స్థాయిలో నిరంతరం ఫాలోఅప్ చేస్తున్నట్లు పేర్కొంది.

**గతంలోనూ ఇదే సమస్య...............**

కోల్ ఇండియా బోర్డు నిర్మాణానికి సంబంధించిన నిబంధనల అమలులో సమస్యలు గతంలోనూ ఎదురయ్యాయి. అవసరమైన సంఖ్యలో స్వతంత్ర డైరెక్టర్లు, మహిళా స్వతంత్ర డైరెక్టర్ నియామకాలు జరగకపోవడంతో గతంలో కూడా బీఎస్ఈ, ఎన్ఎస్ఈలు జరిమానాలు విధించిన సందర్భాలు ఉన్నాయి. అప్పట్లోనూ ప్రభుత్వ రంగ సంస్థగా డైరెక్టర్ల నియామక ప్రక్రియపై కంపెనీ యాజమాన్యానికి ప్రత్యక్ష నియంత్రణ లేదని కోల్ ఇండియా వివరణ ఇచ్చింది.

**కార్పొరేట్ గవర్నెన్స్‌పై చర్చ...........**

కోల్ ఇండియా వంటి భారీ ప్రభుత్వ రంగ సంస్థకు రూ.25.32 లక్షల జరిమానా పెద్ద ఆర్థిక భారం కాకపోయినా, ఈ వ్యవహారం కార్పొరేట్ గవర్నెన్స్, స్టాక్ మార్కెట్ నిబంధనల అమలు పరంగా ప్రాధాన్యత సంతరించుకుంది. బోర్డులో అవసరమైన సంఖ్యలో డైరెక్టర్లు లేకపోవడం నిర్ణయ ప్రక్రియ, పర్యవేక్షణ, పారదర్శకత వంటి అంశాలపై ప్రశ్నలను లేవనెత్తుతోంది. లిస్టెడ్ కంపెనీలు సెబీ నిబంధనలను తప్పనిసరిగా పాటించాల్సిన నేపథ్యంలో బోర్డు నిర్మాణం కీలక అంశంగా మారింది. ఇకపై అవసరమైన డైరెక్టర్ల నియామకాన్ని పూర్తి చేసేందుకు కోల్ ఇండియా, కేంద్ర బొగ్గు మంత్రిత్వ శాఖలు ఎలాంటి చర్యలు తీసుకుంటాయో, అలాగే బీఎస్ఈ, ఎన్ఎస్ఈలు విధించిన జరిమానాలో ఏమైనా మినహాయింపు లభిస్తుందా అన్నది ఆసక్తికరంగా మారింది.



# మంచిర్యాలలో ఆగస్టు 31న సెంట్రలైజ్డ్ కమ్యూనిటీ కిచెన్ ప్రారంభోత్సవం

**42,450 మంది పాఠశాల విద్యార్థులు, 6,654 మంది జూనియర్ కళాశాల విద్యార్థులకు ప్రతిరోజూ పోషకాహార అల్పాహారం**

**విద్యార్థుల ఆరోగ్యం, పోషకాహారం, విద్యాభ్యాసమే లక్ష్యం**

**మంచిర్యాల, 27, ఆగస్టు (ప్రజాజ్యోతి):** తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న పాఠశాల అల్పాహార కార్యక్రమంలో భాగంగా మంచిర్యాల మెడికల్ గోడౌన్ ప్రాంగణంలో నిర్మించిన అధునాతన కేంద్రీకృత కమ్యూనిటీ వంటశాలను ఈనెల 31న సోమవారం ప్రారంభించనున్నారు. ఈ కార్యక్రమానికి మంచిర్యాల ఎమ్మెల్యే కొక్కిరాల ప్రేమ్‌సాగర్ రావు ముఖ్య అతిథిగా హాజరుకానున్నారు. ఈ వంటశాల నిర్వహణలో హరే కృష్ణ మూవ్‌మెంట్ చారిటబుల్ ఫౌండేషన్ అమలు భాగస్వామిగా వ్యవహరించనుండగా, సింగరేణి కాలరీస్ కంపెనీ లిమిటెడ్ తన సామాజిక బాధ్యత నిధుల ద్వారా నిర్మాణానికి ఆర్థిక సహకారం అందించింది. ఈ కేంద్రీకృత వంటశాల ద్వారా జగిత్యాల, మంచిర్యాల, పెద్దపల్లి జిల్లాల్లోని 17 మండలాల పరిధిలో 691 ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న 42,450 మంది విద్యార్థులకు, 13 జూనియర్ కళాశాలల్లో చదువుతున్న 6,654 మంది విద్యార్థులకు ప్రతిరోజూ నాణ్యమైన, పరిశుభ్రమైన, పోషక విలువలతో కూడిన అల్పాహారం అందించనున్నారు. విద్యార్థులు ఉదయం పూట ఆకలితో పాఠశాలలు, జూనియర్ కళాశాలలకు వెళ్లకుండా ఆరోగ్యకరమైన అల్పాహారం తీసుకుని ఉత్సాహంగా విద్యను అభ్యసించేలా చేయడం ఈ కార్యక్రమ ప్రధాన ఉద్దేశం. ప్రభుత్వం కేటాయించిన 8 వేల చదరపు అడుగుల షెడ్‌లో ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంతో ఈ కేంద్రీకృత వంటశాలను నిర్మించారు. ఆహార నాణ్యత, పరిశుభ్రత, భద్రతా ప్రమాణాలను అత్యున్నత స్థాయిలో నిర్వహించేందుకు ఆహార పరీక్షా ప్రయోగశాల,



పాల శుద్ధి, ప్రాసెసింగ్ విభాగం వంటి ప్రత్యేక సదుపాయాలను ఏర్పాటు చేశారు. అధునాతన ఆటోమేటెడ్ యంత్రాల ద్వారా గంటకు 5,600 ఇడ్లీలు, 2 వేల దోశలు, 3,600 పూరీలు తయారు చేసే సామర్థ్యం ఉంది. సాంబార్, కూరల తయారీ యూనిట్ల ద్వారా రెండు గంటల్లో 5 వేల మంది విద్యార్థులకు సరిపడా ఆహారం సిద్ధం చేయవచ్చు. బియ్యం వంట పరికరాల ద్వారా కేవలం 40 నిమిషాల్లో వెయ్యి మందికి సరిపడా అన్నం తయారు చేయగల సామర్థ్యం ఉంది. అదేవిధంగా ఆటోమేటిక్ కూరగాయల శుభ్రపరిచే, కోసే యూనిట్, శుద్ధి చేసిన నీటి ప్లాంట్, బాయిలర్ ప్లాంట్, కేంద్రీకృత గ్యాస్ బ్యాంక్ వంటి సదుపాయాలను ఏర్పాటు చేశారు. విద్యార్థులకు సమతుల్యమైన, పోషక విలువలతో కూడిన అల్పాహారం అందించేందుకు జాతీయ పోషకాహార సంస్థ సూచనల మేరకు వారాంతపు మెనూను రూపొందించారు. సోమవారం ఇడ్లీ--సాంబార్, మంగళవారం పూరీ--ఆలూ కుర్మా, బుధవారం దోశ చట్నీ, గురువారం ఉప్మా చట్నీ, శుక్రవారం చిరుధాన్యాల ఇడ్లీ

# కోల్ ఇండియా అపెక్స్ జేసీసీ ట్రేడ్ యూనియన్ ప్రతినిధులతో సెప్టెంబర్ 2న సమావేశం

**కోల్ ఇండియాలో కార్మిక చట్టాల అమలులో పురోగతి, కార్యాచరణ ప్రణాళికపై చర్చ**

**మంచిర్యాల, 27, ఆగస్టు (ప్రజాజ్యోతి):** కోల్ ఇండియా లిమిటెడ్ అపెక్స్ జాయింట్ కన్సల్టేటివ్ కమిటీ (జేసీసీ)లోని ట్రేడ్ యూనియన్ ప్రతినిధులతో సెప్టెంబర్ 2న కోల్‌కతాలోని న్యూ టౌన్‌లో ఉన్న కోల్ భవన్‌లో కోల్ ఇండియా ప్రధాన కార్యాలయంలో కీలక సమావేశం జరగనుంది. ఉదయం 11.30 గంటలకు సమావేశం ప్రారంభం కానుంది. కోల్ ఇండియా లిమిటెడ్ హెచ్‌ఆర్ అండ్ ఐఆర్ విభాగం జనరల్ మేనేజర్ దుర్గా ప్రసాద్ సమాల్ పేరుతో ఆగస్టు 27, 2026న జారీ చేసిన నోటీసు ద్వారా ఈ విషయాన్ని వెల్లడించారు. అపెక్స్ జేసీసీ ట్రేడ్ యూనియన్ ప్రతినిధులతో జరిగే సమావేశానికి సంబంధించిన ఎజెండాను కూడా నోటీసులో పేర్కొన్నారు.

**కార్మిక చట్టాల అమలుపై ప్రధాన చర్చ............**

సమావేశంలో ప్రధానంగా కోల్ ఇండియాలో కార్మిక చట్టాల అమలులో పురోగతి, కార్యాచరణ ప్రణాళికపై చర్చించనున్నారు. అలాగే అధ్యక్షుని అనుమతితో ఇతర అంశాలను కూడా సమావేశంలో చర్చించే అవకాశం ఉంది. సమావేశానికి హాజరయ్యే సభ్యులు షెడ్యూల్ ప్రకారం తమ పర్యటన కార్యక్రమాన్ని ముందుగానే తెలియజేయాలని కోల్ ఇండియా హెచ్‌ఆర్ అండ్ ఐఆర్ విభాగం కోరింది.

**నాలుగు ప్రధాన కార్మిక సంఘాల ప్రతినిధులు..........**

ఈ సమావేశానికి కోల్ ఇండియా అపెక్స్ జేసీసీ తరఫున వివిధ ప్రధాన కార్మిక సంఘాల ప్రతినిధులు హాజరుకానున్నారు. వారిలో బీఎంఎస్‌కు చెందిన కె. లక్ష్మారెడ్డి, హెచ్‌ఎంఎస్‌కు చెందిన హర్భజన్




సింగ్ సిద్ధూ, ఏఐటీయూసీకి చెందిన రామేంద్ర కుమార్, సీఐటీయూకు చెందిన డి.డి. రామానందన్ ఉన్నారు. వీరితో పాటు కోల్ ఇండియా చైర్మన్, డైరెక్టర్ (హెచ్‌ఆర్), డైరెక్టర్ (మార్కెటింగ్), డైరెక్టర్ (ఫైనాన్స్), డైరెక్టర్ (టెక్నికల్), డైరెక్టర్ (బీడీ)లకు, అలాగే ఈసీఎల్, బీసీసీఎల్, సీసీఎల్, డబ్ల్యూసీఎల్, ఎన్‌సీఎల్, ఎంసీఎల్, ఎస్ఈసీఎల్, సీపీఎండీఐఎల్ సంస్థల సీఎండీలకు సమావేశానికి సంబంధించిన నోటీసు పంపించారు. సంప్రదింపుల వివరాలు ఇలా ఉన్నాయి . ఈ సమావేశానికి సంబంధించి మరిన్ని వివరాల కోసం సీనియర్ మేనేజర్ (హెచ్‌ఆర్--ఐఆర్) ఫణేంద్ర కొరాడాను సంప్రదించాలని సూచించారు. ఆయన సంప్రదింపు నంబర్ 7387702129, ఈ-మెయిల్ చిరునామా నోటీసులో పేర్కొన్నారు. కోల్ ఇండియాలో కార్మిక చట్టాల అమలు, వాటి పురోగతి, భవిష్యత్ కార్యాచరణపై యాజమాన్యం--కార్మిక సంఘాల మధ్య చర్చలు జరగనున్న నేపథ్యంలో ఈ సమావేశానికి ప్రాధాన్యత ఏర్పడింది.

## తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల మహిళా డిగ్రీ కళాశాల మంచిర్యాలలో

**విద్యార్థినులకు హెచ్ఐవీ/ఎయిడ్స్‌పై అవగాహన**




**మంచిర్యాల, 27, ఆగస్టు (ప్రజాజ్యోతి):** విద్యార్థినుల్లో హెచ్ఐవీ/ఎయిడ్స్‌పై అవగాహన పెంపొందించే ఉద్దేశంతో తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల మహిళా డిగ్రీ కళాశాల మంచిర్యాలలో మంచిర్యాల ప్రభుత్వ జనరల్ ఆసుపత్రి సహకారంతో హెచ్ఐవీ అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా మంచిర్యాల ప్రభుత్వ జనరల్ ఆసుపత్రి వైద్య బృందం విద్యార్థినులకు హెచ్ఐవీ/ఎయిడ్స్‌కు సంబంధించిన పలు ముఖ్యమైన అంశాలపై అవగాహన కల్పించింది. హెచ్ఐవీకి కారణాలు, వ్యాధి సంక్రమించే మార్గాలు, తీసుకోవాల్సిన జాగ్రత్తలను వనరుల వ్యక్తులు వివరించారు. హెచ్ఐవీని సకాలంలో గుర్తించడం, సరైన వైద్య చికిత్స పొందడం, వైద్యుల సూచనల మేరకు చికిత్సను క్రమం తప్పకుండా కొనసాగించడం ఎంతో ముఖ్యమని తెలిపారు. హెచ్ఐవీతో జీవిస్తున్న వారికి కుటుంబ సభ్యులు, సమాజం నుంచి భావోద్వేగపరమైన మద్దతు అందించాలని సూచించారు. అలాగే హెచ్ఐవీపై సమాజంలో ఉన్న అపోహలను తొలగించాల్సిన అవసరం ఉందని, హెచ్ఐవీ బాధితుల పట్ల వివక్ష చూపకుండా సహానుభూతి, సహాయక భావనతో వ్యవహరించాలని వైద్య బృందం సూచించింది. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ పత్తి సునీత, వైస్ ప్రిన్సిపల్ వహీదా ఆధ్వర్యంలో కళాశాల హెల్త్ సూపర్‌వైజర్ డి. లక్ష్మి ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కళాశాల అధ్యాపకులు, సిబ్బంది, విద్యార్థినులు పాల్గొన్నారు.

## అర్హులైన ప్రతి ఒక్కరి పేరు ఓటరు జాబితాలో ఉండాలి

**డీసీసీ అధ్యక్షురాలు ఆత్రం సుగుణక్క**



**ఆసిఫాబాద్ ఆగస్టు 27 ప్రజా జ్యోతి** ఓటరు జాబితా ప్రత్యేక సవరణ (ఎస్ఐఆర్) ప్రక్రియలో భాగంగా అర్హత ఉన్న ప్రతి పౌరుడి పేరు ఓటరు జాబితాలో నమోదు అయ్యేలా కాంగ్రెస్ నాయకులు, శ్రేణులు నిశితంగా పరిశీలించాలని కుమురంభీమ్ ఆసిఫాబాద్ డీసీసీ అధ్యక్షురాలు ఆత్రం సుగుణక్క పిలుపునిచ్చారు మండలంలోని అంకుసాపూర్, తుంపల్లి, గోవింద్‌పూర్ గ్రామాల్లో గురువారం నిర్వహించిన ఎస్ఐఆర్ గ్రామసభల్లో నియోజకవర్గ ఇన్‌చార్జి శ్యాంనాయక్, నియోజకవర్గ సర్ కో-ఆర్డినేటర్ రాంభోపాల్‌లతో కలిసి ఆమె పాల్గొన్నారు. ఈ సందర్భంగా గ్రామసభలలో సుగుణక్క మాట్లాడుతూ ఓటు హక్కు రాజ్యాంగం పౌరులందరికీ కల్పించిన ప్రాథమిక హక్కు అని అన్నారు. ఓటరు జాబితాలోని పేర్లు, చిరునామాలు లేదా ఇతర వివరాల్లో ఏవైనా తప్పులు ఉంటే సరిచేసుకోవడానికి ప్రభుత్వం కల్పించిన ఈ అవకాశాన్ని ప్రజలందరూ సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ ఇరుకుల మంగ, ఆసిఫాబాద్ మున్సిపల్ ఫ్లోర్ లీడర్ అబ్దుల్లా భాయ్, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు రాపర్తి మురళి, డీసీసీ ఉపాధ్యక్షుడు తరిఖ్, అంకుసాపూర్ సర్పంచ్ తేకం గంగారాం, తుంపల్లి సర్పంచ్ తేకం ఈశ్వరి బాయి, గోవింద్‌పూర్ సర్పంచ్ లక్ష్మి చరణ్, బిఎల్ఏలు ప్రభాకర్, రాజ్‌కుమార్, సూపర్‌వైజర్లు, స్థానిక నాయకులు, గ్రామస్థులు పాల్గొన్నారు.

# సింగరేణి పరిరక్షణకు ఐక్య పోరాటాలు అవసరం

## - హెచ్ఎంఎస్.



**మందమర్రి, ఆగస్టు 27( ప్రజాజ్యోతి ):** సింగరేణి సంస్థ, కార్మికుల హక్కుల పరిరక్షణకు ఐక్య పోరాటాలు అవసరమని హెచ్ఎంఎస్ నాయకులు పిలుపునిచ్చారు.మందమర్రి ప్రెస్‌క్లబ్‌లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు.గుర్తింపు పొందిన కార్మిక సంఘాలు కార్మికుల సమస్యలపై ఆశించిన స్థాయిలో పోరాడటం లేదని నాయకులు ఆరోపించారు.కార్మిక హక్కులను కాపాడటంతో పాటు సింగరేణిలో నూతన గనుల ఏర్పాటు, ఉపాధి అవకాశాల పరిరక్షణకు సంఘాలు మరింత బాధ్యతగా వ్యవహ రించాల్సిన అవసరం ఉందన్నారు.గత పదేళ్ల బీఆర్ఎస్ పాలనతో పాటు ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలోనూ కొత్త బొగ్గు గనుల ప్రారంభంలో ఆశించిన పురోగతి లేదని విమర్శించారు. వైద్య మండ లి పునఃప్రారంభమైన అనంతరం చోటుచేసుకుంటున్న పరిణామాల పై కూడా వారు ఆందోళన వ్యక్తం చేశారు.300 మందికి పైగా హాజ రు నమోదైన కార్మికులను అనర్హులుగా ప్రకటిం చడం వల్ల నిజమైన ప్రమాద బాధితులకు అన్యాయం జరుగుతోందని పేర్కొన్నారు. సింగరేణిలో కార్మికుల సంఖ్య తగ్గిపోవడం, ఉత్పత్తికి అవసరమైన డ్రిల్లింగ్ పరికరాలు, బిట్లు సకాలంలో అందకపోవడం వంటి సమస్యలను నాయకులు ప్రస్తావించారు. వనరులు, సౌకర్యాల కొరత కు కార్మికులను బాధ్యులను చేయడం సరికాదన్నారు.కేంద్ర ప్రభుత్వ ఆర్థిక విధానాల ప్రభావాన్ని ఎదుర్కొంటూ సింగరేణిని పరిరక్షించా ల్సిన బాధ్యత రాష్ట్ర ప్రభుత్వం పైనా, కార్మిక సంఘాలపైనా ఉందన్నారు.గనుల మూసివేత, బహిరంగ గనుల విస్తరణను అడ్డుకోవడంతో పాటు కొత్త గనుల సాధన కోసం హెచ్ఎంఎస్ రాజీలేని పోరాటం కొనసాగిస్తుం దని స్పష్టం చేశారు.సింగరేణిపై ఆధారపడిన కుటుంబాల భవిష్యత్, ఉద్యోగాల రక్షణ కోసం ఉన్నత విద్యావంతులైన యువ కార్మికులు ముందుకు వచ్చి ఐక్య ఉద్యమాల్లో భాగస్వాములు కావాలని నాయకులు పిలుపునిచ్చారు.

# ఎస్ఐఆర్‌పై అవగాహన కల్పించాలి



**మంచిర్యాలరూరల్ ఆగస్టు27(ప్రజాజ్యోతి)** ఎస్ఐఆర్ ప్రక్రియను పకడ్బందీగా నిర్వహించి, ఎలాంటి పొరపాట్లకు తావులేకుండా పూర్తి చేయాలని జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) వి. రాములు అధికారులను ఆదేశించారు.గురువారం హాజీపూర్ మండలం కర్ణమామిడి గ్రామపంచాయతీ కార్యాలయంలో నిర్వహించిన ఎస్ఐ ఆర్ గ్రామసభకు ఆయన హాజరై అధికారులకు పలు సూచనలు చేశారు. ఎస్ఐఆర్‌లో భాగంగా రూపొందించిన ముసాయిదా ఓటర్ల జాబితాను ప్రజలకు అందుబాటులో ఉంచాలని సూచించారు. జాబితాలో గుర్తించిన అనామలీస్ ఓటర్ల వివరాలను గ్రామసభలో ప్రజలకు చదివి వినిపించాలని బూత్ స్థాయి అధికారులను ఆదేశించారు.అలాగే ఏఎస్‌డీ (ఆబ్సెంట్, షిఫ్టెడ్, డెడ్) ఓటర్లకు నిబంధనల ప్రకారం నోటీసులు జారీ చేసి,తదుపరి ప్రక్రియను పూర్తి చేయాలని సూచించారు. ఎన్నికల సంఘం మార్గదర్శకాలను అనుసరిస్తూ ప్రతి దశను పారదర్శకంగా,నిర్ణీత గడువులో పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో హాజీపూర్ మండల తహసీల్దార్ పుష్పలతతో పాటుగా బూత్ స్థాయి అధికారులు, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

## సింగరేణి కార్మికుల న్యాయమైన సమస్యల పరిష్కారానికి సమ్మెకు సన్నద్ధం కావాలి

**ఏఐటీయూసీ డిప్యూటీ ప్రధాన కార్యదర్శులు కందికట్ల వీరభద్రయ్య, ముస్కె సమ్మయ్య**



**మంచిర్యాల, 27, ఆగస్టు (ప్రజాజ్యోతి):** సింగరేణి కార్మికుల న్యాయమైన సమస్యల పరిష్కారం కోసం సమ్మెకు సన్నద్ధం కావాలని సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్ ఏఐటీయూసీ డిప్యూటీ ప్రధా న కార్యదర్శులు కందికట్ల వీరభద్రయ్య, ముస్కె సమ్మయ్య పిలుపు నిచ్చారు. సింగరేణి గుర్తింపు కార్మిక సంఘం సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్ ఏఐటీయూసీ శ్రీరాంపూర్ బ్రాంచ్ ఆధ్వర్యంలో ఆర్కే-5, ఆర్కే-7 గనుల వద్ద నిర్వహించిన గేట్ మీటింగ్‌లలో వారు ముఖ్య అతిథులుగా పాల్గొని మాట్లాడారు. సిం గరేణి కార్మికు ల సమస్యల పరిష్కారం కోసం ఏఐటీయూసీ ఆధ్వర్యం లో యాజమా న్యానికి సమ్మె నోటీసు ఇచ్చామని తెలిపారు. పలు దఫాలుగా యాజ మాన్యంతో చర్చలు జరిపినప్పటికీ సమస్యలకు పరిష్కారం లభించలే దన్నారు. ఈ నెల 27న డిప్యూటీ చీఫ్ లేబర్ కమిషనర్ ఆధ్వర్యంలో యాజమాన్యంతో చర్చలు జరగనున్నాయని, ఆ చర్చలు విఫలమైతే ఫెయిల్యూర్ రిపోర్టు తీసుకుని సింగరేణిలోని అన్నికార్మిక సంఘాల ను కలుపుకొని సమ్మె నిర్వహిస్తామని హెచ్చరించారు. సమ్మె నోటీసు లో ప్రధానంగా కోల్ ఇండియాలో అధికారులు, కార్మికులకు అమల వుతున్న పెర్క్స్‌పై విధిస్తున్న ఆదాయపు పన్నును సింగరేణిలో కూడా యాజమాన్యమే చెల్లించాలని డిమాండ్ చేసినట్లు తెలిపారు. కార్మికు లసొంత ఇంటి కలను సాకారం చేసేందుకు సహకరించాలని, ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో కంపెనీకి వచ్చిన లాభాల్లో కార్మికులకు 35 శాతం లాభాల వాటా చెల్లించాలని కోరారు. ప్రభుత్వాల నుంచి సంస్థకు రావాల్సిన రూ.56 వేల కోట్ల బకాయిలను తక్షణమే చెల్లిం చాలని డిమాండ్ చేశారు. అలాగే ప్రతి నెలా మెడికల్ బోర్డును నిర్వ హించి అర్హులైన కార్మికులను మెడికల్ ఇన్వాలిడేషన్ చేయాలని, మైనింగ్ స్టాఫ్ ట్రేడ్స్‌మెన్ అండర్‌గ్రౌండ్‌లో అన్‌ఫిట్ అయితే సర్ఫేస్‌లో తగిన ఉద్యోగ అవకాశం కల్పించాలని కోరారు. ఈ తదితర డిమాండ్లను సమ్మె నోటీసులో పొందుపరిచి నట్లు వారు తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం, సింగరేణి యాజమాన్యం కార్మికుల సమస్యల పరిష్కారానికి సహకరించాలని, లేనిపక్షంలో అన్ని కార్మిక సంఘా లను కలుపుకొని సమ్మెను ఉధృతం చేస్తామని ఏఐటీయూసీ నాయకు లు హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో బ్రాం చ్ ఉపాధ్యక్షులు కొట్టె కిషన్‌రావు, ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి అఫ్రోజ్ ఖాన్, ఫిట్ కార్యదర్శులు గుడిగంటి నరసింగారావు, మార పల్లి సారయ్య, మైనింగ్ స్టాఫ్ రీజియన్ ఉపాధ్యక్షులు రాజశేఖర్, ట్రేడ్స్‌మెన్ కార్య దర్శి సురేష్, నాయకులు మల్లేష్, జి.పి.రావు, రేగుల శంకర్, పవన్, సంతోష్, కోడి వెంకటేశం, మధుకర్ తదితరులు పాల్గొన్నారు.

## డబుల్ బెడ్‌రూం ఇళ్ల జాబితాపై బీఆర్ఎస్ ఆగ్రహం...



**మందమర్రి, ఆగస్టు 27 (ప్రజాజ్యోతి ) :** డబుల్ బెడ్‌రూం ఇళ్ల కేటాయింపుల కోసం రూపొందించిన లబ్ధిదారుల జాబితాలో అవకతవకలు జరిగాయని ఆరోపిస్తూ బీఆర్ఎస్ నాయకులు గురువారం ఎంఆర్ఓ కార్యాలయం ఎదుట నిరసన చేపట్టారు. అర్హులైన పేదలను పక్కనపెట్టి అనర్హులకు చోటు కల్పించారని ఆరోపించారు. పేదల సొంతింటి కలను రాజకీయాలు, అక్రమాలకు వేదికగా మార్చొద్దని వారు అధికారులను డిమాండ్ చేశారు. జాబితాలోని ప్రతి పేరుపై సమగ్రంగా విచారణ జరిపి, అర్హతలను పునఃపరిశీలించాలని కోరారు. అనర్హుల పేర్లను తొలగించి, నిజమైన అర్హులకు మాత్రమే ఇళ్లు దక్కేలా పారదర్శ కంగా ఎంపిక ప్రక్రియ నిర్వహించాలని డిమాండ్ చేశారు. అర్హులైన పేదలకు అన్యాయం జరిగితే సహించేది లేదని, కేటా యింపుల్లో పూర్తి పారదర్శకత ఉండేలా అధికారులు చర్యలు తీసు కోవాలని నాయకులు స్పష్టం చేశారు. అనంతరం తమ డిమాండ్ల తో కూడిన వినతిపత్రాన్ని డిప్యూటీ తహసీల్దార్‌కు అందజేశారు.

## పదవి విరమణ పొందనున్న సీహెచ్పీ(కార్పొరేట్) జీఎం ను సత్కరించిన జీఎం మునిగంటి శ్రీనివాస్



**మంచిర్యాల, 27, ఆగస్టు (ప్రజాజ్యోతి):** జీఎం సీహెచ్పీ( కార్పొరే ట్) ఎస్ వి రామ మూర్తిని శ్రీరాంపూర్ జీఎం కార్యాలయంలోని తన ఛాంబర్లో గురువారం జీఎం మునిగంటి శ్రీనివాస్ శాలు వాతో సత్కరించారు. ఆగస్టు నెలతో రామ మూర్తి గారు పదవి విర మణ పొందనున్న సందర్భంగా ఏరియా ఈ అండ్ ఎం అధికా రులు, వివిధ విభాగాల అధిపతులు, ఇతర అధికారుల సమక్షంలో సన్మానించారు. దాదాపుగా 38 ఏళ్ల పాటు వివిధ హోదాలలో రామ మూర్తిగారు సవర్ధవంతంగా రాణించినట్లు జీఎం కొనియా డారు. ఈ అండ్ ఎం విభాగంలో వివిధ హోదాలతో పాటు ఏరి యా ఇంజనీర్గా వారి సేవలు శ్రీరాంపూర్ ఏరియా ఈ అండ్ ఎం అధికారులు గుర్తుచేసుకున్నారు. గురువారం మర్యాద పూర్వకంగా శ్రీరాంపూర్ ఏరియాకు విచ్చేసిన సందర్భంగా రామ మూర్తికి ఈ సత్కార కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎస్ ఓ టూ జీఎం కృష్ణ ప్రసాద్, డీజీఎం(పర్సనల్) ఎస్. అనిల్ కుమార్, ఏరియా ఇంజనీర్ సురేష్, ఏజీఎం(ఫైనాన్స్) సుమలత, ఏజీఎం (సివిల్) ఆనంద్ కుమార్, ఏరియా పర్చేజ్ ఆఫీసర్ చంద్రశేఖర్, డీజీఎం(వర్క్‌షాప్) కృష్ణారెడ్డి, డీజీఎం(స్టోర్స్) మల్లయ్య, డీజీఎం (ఐఈడీ) రాజన్న, సీహెచ్పీ ఇంచార్జ్ చంద్రలింగం, ఐకే ఓసీ ప్రాజెక్ట్ ఇంజనీర్ రామకృష్ణ, ఎస్ఆర్పీ ఓసీపీ ప్రాజెక్ట్ ఇంజనీర్ నాగరాజు, ఎస్టేట్స్ మేనేజర్ వరలక్ష్మి, ఎన్విరాన్మెంటల్ ఆఫీసర్ హనుమాన్ గౌడ్, సీనియర్ ఐటీ ప్రోగ్రామర్ శ్రీనివాస్, క్వాలిటీ (ఇంఛార్జ్) మురళి కృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

# ప్రధానంగా పారిశుద్ధ్య, డ్రైనేజీ, వాటర్, స్ట్రీట్ లైట్లు ఇతర మౌళిక వసతులను కల్పించాలి

## మంచిర్యాల కార్పొరేషన్ కార్పొరేటర్ లు మంచిర్యాల కార్పొరేషన్ మేయర్, కమీషనర్ ల సమక్షంలో....

## వివిధ డివిజన్ల కార్పొరేటర్ల తో జీఎం మునిగంటి శ్రీనివాస్ సమీక్షా సమావేశం



**మంచిర్యాల, 27, ఆగస్టు (ప్రజాజ్యోతి):** మంచిర్యాల జిల్లా శ్రీరాంపూర్ జీఎం కార్యలయంలోని కాన్ఫరెన్స్ హాల్లో మంచిర్యాల కార్పోరేషన్ వివిధ డివిజన్ల కార్పోరేటర్లతో శ్రీరాంపూర్ ఏరియా జనరల్ మేనేజర్ మునిగంటి శ్రీనివాస్ సమీక్షాసమావేశంను గురువారం నిర్వహించారు. మంచిర్యాల కార్పోరేషన్ మేయర్ ధర్ని మధుకర్, మున్సిపల్ కమీషనర్ అన్వేష్, డిప్యూటీ మేయర్ సల్ల రమ్య సమక్షంలో జరిగిన ఈ సమావేశంలో 2 వ డివిజన్ కార్పోరేటర్ యశోద, 7 వ డివిజన్ కార్పోరేటర్ ఏల్పుల రవీందర్, 24 వ డివిజన్ కార్పోరేటర్ బొడ్డు స్వప్న తిరుపతి, 25 వ డివిజన్ కార్పోరేటర్ తోట రజిత శ్రీనివాస్, 29 వ డివిజన్ కార్పోరేటర్ బండారి సుధాకర్, 31 వ డివిజన్ కార్పోరేటర్ తాళ్ల సంపత్, 34 డివిజన్ కార్పోరేటర్ అగ్గు సాగర్ లు పాల్గొన్నారు. డివిజన్ల వారీగా వివిధ సమస్యలను కార్పోరేటర్ లు మేయర్ సమక్షంలో జీఎం దృష్టికి తీసుకువచ్చారు. ప్రధానంగా పారిశుద్య, డ్రైనేజీ, వాటర్, స్ట్రీట్ లైట్లు ఇతర మౌళిక వసతులను కల్పించాలని జీఎం గారిని కోరారు. ప్రధానంగా ఆర్‌డఆర్ కాలనీలో చేపట్టాల్సిన అంశాలను లేవనెత్తారు. తమ కార్పోరేటర్ లు లేవనెత్తిన అంశాలను త్వరితగతిన పూర్తిచేయాలని పరస్పర సహకారంతో సమస్యలను పరిష్కరానికి కృషిచేద్దామని మేయర్ ధర్ని మధుకర్ కోరారు. వివిధ డివిజన్ల కార్పోరేటర్‌లు లేవనెత్తిన సమస్యలను వీలున్నంత త్వరగా పూర్తిచేస్తామని జీఎం మునిగంటి శ్రీనివాస్ హామీ ఇచ్చారు. తమ పరిధిలో ఉన్న పనులు వెంటనే పూర్తిచేస్తాం, కార్పోరేట్ స్థాయిలో అనుమతులు తీసుకోవాల్సిన వాటితో పాటు ప్రభుత్వశాఖల నుంచి అనుమతులు పొందాల్సిన వాటిని ప్రణాళికాబద్ధంగా పూర్తిచేస్తామని తెలిపారు. ప్రభుత్వ శాఖల అనుమతులతో పూర్తిచేయాల్సిన వాటికి మేయర్ గారు ప్రత్యేక చొరవతో సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎస్ఓటూ జీఎం కృష్ణప్రసాద్, డీజీఎం(పర్సనల్) అనిల్ కుమార్, ఏజీఎం(సివిల్) ఆనంద్ కుమార్, ఏరియా ఇంజనీర్ సురేష్, డీజీఎం(వర్క్షాప్) కృష్ణారెడ్డి, ఎస్టేట్స్ మేనేజర్ వరలక్ష్మి, సీనియర్ పీఓ ప్రశాంత్, మున్సిపల్ అధికారులు, శ్రీరాంపూర్ ఏరియా ఇతర అధికారులు పాల్గొన్నారు.

# నేడు రక్షా బంధన్

### సోదరి సోదర బంధానికి ప్రతిరూపం రక్షా బంధన్

**మంచిర్యాల, 27, ఆగస్టు (ప్రజాజ్యోతి):** భారతదేశం పండుగల పుట్టినిల్లు. ప్రతి పండుగ వెనుక ఒక చారిత్రక, ఆధ్యాత్మిక, సామాజిక సందేశం దాగి ఉంటుంది. అలాంటి విశిష్టమైన పండుగల్లో రక్షా బంధన్ ఒకటి. అన్నాచెల్లెళ్ల మధ్య ప్రేమ, ఆప్యాయత, పరస్పర గౌరవం, బాధ్యతలకు ప్రతీకగా ఈ పండుగను దేశవ్యాప్తంగా జరుపుకుంటారు. సింగరేణి బొగ్గు గనుల ప్రాంతాల్లో రాఖీ పౌర్ణమిగా కూడా పిలువబడే ఈ పండుగ కుటుంబ బంధాలను మరింత బలపరుస్తుంది. రక్షా బంధన్ రోజున సోదరి తన సోదరుడి చేతికి రాఖీ కట్టి, అతని సుఖసంతోషాలు, ఆయురారోగ్యాలను కోరుకుంటుంది. సోదరుడు తన సోదరికి రక్షణగా నిలుస్తానని, ఆమెకు అండగా ఉంటానని హామీ ఇస్తాడు. అయితే ఆధునిక కాలంలో ఈ రక్షణ భావన కేవలం అన్న నుంచి చెల్లెలికి మాత్రమే పరిమితం కాకుండా పరస్పర ప్రేమ, సహకారం, బాధ్యతలకు ప్రతీకగా మారింది. సోదరి కూడా సోదరుడి జీవితంలోని ప్రతి కష్టసుఖంలో తోడుగా నిలుస్తుంది. రాఖీ కట్టడం ఒక చిన్న ఆచారంలా కనిపించినప్పటికీ, దాని వెనుక ఉన్న భావోద్వేగం ఎంతో గొప్పది. మనిషి జీవితంలో ఆస్తులు, అంతస్తులు, సంపదలు మారవచ్చు. కానీ రక్తసంబంధాల ద్వారా ఏర్పడే అనుబంధం మాత్రం జీవితాంతం నిలిచే విలువైన సంపద. బాల్యంలో కలిసి పెరిగిన అన్నాచెల్లెళ్లు పెద్దయ్యాక వేర్వేరు ప్రాంతాల్లో నివసించినా, రక్షా బంధన్ వారిని మరోసారి ఆత్మీయంగా కలిపే సందర్భంగా నిలుస్తుంది. రక్షా బంధన్‌కు సంబంధించి భారతీయ చరిత్ర, పురాణాల్లో అనేక కథలు ప్రాచుర్యంలో ఉన్నాయి. శ్రీకృష్ణుడు--ద్రౌపది, పురుషోత్తముడు--అలెగ్జాండర్ భార్య రోక్సానా, రాణి కర్ణావతి--హుమాయూన్‌కు సంబంధించిన కథనాలను రక్షా బంధన్ భావనతో అనుసంధానిస్తూ చెబుతారు. వీటిలో చారిత్రక ఆధారాల విషయంలో భిన్నాభిప్రాయాలు ఉన్నప్పటికీ, ప్రేమ, విశ్వాసం, రక్షణ అనే విలువలను ఈ కథలు ప్రతిబింబిస్తాయి. నేటి వేగవంతమైన జీవనశైలిలో కుటుంబ సభ్యుల మధ్య గడిపే సమయం తగ్గిపోతోంది. ఉద్యోగాలు, విద్య, వలసలు, పట్టణ జీవనం కారణంగా అన్నాచెల్లెళ్లు దూరంగా ఉంటున్నారు. ఇలాంటి పరిస్థితుల్లో రక్షా బంధన్ కుటుంబ బంధాలను గుర్తు చేసే ఆత్మీయ సందర్భంగా మారింది. ఒకరినొకరు పలకరించడం, కలిసి భోజనం చేయడం, ఆశీర్వాదాలు తీసుకోవడం ద్వారా కుటుంబ సంబంధాలు మరింత బలపడతాయి. అయితే రక్షా బంధన్‌ను కేవలం బహుమతులు ఇచ్చిపుచ్చుకునే పండుగగా మార్చడం సరికాదు. మార్కెట్ సంస్కృతి పెరిగిన నేపథ్యంలో ఖరీదైన రాఖీలు, బహుమతులు, అలంకరణలకు ప్రాధాన్యత పెరుగుతోంది. అసలు పండుగ స్ఫూర్తి మాత్రం ప్రేమలో, ఆప్యాయతలో, బాధ్యతలో ఉంది. సోదరుడు ఇచ్చే బహుమతి కంటే సోదరి పట్ల చూపించే గౌరవం, ఆపదలో అందించే సహాయం ఎంతో విలువైనవి. మహిళల భద్రత, గౌరవం గురించి సమాజం చర్చిస్తున్న ప్రస్తుత సమయంలో రక్షా బంధన్ సందేశాన్ని మరింత విస్తృతంగా చూడాల్సిన అవసరం ఉంది. ప్రతి స్త్రీకి కుటుంబంలోనే కాకుండా సమాజంలోనూ గౌరవం, సమాన హక్కులు, భద్రత కల్పించాలి. సోదరుడు తన సోదరిని కాపాడటం మాత్రమే కాకుండా మహిళలందరినీ గౌరవించే సంస్కారాన్ని పెంపొందించుకోవాలి. అదే రక్షా బంధన్‌కు నిజమైన అర్థాన్ని ఇస్తుంది. పర్యావరణ పరిరక్షణకు కూడా ఈ పండుగను అనుసంధానం చేయవచ్చు. ప్లాస్టిక్‌తో తయారైన రాఖీలకు బదులుగా పర్యావరణహితమైన రాఖీలను ఉపయోగించడం, స్థానిక కళాకారులు తయారు చేసిన రాఖీలను కొనుగోలు చేయడం ద్వారా వారికి ఆర్థికంగా అండగా నిలవవచ్చు. పండుగ ఆనందంతో పాటు పర్యావరణ బాధ్యతను కూడా గుర్తుంచుకోవాలి. అలాగే పండుగల సమయంలో కల్తీ నెయ్యి, సింథటిక్ రంగులు, చెడిపోయిన కోవా, నాణ్యత లేని పాల పదార్థాలతో మిఠాయిల తయారీ, విక్రయాలు పెరిగే అవకాశం ఉన్నందున ప్రజలు అప్రమత్తంగా ఉండాలి. విషపూరిత, నాణ్యతలేని మిఠాయిలకు దూరంగా ఉంటూ ఆరోగ్యాన్ని




కాపాడుకోవాలి. అధికారులు కూడా ఆహార నాణ్యతపై ప్రత్యేక దృష్టి సారించి తనిఖీలు నిర్వహించాలి. రక్షా బంధన్ మరో ముఖ్యమైన సందేశం ఐక్యత. నేడు కులం, మతం, ప్రాంతం, భాష వంటి విభజనలు సమాజంలో కనిపిస్తున్నాయి. రాఖీ బంధం మాత్రం మనుషుల మధ్య ప్రేమ, విశ్వాసం, సోదరభావం పెంపొందించాలనే సందేశాన్ని ఇస్తుంది. పరస్పర గౌరవం, సహకారం, మానవత్వం ఉన్నప్పుడే సమాజం బలపడుతుందని సామాజిక విశ్లేషకులు ఆళవందార్ వేణు మాధవ్ ఈ సందర్భంగా తెలిపారు . మొత్తంగా చూస్తే రక్షా బంధన్ ఒక కుటుంబ పండుగ మాత్రమే కాదు; మానవ సంబంధాల విలువను గుర్తుచేసే గొప్ప సామాజిక సందేశం. రాఖీ అనే చిన్న దారం ప్రేమ, విశ్వాసం, బాధ్యత, ఆప్యాయతలను ముడిపెడుతుంది. ఆధునిక జీవనంలో ఎంత మార్పు వచ్చినా కుటుంబ బంధాల విలువ తగ్గకూడదు. రక్షా బంధన్ సందర్భంగా అన్నాచెల్లెళ్లు పరస్పరం ప్రేమను పంచుకోవడంతో పాటు, ఒకరికి ఒకరు అండగా నిలబడే సంకల్పం తీసుకోవాలి. అదే ఈ పవిత్ర పండుగకు నిజమైన ప్రత్యేకత, సమాజానికి రక్షా బంధన్ అందించే శాశ్వత సందేశమని ఆళవందార్ వేణు మాధవ్ తెలిపారు.

## రాజంపేటలో ప్రత్యేక గ్రామ సభ

**ఓటరు జాబితా సవరణపై ప్రజలకు అవగాహన**



**ఆసిఫాబాద్ , ఆగస్టు 27 ప్రజా జ్యోతి** ఆసిఫాబాద్ మండల కేంద్రంలోని రాజంపేట గ్రామపంచాయతీ పరిధిలో ప్రత్యేక సమగ్ర ఓటరు జాబితా సవరణ కార్యక్రమంలో భాగంగా గురువారం ప్రత్యేక గ్రామ సభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఓటరు జాబితా పరిశీలన, ముసాయిదా జాబితాలోని వివరాలు, గైర్హాజరు, వలస వెళ్లిన, మృతి చెందిన, రెండుసార్లు నమోదైన ఓటర్ల వివరాలు, కొత్త ఓటర్ల నమోదు, ఓటరు వివరాల సవరణలు, అభ్యంతరాల స్వీకరణపై ప్రజలకు అవగాహన కల్పించారు.సర్పంచ్ బూరస పోచయ్య మాట్లాడుతూ ప్రతి అర్హుడి పేరు ఓటరు జాబితాలో ఉండేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. ప్రజలు తమ ఓటరు వివరాలను పరిశీలించి తప్పులు ఉంటే సంబంధిత బూత్ స్థాయి అధికారులకు తెలియజేయాలని కోరారు. కార్యక్రమంలో వార్డు సభ్యుల ఫోరం జిల్లా కన్వీనర్ గులాం జావీద్, వార్డు సభ్యులు, పంచాయతీ సిబ్బంది, రెవెన్యూ అధికారులు, ఓటరు నమోదు అధికారులు, అంగన్‌వాడీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## జర్మనీలో ఫిజియోథెరపిస్టులకు ఉద్యోగావకాశాలు

**మంచిర్యాల జిల్లా ఉపాధి అధికారి**


GOVERNMENT OF TELANGANA
DEPARTMENT OF LABOUR, EMPLOYMENT, TRAINING AND FACTORIES

Mancherial,
Dt: 27-08-2026

**మంచిర్యాల, 27, ఆగస్టు (ప్రజాజ్యోతి):** తెలంగాణ ఓవర్సీస్ మ్యాన్‌పవర్ కంపెనీ లిమిటెడ్ (టామ్‌కామ్) ఆధ్వర్యంలో జర్మనీలో ఫిజియోథెరపిస్టులుగా ఉద్యోగాలు పొందేందుకు అర్హులైన అభ్యర్థుల నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు మంచిర్యాల జిల్లా ఉపాధి అధికారి తెలిపారు. బీపిటి, ఎంపిటి విద్యార్హత కలిగిన అభ్యర్థులు ఈ ఉద్యోగాలకు అర్హులని, వైద్యపరమైన క్లినికల్ అనుభవం ఉన్న వారికి ప్రాధాన్యత ఉంటుందని పేర్కొన్నారు. అభ్యర్థుల వయస్సు 43 సంవత్సరాల లోపు ఉండాలని, జర్మన్ భాషలో బి1 స్థాయి అర్హత తప్పనిసరిగా ఉండాలని తెలిపారు. అనుభవం లేని అభ్యర్థులు కూడా దరఖాస్తు చేసుకోవచ్చని వెల్లడించారు. జర్మనీలో ఉద్యోగం పొందిన వారికి ప్రారంభంగా నెలకు ఆ2, 500 నుంచి ఆ2,900 వరకు వేతనం, జర్మన్ లైసెన్స్ పొందిన తర్వాత నెలకు ఆ2,800 నుంచి ఆ3,500 వరకు వేతనం లభిస్తుందని తెలిపారు. యజమాని ద్వారా పూర్తి ఆరోగ్య బీమా సదుపాయం, సంవత్సరానికి 25 నుంచి 30 రోజుల సెలవులు, శాశ్వత నివాసం (పర్మనెంట్ రెసిడెన్సీ) పొందే అవకాశం ఉంటుందని పేర్కొన్నారు. టామ్‌కామ్ ద్వారా అభ్యర్థులకు జర్మన్ భాషా శిక్షణ, డాక్యుమెంటేషన్ ప్రాసెసింగ్, ప్లేస్‌మెంట్ సహాయం, వీసా ప్రాసెసింగ్, విమాన టికెట్ తదితర సేవలను అందిస్తామని తెలిపారు. జర్మనీలో ఉద్యోగం పొందే వరకు ప్రతి దశలో పూర్తి సహకారం అందిస్తామని పేర్కొన్నారు. అర్హులైన అభ్యర్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని జిల్లా ఉపాధి అధికారి సూచించారు. మరిన్ని వివరాలకు 08035524946 ఫోన్ నంబర్‌లో లేదా ఈ-మెయిల్ ద్వారా సంప్రదించాలని కోరారు.

# కోయగూడెం ఓసీ-3 సింగరేణికి కేటాయించాలి

**ఏబీకేఎంఎస్--బీఎంఎస్ కార్యదర్శి, నేషనల్ డస్ట్ ప్రివెన్షన్ కమిటీ సభ్యులు పి. మాధవ నాయక్**

**కేంద్ర మంత్రి జి. కిషన్‌రెడ్డికి ఏబీకేఎంఎస్--బీఎంఎస్ విజ్ఞప్తి**



**మంచిర్యాల, 27, ఆగస్టు (ప్రజాజ్యోతి):** కోయగూడెం ఓసీ-3 బొగ్గు బ్లాకును సింగరేణి కాలరీస్ కంపెనీ లిమిటెడ్‌కు కేటాయించేలా చర్యలు తీసుకోవాలని సింగరేణి కోల్ మైన్స్ కార్మిక సంఘ్ (ఏబీకేఎంఎస్--బీఎంఎస్) నేషనల్ డస్ట్ ప్రివెన్షన్ కమిటీ సభ్యులు పి. మాధవ నాయక్, ఇతర నాయకులు మరోసారి కేంద్ర మంత్రి జి. కిషన్‌రెడ్డికి ఏబీకేఎంఎస్--బీఎంఎస్ తరపున కోరారు ఈ సందర్భంగా అయన మత్తడుఓ, ఈ నెల 9న కేంద్ర బొగ్గు, గనుల శాఖ మంత్రి జి. కిషన్‌రెడ్డిని కోరిన విజ్ఞప్తిపై మంత్రి సానుకూలంగా స్పందించడం పట్ల సింగరేణి కోల్ మైన్స్ కార్మిక సంఘ్ (ఏబీకేఎంఎస్--బీఎంఎస్) హర్షం వ్యక్తం చేస్తున్నట్లు తెలిపారు. కోయగూడెం ఓసీ-3 బ్లాకు వేలం ప్రక్రియలో సింగరేణి యాజమాన్యాన్ని పాల్గొనకుండా చేసి ప్రైవేట్ సంస్థకు కేటాయించినప్పటికీ, ఇప్పటివరకు అక్కడ బొగ్గు ఉత్పత్తి ప్రారంభం కాలేదని కేంద్ర మంత్రి దృష్టికి తీసుకెళ్లినట్లు సంఘం నాయకులు తెలిపారు. ఈ నేపథ్యంలో ప్రస్తుత కేటాయింపును సమీక్షించి, చట్టపరమైన విధానాల ప్రకారం అవసరమైన చర్యలు తీసుకుని కోయగూడెం ఓసీ-3 బ్లాకును సింగరేణికి కేటాయించాలని కోరినట్లు తెలిపారు .సింగరేణి ప్రయోజనాలు, కార్మికుల ఉద్యోగ భద్రత, ఇల్లందు ప్రాంత అభివృద్ధి, బొగ్గు ఉత్పత్తి పెంపు వంటి అంశాలను పరిగణనలోకి తీసుకుని కేంద్ర మంత్రి జి. కిషన్‌రెడ్డి తమ విజ్ఞప్తిపై సానుకూలంగా స్పందించడంతోపాటు ఈ అంశంపై అన్ని విధాలుగా ప్రయత్నిస్తామని తెలియజేయడం స్వాగతించదగిన పరిణామమని ఏబీకేఎంఎస్--బీఎంఎస్ నాయకులు అన్నారు.సింగరేణి ప్రయోజనాల కోసం చేసిన విజ్ఞప్తికి సానుకూలంగా స్పందించిన కేంద్ర మంత్రి జి. కిషన్‌రెడ్డికి సింగరేణి కార్మికుల తరపున హృదయపూర్వక అభినందనలు, కృతజ్ఞతలు తెలియజేస్తున్నామని ఏబీకేఎంఎస్--బీఎంఎస్ కార్యదర్శి, నేషనల్ డస్ట్ ప్రివెన్షన్ కమిటీ సభ్యులు పి. మాధవ నాయక్ తెలిపారు.

## అర్హులైన ప్రతి ఓటరు ఓటు హక్కు కోల్పోకుండా చూడాలి

**వొడ్నాల శ్రీనివాస్**



**రామకృష్ణాపూర్, ఆగస్టు 27 (ప్రజా జ్యోతి):**క్యాతనపల్లి మునిసిపాలిటీ తొమ్మిదో వార్డులోని ఒకటి, రెండు, మూడు పోలింగ్ కేంద్రాల్లో జరుగుతున్న రెండో దశ నోటీసుల ప్రక్రియను జిల్లా కాంగ్రెస్ అధ్యక్షులు రఘునాథ్ రెడ్డి, పట్టణ కాంగ్రెస్ అధ్యక్షులు వొడ్నాల శ్రీనివాస్ గురువారం పరిశీలించారు. ఓటర్లు, బూత్ స్థాయి అధికారులు, పార్టీ ప్రతినిధులతో మాట్లాడి వివరాలు తెలుసుకున్నారు. ఈ సందర్భంగా శ్రీనివాస్ మాట్లాడుతూ అర్హులైన ఒక్క ఓటరు కూడా ఓటు హక్కు కోల్పోకుండా అధికారులు, బూత్ స్థాయి అధికారులు, రాజకీయ పార్టీల ప్రతినిధులు బాధ్యతగా వ్యవహరించాలని అన్నారు. నోటీసులు అందుకున్న ఓటర్లు ఆందోళన చెందకుండా అవసరమైన పత్రాలను నిర్ణీత విధానంలో సమర్పించాలని సూచించారు.కార్యక్రమంలో వార్డు కౌన్సిలర్ భీమ మల్లేష్, మాజీ పట్టణ అధ్యక్షులు పల్లె రాజు, అధికారులు, పార్టీ ప్రతినిధులు, కార్యకర్తలు, ఓటర్లు పాల్గొన్నారు.

# ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్యే లక్ష్యం

**విద్యార్థులకు యూనిఫారాలు, పుస్తకాలు**

**పంపిణీ చేసిన కలెక్టర్ కె.హరిత**




**అసిఫాబాద్, ఆగస్టు 27 ప్రజా జ్యోతి** ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థులకు నాణ్యమైన విద్యతో పాటు అన్ని సౌకర్యాలు అందించడమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని జిల్లా కలెక్టర్ కె.హరిత అన్నారు. గురువారం జనకాపూర్ లోని ప్రభుత్వ గిరిజన సంక్షేమ బాలుర ఆశ్రమ పాఠశాలలో విద్యార్థులకు ప్రభుత్వం సరఫరా చేసిన యూనిఫారాలు, బూట్లు, పాఠ్యపుస్తకాలు, నోట్ పుస్తకాలు, దుప్పట్ల ను ఆమె పంపిణీ చేశారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. ఆశ్రమ పాఠశాలల్లో విద్యార్థులకు మెనూ ప్రకారం పౌష్టిక ఆహారం అందించాలని అధికారులను ఆదేశించారు. విద్యార్థులు ఈ వసతులను సద్వినియోగం చేసుకుని చదువుల్లో రాణించాలని కోరారు. ఉపాధ్యాయులు ఇంగ్లీష్, గణితం, సైన్స్ సబ్జెక్టులను అర్థమయ్యేలా ప్రయోగాత్మకంగా బోధించాలని, వెనుకబడిన విద్యార్థులకు ప్రత్యేక తరగతులు నిర్వహించాలని సూచించారు. గైర్హాజరయ్యే విద్యార్థుల తల్లిదండ్రులతో మాట్లాడి బడికి పంపేలా కృషి చేయాలన్నారు.ఈ కార్యక్రమంలో జిల్లా అధికారులు అంబాజీ, దత్తారావు, శకుంతల, పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

# ఓటరు జాబితా సవరణపై విస్తృత అవగాహన

**అర్హుల పేర్లు ఉండాలి.. అనర్హుల నమోదులు తొలగాలి**

**ఆసిఫాబాద్ ఆర్సీ, ఆగస్టు 27 (ప్రజాజ్యోతి):** ప్రజాస్వామ్యంలో ఓటు హక్కు అత్యంత కీలకమైనదని, అందుకు సంబంధించిన ఓటరు జాబితా కూడా ఎలాంటి తప్పులు లేకుండా ఉండాల్సిన అవసరం ఉందని అధికారులు, ప్రజాప్రతినిధులు పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో ఆసిఫాబాద్ జిల్లా వాంకిడి మండలం సరండి గ్రామపంచాయతీలో సమగ్ర ఓటరు జాబితా సవరణ కార్యక్రమంలో భాగంగా గురువారం ప్రత్యేక గ్రామ సభ నిర్వహించారు. గ్రామస్థులకు ఓటరు జాబితా సవరణ ప్రక్రియపై అవగాహన కల్పించడంతో పాటు, జాబితాలో తమ పేర్లు, వివరాలను పరిశీలించుకోవాలని సూచించారు. ప్రత్యేక గ్రామ సభ సందర్భంగా ముసాయిదా ఓటరు జాబితాను పరిశీలించే విధానం, అందులో నమోదైన పేర్లను ధ్రువీకరించుకోవాల్సిన అవసరం, తప్పులు ఉంటే సవరణ కోసం తెలియజేయాల్సిన ప్రక్రియ తదితర అంశాలపై చర్చించినట్లు తెలిపారు. ముఖ్యంగా గ్రామంలో నివసిస్తున్న అర్హులైన పౌరులందరి పేర్లు జాబితాలో ఉండేలా చూడడంతో పాటు, మృతి చెందిన వారు, శాశ్వతంగా ఇతర ప్రాంతాలకు వలస వెళ్లిన వారు, ఒకే వ్యక్తి పేరు రెండు లేదా అంతకంటే ఎక్కువసార్లు నమోదైన సందర్భాలను గుర్తించి సంబంధిత నిబంధనల ప్రకారం సవరణలు చేపట్టాల్సిన అవసరాన్ని వివరించారు. యువ ఓటర్ల నమోదుపై దృష్టి 18 సంవత్సరాలు నిండిన అర్హత కలిగిన యువత తమ పేర్లు ఓటరు జాబితాలో ఉన్నాయా లేదా పరిశీలించుకోవాలని సూచించారు. పేరు లేకపోతే నిర్ణీత విధానంలో కొత్తగా నమోదు చేసుకోవాలని అవగాహన కల్పించారు. చదువు, ఉద్యోగం తదితర కారణాలతో ఇతర ప్రాంతాల్లో ఉన్న కుటుంబ సభ్యుల ఓటరు వివరాలను కూడా కుటుంబ సభ్యులు పరిశీలించుకోవాలని కోరారు. కొత్తగా ఓటు హక్కు పొందిన యువతకు తమ హక్కు, బాధ్యతపై అవగాహన కల్పించడం కూడా ఈ కార్యక్రమంలో ముఖ్యమైన అంశంగా నిలిచింది. ఓటరు జాబితాలో పేరు ఉండటం మాత్రమే కాకుండా, అందులో నమోదైన వివరాలు సరైనవిగా ఉన్నాయా లేదా పరిశీలించడం కూడా ప్రతి ఓటరుకు అవసరమని సూచించారు.

**తప్పులుంటే వెంటనే సవరణకు అవకాశం**

ఓటరు పేరు, వయస్సు, చిరునామా లేదా ఇతర వివరాల్లో తప్పులు ఉన్నట్లయితే వాటిని గుర్తించి సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లాలని తెలిపారు. ఒక ప్రాంతం నుంచి మరో ప్రాంతానికి శాశ్వతంగా మారిన వారు పాత చిరునామాలో కొనసాగుతున్నట్లయితే నిబంధనల ప్రకారం మార్పులు చేసుకోవాల్సిన అవసరం ఉందన్నారు. అలాగే ఒకే వ్యక్తి పేరు రెండు చోట్ల నమోదై ఉన్నట్లయితే దానిపై సంబంధిత అధికారులకు సమాచారం అందించాలని సూచించారు. మృతి చెందిన వారి పేర్లు జాబితాలో కొనసాగుతున్న సందర్భాల్లో కూడా కుటుంబ సభ్యులు, స్థానికులు సంబంధిత అధికారులకు సమాచారం అందించడం ద్వారా జాబితా శుద్ధీకరణకు సహకరించవచ్చని తెలిపారు.

**సర్పంచ్ బాపూజీ సూచనలు**

ఈ సందర్భంగా సర్పంచ్ మొహర్లే బాపూజీ మాట్లాడుతూ గ్రామంలో అర్హత కలిగిన ప్రతి ఒక్కరి పేరు ఓటరు జాబితాలో ఉండేలా చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉందన్నారు. ఓటు హక్కు ఉన్న ప్రతి పౌరుడు తన పేరు జాబితాలో ఉందో లేదో పరిశీలించుకోవాలని కోరారు. జాబితాలో ఏవైనా తప్పులు కనిపిస్తే నిర్లక్ష్యం చేయకుండా సంబంధిత బూత్ స్థాయి అధికారులకు తెలియజేయాలని సూచించారు. ప్రజల నుంచి వచ్చే సూచనలు, అభ్యంతరాలను సంబంధిత అధికారులు నిబంధనల ప్రకారం పరిశీలించి తగిన సవరణలు చేపట్టాలని అన్నారు.

**గ్రామస్థుల భాగస్వామ్యం కీలకం**

ఓటరు జాబితా సవరణ కేవలం అధికారుల బాధ్యత మాత్రమే కాదని, ప్రజల భాగస్వామ్యం కూడా ఎంతో అవసరమని స్థానికంగా చర్చ జరిగింది. తమ కుటుంబంలో 18 సంవత్సరాలు నిండిన వారు ఉన్నారా? వారి పేర్లు ఓటరు జాబితాలో నమోదయ్యాయా? ఇప్పటికే నమోదైన పేర్లలో వివరాలు సక్రమంగా ఉన్నాయా? వంటి అంశాలను ప్రతి కుటుంబం పరిశీలించుకోవాల్సిన అవసరం ఉందని సూచించారు. గ్రామంలోని ప్రజలు తమ ఓటరు వివరాలను ఒకసారి పరిశీలించుకోవడం ద్వారా భవిష్యత్తులో ఎన్నికల సమయంలో ఎదురయ్యే అనేక సమస్యలను ముందుగానే నివారించ చవచ్చని తెలిపారు. ముఖ్యంగా పేర్లు, చిరునామాల్లో చిన్నపాటిపొరపాట్లు ఉన్నా వాటిని సకాలంలో సరిచేయించుకోవాలని సూచించారు.

**4వవార్డు మెంబర్ జవాబు దారి తనం,సమాచారం విషయంలో మాత్రం స్పష్టత కరవు**

గ్రామ సభకు ఎవరు హాజరయ్యారు? వార్డు సభ్యులు ఎంతమంది పాల్గొన్నారని అందుబాటులో ఉన్న 4వ వార్డు మెంబర్ ని పలుమార్లు వార్డు ప్రజలు సంప్రదించిన స్పష్టత కరువని ఆరోపణలు వచ్చాయి. సంబంధిత అధికారులు, సిబ్బంది ఎవరు? ప్రజల నుంచి ఎలాంటి సూచనలు, అభ్యంతరాలు వచ్చాయి? వంటి వివరాలపై స్పష్టత లేకపోవడం స్థానికంగా ఆసక్తికర చర్చకు దారితీసింది. ప్రజలకు సంబంధించిన ప్రభుత్వ కార్యక్రమాలు గ్రామస్థులకు మాత్రమే కాకుండా విస్తృతంగా తెలిసేలా సమాచారం అందుబాటులో ఉంచడం అవసరమని పలువురు అభిప్రాయపడుతున్నారు. గ్రామ సభ నిర్వహణతో పాటు అందులో చర్చించిన అంశాలు, తీసుకున్న నిర్ణయాలు, ప్రజలకు అందించిన సూచనలు కూడా బహిరంగంగా




తెలియజేస్తే కార్యక్రమం ఉద్దేశం మరింత స్పష్టంగా ప్రజలకు చేరుతుందని అంటున్నారు.

**పారదర్శకత ఉంటేనే ప్రజలకు నమ్మకం**

ప్రజాస్వామ్య ప్రక్రియకు సంబంధించిన ఓటరు జాబితా సవరణలో పారదర్శకతకు అత్యంత ప్రాధాన్యం ఇవ్వాల్సిన అవసరం ఉంది. గ్రామస్థుల నుంచి వచ్చే అభ్యంతరాలు, సూచనలను నమోదు చేసి, నిబంధనల ప్రకారం పరిశీలించడం ద్వారా ఓటరు జాబితా మరింత ఖచ్చితంగా రూపొందే అవకాశం ఉంటుంది. ప్రత్యేక గ్రామ సభలు కేవలం సమావేశాలకే పరిమితం కాకుండా ప్రజలకు ఉపయోగ పడేలా అవగాహన కార్యక్రమాలుగా కొనసాగాలని స్థానికులు కోరుతున్నారు. ఓటరు జాబితాలో అర్హులైన ప్రతి ఒక్కరి పేరు ఉండేలా చూడడంతో పాటు, అనర్హమైన, డూప్లికేట్ లేదా సంబంధిత వ్యక్తులు లేని నమోదులను నిబంధనల ప్రకారం పరిశీలించడం ద్వారా జాబితా నాణ్యతను మెరుగుపరచవచ్చని పేర్కొంటున్నారు.

**ప్రతి ఓటరూ బాధ్యతగా వ్యవహరించాలి**

ఓటు హక్కు కలిగిన ప్రతి పౌరుడు తన పేరు, వివరాలను పరిశీలించుకోవడం ద్వారా ఈ సవరణ ప్రక్రియలో భాగస్వామి కావాలని సూచిస్తున్నారు. అధికారులు, ప్రజాప్రతినిధులు, బూత్ స్థాయి సిబ్బంది ప్రజలకు అవసరమైన సమాచారం అందించడంతో పాటు, వచ్చిన దరఖాస్తులు, అభ్యంతరాలను నిబంధనల ప్రకారం పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.సరండి గ్రామ పంచాయతీలో నిర్వహించిన ప్రత్యేక గ్రామ సభతో ఓటరు జాబితా సవరణ అంశం మరోసారి ప్రజల దృష్టికి వచ్చింది. అయితే కార్యక్రమానికి సంబంధించిన పూర్తి సమాచారం ప్రజలకు, మీడియాకు అందుబాటులోకి వస్తే గ్రామస్థుల్లో మరింత అవగాహన పెరగడంతో పాటు, ఓటరు జాబితా సవరణ ప్రక్రియపై నమ్మకం మరింత బలపడే అవకాశం ఉందనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.

# డివిజన్ల సమస్యలు పరిష్కరించాలి

**ప్రధానంగా పారుశుద్య, డ్రైనేజీ, వాటర్, స్ట్రీట్ లైట్లు ఇతర మౌలిక వసతులను కల్పించాలి**

**శ్రీరాంపూర్ జీఎంను కలిసిన మంచిర్యాల కార్పొరేషన్ పలువురు కార్పొరేటర్లు**

**మంచిర్యాల, 27, ఆగస్టు ((ప్రజాజ్యోతి):** మంచిర్యాల కార్పొరేషన్ పరిధిలోని వివిధ డివిజన్లలో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని కోరుతూ పలువురు కార్పొరేటర్లు గురువారం శ్రీరాంపూర్ ఏరియా జనరల్ మేనేజర్ మునిగంటి శ్రీనివాస్‌ను కలిశారు. మంచిర్యాల కార్పొరేషన్ మేయర్ ధర్ని మధుకర్ ఆధ్వర్యంలో కార్పొరేటర్లు జీఎంను కలిసి తమ డివిజన్లలో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను ఆయన దృష్టికి తీసుకెళ్లారు. ప్రధానంగా పారిశుద్ధ్యం, డ్రైనేజీ, తాగు నీరు, వీధి దీపాలు, ఇతర మౌలిక వసతుల కల్పనతో పాటు శ్రీరాంపూర్ ఏరియా పరిధిలోని ఆర్అండ్ఆర్ కాలనీలో చేపట్టాల్సిన పలు అభివృద్ధి పనులను కార్పొరేటర్లు జీఎం దృష్టికి తీసుకెళ్లి, వీలైనంత త్వరగా పరిష్కరించాలని కోరారు. కార్పొరేటర్లు ప్రస్తావించిన సమస్యలను జీఎం మునిగంటి శ్రీనివాస్ సావధానంగా విని, వాటి పరిష్కారానికి అవసరమైన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. తమ పరిధిలో ఉన్న పనులను త్వరితగతిన పూర్తి చేసేందుకు కృషి చేస్తామని, ఉన్నతస్థాయి అనుమతులు అవసరమైన పనులను సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించేలా చర్యలు చేపడతామని తెలిపారు. ఈ సందర్భంగా మేయర్ ధర్ని మధుకర్ మాట్లాడుతూ డివిజన్లలో ప్రజలకు అవసరమైన మౌలిక వసతుల కల్పనకు శ్రీరాంపూర్ ఏరియా యాజమాన్యం సహకరించాలని కోరారు. కార్పొరేటర్లు తీసుకువచ్చిన సమస్యలను పరస్పర సహకారంతో త్వరితగతిన పరిష్కరించేందుకు కృషి చేయాలని జీఎంను కోరారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ మేయర్ సల్ల రమ్యతో పాటు 2వ డివిజన్ కార్పొరేటర్



యశోద, 7వ డివిజన్ కార్పొరేటర్ ఏల్పుల రవీందర్, 24వ డివిజన్ కార్పొరేటర్ బొడ్డు స్వప్న తిరుపతి, 25వ డివిజన్ కార్పొరేటర్ తోట రజిత శ్రీనివాస్, 29వ డివిజన్ కార్పొరేటర్ బందారి సుధాకర్, 31వ డివిజన్ కార్పొరేటర్ తాళ్ల సంపత్, 34వ డివిజన్ కార్పొరేటర్ అగ్గు సాగర్ తదితరులు పాల్గొన్నారు.

## అధికారులతో కలిసి రాఖీ పండగ జరుపుకున్న చిన్నారులు



**నేరడిగొండ ఆగస్టు 27 (ప్రజాజ్యోతి):** మండలంలోని లఖంపూర్ జి గ్రామపంచాయతీ కార్యాలయంలో గురువారం రక్షాబంధన్ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అంగన్ వాడీ చిన్నారులు ఎంపీడీఓ గంగా సాగర్ రెడ్డికి రాఖీలు కట్టి రక్షాబంధన్ శుభాకాంక్షలు తెలిపారు. చిన్నారుల ప్రేమాభిమానాల కు ఎంపీడీఓ సంతోషం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో ఆర్ఐ సాయిరాం, గ్రామ సర్పంచ్ సెడ్మాకి సుజాత గంగాధర్, పంచాయతీ కార్యదర్శి సునీల్ కుమార్, జీపీఓ, బీఎల్ఓ కె. జైథు, అంగన్‌వాడీ టీచర్ మాధవి గోదావరి తదితరులు పాల్గొన్నారు. రక్షాబంధన్ సందర్భంగా చిన్నారులతో కలిసి వేడుకలు నిర్వహించడం పట్ల గ్రామస్థులు హర్షం వ్యక్తం చేశారు.

## జిల్లా కాంగ్రెస్ కార్యాలయంలో ఘనంగా సామూహిక రక్షాబంధన్ వేడుకలు

**మహిళల సాధికారతకు కాంగ్రెస్ ప్రభుత్వం పెద్దపీట: సుగుణక్క**

**ఐకమత్యంతో ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేయాలి: సుగుణక్క**



**ఆసిఫాబాద్ ఆగస్టు 27 (ప్రజా జ్యోతి** జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో గురువారం సామూహిక రక్షాబంధన్ వేడుకలను డీసీసీ అధ్యక్షురాలు, రాష్ట్ర మహిళా కాంగ్రెస్ ఇన్‌చార్జి ఆత్రం సుగుణక్క ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మహిళా కాంగ్రెస్ నాయకురాళ్లతో కలిసి పార్టీ నాయకులు, కార్యకర్తలకు రాఖీలు కట్టి రక్షాబంధన్ శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో నియోజకవర్గ ఇన్‌చార్జి శ్యామ్ నాయక్, వాంకిడి మండల కాంగ్రెస్ అధ్యక్షుడు మెంగజీ, ప్రజాప్రతినిధులు, డీసీసీ కార్యవర్గ సభ్యులు, మండల కాంగ్రెస్ అధ్యక్షులు, అనుబంధ సంఘాల నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆత్రం సుగుణక్క మాట్లాడుతూ రక్షాబంధన్ పండుగ సోదర--సోదరీమణుల మధ్య ప్రేమ, ఆత్మీయత, పరస్పర రక్షణకు ప్రతీకగా నిలుస్తుందని అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేస్తున్న పలు సంక్షేమ పథకాలను మహిళలకు ప్రాధాన్యతనిస్తూ అందిస్తూ, వారిని ఆర్థికంగా, సామాజికంగా సాధికారత కల్పించేందుకు కృషి చేస్తోందని తెలిపారు. మహిళలకు రాజకీయాల్లో ప్రాధాన్యత కల్పించాలనే ఉద్దేశంతో రాహుల్ గాంధీ ఆధ్వర్యంలో ఇందిరా ఫెలోషిప్, శక్తి అభియాన్ వంటి కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. కాంగ్రెస్ కుటుంబ సభ్యులంతా ఐకమత్యంతో పనిచేస్తూ ప్రజా సమస్యల పరిష్కారానికి నిరంతరం కృషి చేయాలని ఆమె పిలుపునిచ్చారు.

## భూ సంబంధిత దరఖాస్తులను త్వరితగతిన పరిష్కరించాలి

**: సిసిఎల్ఏ కమిషనర్ లోకేష్ కుమార్**




**ఆసిఫాబాద్, ఆగస్టు 27 ప్రజా జ్యోతి** సాదా బైనామా, భూభారతి, రెవెన్యూ సదస్సులలో వచ్చిన భూ సంబంధిత దరఖాస్తులను వేగంగా పరిష్కరించాలని సిసిఎల్ఏ కమిషనర్ లోకేష్ కుమార్ రెవెన్యూ అధికారులను ఆదేశించారు. గురువారం హైదరాబాద్ లోని సిసిఎల్ఏ కార్యాలయం నుంచి రిజిస్ట్రేషన్, స్టాంపుల శాఖ ప్రత్యేక కార్యదర్శి రాజీవ్ గాంధీ హనుమంతుతో కలిసి ఆయన జిల్లాల కలెక్టర్లు, అదనపు కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. లావుని పట్టా, సీలింగ్, పట్టా, దేవాదాయ, వక్ఫ్, అటవీ భూములు, ప్రభుత్వ ఆస్తుల వివరాలను పక్కాగా కేటగిరీల వారీగా జాబితా రూపొందించాలని సూచించారు. నిషేధిత భూములపై మీడియాలో వచ్చే వార్తలపై తక్షణమే స్పందించాలన్నారు వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న జిల్లా కలెక్టర్ కె.హరిత మాట్లాడుతూ.. జిల్లాలో వచ్చిన దరఖాస్తులను క్షేత్రస్థాయిలో పరిశీలించి నిబంధనల ప్రకారం వేగంగా పరిష్కరిస్తున్నామని తెలిపారు. ప్రభుత్వ భూముల వివరాలను కేటగిరీలవారీగా నిషేధిత జాబితాలో నమోదు చేసేందుకు చర్యలు తీసుకుంటున్నామని వివరించారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ ఎం.డేవిడ్, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

## అర్హులైన ఏ ఒక్కరి ఓటు హక్కు తొలగిపోకూడదు

**రాష్ట్ర ఉర్దూ అకాడమీ చైర్మన్ ఎస్ ఐ ఆర్ నిర్మల్ నియోజకవర్గం కోఆర్డినేటర్ తాహెర్ బీన్**



**సోన్, ఆగస్టు 27(ప్రజా జ్యోతి):** అర్హులైన ఏ ఒక్కరి ఓటు కూడా జాబితా నుంచి తొలగిపోకుండా చర్యలు తీసుకోవాలని రాష్ట్ర ఉర్దూ అకాడమీ చైర్మన్, ఎస్ఐఆర్ నిర్మల్ నియోజకవర్గ కోఆర్డినేటర్ తాహెర్ బీన్ అమ్దాన్ అన్నారు. ఓటర్ల ప్రత్యేక సమగ్ర సవరణ కార్యక్రమం (ఎస్ఐఆర్)లో భాగంగా సోన్ మండలం కడ్తాల్ గ్రామంలో గురువారం నిర్వహించిన గ్రామసభకు ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ఎస్ఐఆర్ లో భాగంగా విడుదలైన ముసాయిదా ఓటరు జాబితాలో ఎవరి పేర్లలోనైనా తప్పులు ఉన్నా, ఇతర సమస్యలు ఉన్నా సంబంధిత ఆధారాలతో అధికారులను సంప్రదించిసరిచేసు కోవచ్చన్నారు. దీనిపై ఎవరూ ఆందోళన చెందాల్సిన అవసరం లేదని స్పష్టం చేశారు. అక్టోబర్ 1 నాటికి 18 సంవత్సరాలు నిండే యువతీ యువకులు కొత్తగా ఓటరుగా నమోదు చేసుకునే అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. గ్రామంలో అర్హత ఉన్న ఏ ఒక్క ఓటరు పేరు కూడా జాబితా నుంచి మిస్ కాకుండా బూత్ లెవెల్ ఏజెంట్లు ప్రజలకు అందుబాటులో ఉండి సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ గుర్రం రాము, నిర్మల్ వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ సోమా భీంరెడ్డి, డీసీసీ ప్రధాన కార్యదర్శి, మున్సిపల్ కో ఆప్షన్ సభ్యులు గాజుల రవికుమార్, శ్రీ గండి రామన్న దత్త సాయి ఆలయ చైర్మన్ కొట్టే శేఖర్, కాంగ్రెస్ పార్టీ సోన్ మండల అధ్యక్షులు మోహినొద్దీన్, గ్రామ కార్యదర్శి సుమయ తస్నీన్, ఆర్ఐ జ్ఞానేశ్వర్, జీపీఓ గంగాధర్, బీఎల్ఓలు పద్మావతి, గోదావరి, వార్డు సభ్యులు, బీఎల్ఏలు పాల్గొన్నారు.

## మార్కెట్ కమిటీ, సహకార సంఘం చైర్మన్లకు సన్మానం



**దండేపల్లి, ఆగస్టు 27(ప్రజాజ్యోతి):** ఇటీవల మార్కెట్ కమిటీ చైర్మన్‌గా నియమితులైన అక్కల వెంకటేశ్వర్లు, సహకార సంఘం చైర్మన్ ముత్యాల శ్రీనివాస్‌లను మండల కేంద్రంలో రేషన్ డీలర్ల సంఘం ఆధ్వర్యంలో గురువారం ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ.. నూతన చైర్మన్లు ప్రజా సంక్షేమానికి, రైతు సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని ఆకాంక్షించారు. అనంతరం వారిని శాలువాలతో సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో రేషన్ డీలర్ల సంఘం జిల్లా అధ్యక్షుడు సత్తయ్య, మండల అధ్యక్షుడు మల్లేష్, ప్రధాన కార్యదర్శి నక్క తిరుపతి, నాయకులు జాబు లింగన్న, ముత్తె మల్లేష్, ప్రభాకర్, చంద్రయ్య, లచ్చన్న తదితరులు పాల్గొన్నారు.

## దండేపల్లిలో ముందస్తు రాఖీ వేడుకలు



**దండేపల్లి, ఆగస్టు 27(దండేపల్లి):** దండేపల్లి మండలం వెలగనూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో రాఖీ పౌర్ణమి వేడుకలను ముందుగానే ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాల విద్యార్థులు ఒకరికొకరు రాఖీలు కట్టుకుంటూ సోదరభావాన్ని చాటుకున్నారు. “నీవు నాకు రక్ష.. నేను నీకు రక్ష.. మనమిద్దరం కలిసి దేశానికి రక్ష” అంటూ విద్యార్థులు పలికిన నినాదాలు ఆకట్టుకున్నాయి. పాఠశాల ప్రధానోపాధ్యాయుడితో పాటు ఉపాధ్యాయులు పాల్గొని విద్యార్థులకు రాఖీ పండుగ ప్రాముఖ్యతను, భారతీయుల ఐక్యతను వివరించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయినీ ఉపాధ్యాయులు, విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## తోడు-నీడ తోబుట్టువుల అనుబంధానికి ప్రతీక రక్షాబంధన్



**సోన్,ఆగస్టు 27 (ప్రజా జ్యోతి):** తోబుట్టువుల మధ్య ప్రేమానురాగాలకు, రక్షణకు ప్రతీకగా రక్షాబంధన్ పండుగను జరుపుకుంటారని రాష్ట్ర ఉర్దూ అకాడమీ చైర్మన్ తాహెర్ బీన్ అమ్దాన్ అన్నారు. సోన్ మండలం కడ్తాల్ గ్రామంలో గురువారం వేదిక్ స్కూల్ ఆధ్వర్యంలో ముందస్తు రాఖీ వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాల చిన్నారులు తాహెర్ బీన్ అమ్దాన్ కు రాఖీలు కట్టి రక్షాబంధన్ శుభాకాంక్షలు తెలిపారు. చిన్నారుల ఆత్మీయతకు స్పందించిన ఆయన వారికి కానుకలు అందజేశారు. రక్షాబంధన్ పండుగ సోదర, సోదరీమణుల మధ్య ప్రేమ, ఆప్యాయతలను మరింత బలోపేతం చేస్తుందని ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ గుర్రం రాము, నిర్మల్ ఏఎంసీ చైర్మన్ సోమా భీంరెడ్డి, డీసీసీ ప్రధాన కార్యదర్శి, మున్సిపల్ కో ఆప్షన్ సభ్యులు గాజుల రవి కుమార్, శ్రీ గండి రామన్న దత్త సాయి ఆలయ చైర్మన్ కొట్టే శేఖర్, కాంగ్రెస్ పార్టీ సోన్ మండల అధ్యక్షుడు మోహినొద్దీన్, గ్రామ కార్యదర్శి సుమయ తస్నీన్, పాఠశాల కరస్పాండెంట్ మామిళ్ల లింగయ్య, విద్యార్థులు పాల్గొన్నారు.

# సింగరేణి స్వయం ప్రతిపత్తిని రాజకీయ జోక్యానికి తాకట్టు పెడుతున్నారా?

**ఏబీకేఎంఎస్--బీఎంఎస్ కార్యదర్శి, నేషనల్ డస్ట్ ప్రివెన్షన్ కమిటీ సభ్యులు పి. మాధవ నాయక్**



**మంచిర్యాల, 27, ఆగస్టు (ప్రజాజ్యోతి):**సింగరేణి కంపెనీకి చెందిన డైరెక్టర్లు, జనరల్ మేనేజర్లు ఎమ్మెల్యేల క్యాంప్ కార్యాలయాలకు వెళ్లి సంస్థ వ్యవహారాలపై సమీక్షలు నిర్వహించడం సింగరేణి స్వయం ప్రతిపత్తి సంస్థగా ఉన్న గౌరవాన్ని ప్రశ్నించే పరిస్థితికి నిదర్శనమని సింగరేణి కోల్ మైన్స్ కార్మిక సంఘం, ఏబీకేఎంఎస్--బీఎంఎస్ కార్యదర్శి, నేషనల్ డస్ట్ ప్రివెన్షన్ కమిటీ సభ్యులు పి. మాధవ నాయక్ ప్రశ్నించారు. సింగరేణి కంపెనీని రాజకీయ నాయకుల చేతుల్లో తాకట్టు పెట్టే పరిస్థితి వచ్చిందా? అని పి. మాధవ నాయక్ ప్రశ్నించారు. సింగరేణి చరిత్రలో ఏనాడూ సంస్థ ఉన్నతాధికారులు ఎమ్మెల్యేలు, ఎంపీల క్యాంప్ కార్యాలయాలకు వెళ్లి సంస్థ వ్యవహారాల పై సమీక్షలు నిర్వహించిన పరిస్థితి లేదని, కానీ నేడు సింగరేణి అధికారులు రాజకీయ నాయకుల కార్యాలయాలకు వెళ్లి సమీక్షల్లో పాల్గొనే పరిస్థితి ఎందుకు వచ్చిందని ఆయన ప్రశ్నించారు. ఇది కేవలం ఒక కార్యక్రమం కాదని, సింగరేణి స్వయం ప్రతిపత్తిపై జరుగుతున్న రాజకీయ జోక్యానికి ప్రతీకగా కనిపిస్తోందని ఆయన అన్నారు. ఒకవైపు సింగరేణి తీవ్రమైన ఆర్థిక సంక్షోభంలో కొట్టుమిట్టాడుతుంటే, మరోవైపు తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం సింగరేణి నుంచి బొగ్గు తీసుకుంటూ, సింగరేణి ఉత్పత్తి చేసే విద్యుత్తును కొనుగోలు చేస్తోందని మాధవ నాయక్ తెలిపారు. అయితే సింగరేణికి రావాల్సిన వేల కోట్ల రూపాయల బకాయిలను చెల్లించకుండా సంస్థను ఆర్థికంగా కుంగదీసే పరిస్థితి ఎందుకు వచ్చిందని ఆయన ప్రశ్నించారు. సింగరేణి యాజమాన్యం "బకాయిలు చెల్లించేంత వరకు బొగ్గు సరఫరా చేయలేం" అని గట్టిగా చెప్పలేని దుస్థితి ఎందుకు వచ్చిందని, సంస్థ ప్రయోజనాలను కాపాడాల్సిన యాజమాన్యం రాజకీయ ఒత్తిళ్ల ముందు ఎందుకు మౌనం వహిస్తోందని మాధవ నాయక్ ప్రశ్నించారు. ఈ రాజకీయ జోక్యానికి, ఆర్థిక సంక్షోభానికి, ప్రస్తుత దుస్థితికి బలి అవుతున్నది ఎవరు? అని ప్రశ్నిస్తూ సింగరేణి కార్మికుడే బలవుతున్నాడని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. తమ చెమటను చిందించి, ప్రాణాలను పణంగా పెట్టి బొగ్గును ఉత్పత్తి చేస్తున్న కార్మికుల కష్టార్జిత సంపదతో నడిచే సంస్థను బలహీనపరిస్తే ఇక చూస్తూ ఊరుకునే పరిస్థితి ఉండకూడదన్నారు.సింగరేణి సంస్థను తమ తాతలు, తండ్రులు, పూర్వీకుల చెమటతో నిర్మించారని, ఇది ఏ ఒక్క రాజకీయ నాయకుడి సొత్తు కాదని మాధవ నాయక్ స్పష్టం చేశారు. సింగరేణి లక్షలాది కార్మిక కుటుంబాల జీవనాధారమని, తెలంగాణ ఆర్థిక వ్యవస్థకు వెన్నెముకగా నిలుస్తున్న సంస్థను రాజకీయ ప్రయోజనాలకు ఉపయోగించుకోవడం సరికాదన్నారు. సింగరేణిని రాజకీయ జోక్యం నుంచి కాపాడాలని, కంపెనీ స్వయం ప్రతిపత్తిని పునరుద్ధరించాలని, తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం సింగరేణికి చెల్లించాల్సిన బకాయిలను వెంటనే చెల్లించేలా చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. సంస్థ పరిరక్షణ కోసం, స్వయం ప్రతిపత్తి కోసం, కార్మికుల భవిష్యత్తు కోసం వాటాల పునర్వ్యవస్థీకరణపై కార్మికులు ఐక్యంగా ఉద్యమించాల్సిన అవసరం ఉందన్నారు. సింగరేణి కార్మికులు ఇప్పటికైనా చైతన్యవంతులై సంస్థను కాపాడేందుకు ముందుకు రావాలని, రాజకీయ జోక్యాన్ని అడ్డుకుని కార్మికుల హక్కులను పరిరక్షించాలని పి. మాధవ నాయక్ పిలుపునిచ్చారు.

# రీ-సర్వే ప్రక్రియను వేగవంతం చేయాలి





**మంచిర్యాల జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్**

**మంచిర్యాల, 27, ఆగస్టు (ప్రజాజ్యోతి):** మంచిర్యాల, జిల్లాలో భూ రీ-సర్వే ప్రక్రియను వేగవంతం చేసి, నిర్ణీత లక్ష్యాలను చేరుకోవాలని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అధికారులను ఆదేశించారు. గురువారం నస్పూర్‌లోని సమీకృత జిల్లా కార్యాలయాల భవన సమావేశ మందిరంలో జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) వి.రాములు, ట్రైనీ డిప్యూటీ కలెక్టర్ విలాయత్ అలీ, సర్వే ల్యాండ్ రికార్డ్ ఏడీ శ్రీనివాస్‌తో కలిసి లైసెన్స్‌డ్ సర్వేయర్లకు ఏర్పాటు చేసిన శిక్షణ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, రీ-సర్వేలో భాగంగా లైసెన్స్‌డ్ సర్వేయర్లతో ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసి ప్రభుత్వ, అటవీ భూములు, గ్రామాల హద్దులు తదితర ప్రాంతాలను సమగ్రంగా సర్వే చేయాలని సూచించారు. ప్రతి బృందం రోజుకు 30 ఎకరాల వరకు సర్వే చేసే విధంగా కార్యాచరణ రూపొందించాలని, సర్వేతో పాటు కో-రిలేషన్ స్టేట్‌మెంట్ తయారీ, నోటీసుల జారీ ప్రక్రియలను ఏకకాలంలో చేపట్టాలని తెలిపారు. రైతులకు నోటీసులు సకాలంలో అందజేసి, రీ-సర్వేపై గ్రామస్థాయిలో విస్తృత అవగాహన కల్పించాలని ఆదేశించారు. గ్రామాల హద్దుల నిర్ధారణకు సంబంధించిన సమాచారాన్ని సర్పంచులు, రైతులకు అందించాలని, ప్రజల సహకారంతో రీ-సర్వే ప్రక్రియను పారదర్శకంగా పూర్తి చేయాలని తెలిపారు. రీ-సర్వేకు సంబంధించిన ఫారాలను నిబంధనల ప్రకారం సక్రమంగా పూర్తి చేసి రికార్డులను సిద్ధం చేయాలని సూచించారు. జిల్లాలో పైలట్ గ్రామంగా తాండూర్ మండలం రాంపూర్‌ను ఎంపిక చేసినట్లు, గ్రామంలో సుమారు 581 ఎకరాల భూమి ఉన్నట్లు వెల్లడించారు. ప్రతి మండలం నుంచి ఒక గ్రామాన్ని ఎంపిక చేసి రీ-సర్వేపై అవసరమైన శిక్షణ అందించాలని సూచించారు. రీ-సర్వే పనులపై తహసిల్దార్లు ప్రత్యేక చొరవ చూపి క్షేత్రస్థాయి పురోగతిని నిరంతరం పర్యవేక్షించాలని కలెక్టర్ ఆదేశించారు. గ్రామ పంచాయతీ అధికారులు భూములకు సంబంధించిన రెవెన్యూ రికార్డులను సక్రమంగా సిద్ధం చేసి అవసరమైన సమాచారాన్ని అందుబాటులో ఉంచాలని తెలిపారు. భూముల రిజిస్ట్రేషన్ సమయంలో తహసిల్దార్ కార్యాలయాల్లో సీలింగ్ డిక్లరేషన్‌ను పరిశీలించి నిబంధనల ప్రకారం రిజిస్ట్రేషన్ చేపట్టాలని సూచించారు. భూభారతి దరఖాస్తుల్లో భూమి విస్తీర్ణ వివరాలను రికార్డులతో క్షుణ్ణంగా సరిపోల్చిన అనంతరం తదుపరి చర్యలు చేపట్టాలని తెలిపారు. ఎస్ఐఆర్ నోటీసుల జారీ ప్రక్రియను సమర్థవంతంగా నిర్వహించాలని, బూత్ స్థాయి అధికారులు తమ విధులను సక్రమంగా నిర్వహించేలా సంబంధిత అధికారులు పర్యవేక్షించాలని సూచించారు. రీ-సర్వే, ఎస్ఐఆర్, రెవెన్యూ రికార్డుల నవీకరణ ప్రక్రియలను సమన్వయంతో కొనసాగిస్తూ నిర్ణీత లక్ష్యాలను సాధించాలని ఆదేశించారు. ప్రభుత్వ, అటవీ భూములతో పాటు జిల్లాలోని అన్ని భూముల వివరాలను క్షేత్రస్థాయిలో ఖచ్చితంగా సర్వే చేసి రికార్డులను నవీకరించాలని తెలిపారు. రోజువారీ లక్ష్యాలను నిర్దేశించుకుని, సాధించిన పురోగతిని ప్రతిరోజూ సమీక్షిస్తూ రీ-సర్వే ప్రక్రియను వేగవంతం చేయాలని కలెక్టర్ కుమార్ దీపక్ సూచించారు. ఈ కార్యక్రమంలో తహసిల్దార్లు, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# ఇందిరమ్మ ఇళ్ల ఎంపికలో పారదర్శకత పాటించాలి

అర్హులైన నిరుపేదలకే ఇళ్లు మంజూరు చేయాలి

కార్యాలయాల్లో కూర్చొని ఖరారు చేసిన జాబితాను పునఃపరిశీలించాలి

క్షేత్రస్థాయి పరిశీలన తర్వాతే తుది జాబితా రూపొందించాలి

ఇందిరమ్మ కమిటీలను పునరుద్ధరించి ప్రత్యేక గ్రామసభలు నిర్వహించాలి: జీవన్

**ఆసిఫాబాద్ ఆగస్టు 27 ప్రజా జ్యోతి** ఇందిరమ్మ ఇళ్ల పథకం లబ్ధిదారుల ఎంపికలో అధికారులు పూర్తి పారదర్శకత పాటించాలని, రాజకీయ సిఫార్సులు, వ్యక్తిగత ఒత్తిళ్లకు తావులేకుండా అర్హతనే ప్రామాణికంగా తీసుకోవాలని నియోజకవర్గ మాజీ అధ్యక్షుడు జీవన్ డిమాండ్ చేశారు. సొంత ఇల్లు లేని అర్హులైన నిరుపేద కుటుంబాలకే ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేయాలని కోరారు. గ్రామాల వాస్తవ పరిస్థితులను క్షేత్రస్థాయిలో పరిశీలించకుండా ఆసిఫాబాద్‌లోని కార్యాలయాల్లో కూర్చొని దరఖాస్తులు, రికార్డుల ఆధారంగా రూపొందించిన లబ్ధిదారుల జాబితాను పునఃపరిశీలించాలని ఆయన అన్నారు ప్రతి గ్రామంలో అధికారులు పర్యటించి ఇంటింటా పరిశీలన నిర్వహించిన తర్వాతే అర్హతను నిర్ధారించాలని సూచించారు.

**కార్యాలయాల్లో కూర్చొని జాబితా తయారు చేయడం సరికాదు**

ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారుల ఎంపికలో అధికారులు క్షేత్రస్థాయికి వెళ్లకుండా కార్యాలయాల్లో కూర్చొని జాబితాలు రూపొందించడం వల్ల నిజమైన అర్హులకు అన్యాయం జరిగే అవకాశం ఉందని జీవన్ అన్నారు. గ్రామాల్లో ఎవరు సొంత ఇల్లు లేకుండా జీవిస్తున్నారు, ఎవరి ఆర్థిక పరిస్థితి దయనీయంగా ఉంది, ఎవరు ప్రభుత్వ సాయం కోసం ఎదురుచూస్తున్నారు అనే విషయాలను ప్రత్యక్షంగా పరిశీలించాల్సిన అవసరం ఉందన్నారు. ఇప్పటికే రూపొందించిన జాబితాలో అర్హత లేని వారి పేర్లు ఉంటే తొలగించి, అర్హత ఉన్నప్పటికీ జాబితాలో చోటు దక్కని నిరుపేద కుటుంబాలను గుర్తించి చేర్చాలని డిమాండ్ చేశారు. కేవలం పాత రికార్డులు, దరఖాస్తుల ఆధారంగా నిర్ణయం తీసుకోకుండా వాస్తవ పరిస్థితులను పరిశీలించాలని కోరారు.

**ఇందిరమ్మ కమిటీలను పునరుద్ధరించాలి**

గతంలో గ్రామస్థాయిలో ఇందిరమ్మ కమిటీల ద్వారా గ్రామ నాయకులు, ప్రజాప్రతినిధులు, గ్రామ పెద్దలు, ప్రజల సమన్వయంతో అర్హులైన లబ్ధిదారులను గుర్తించేవారని జీవన్ గుర్తుచేశారు. ఈ విధానం ద్వారా గ్రామంలో పేదలు, ఇల్లు లేని కుటుంబాలను గుర్తించడం సులభంగా ఉండేదన్నారు. ప్రస్తుతం ఇందిరమ్మ కమిటీలు లేకపోవడంతో ఎంపిక ప్రక్రియ పూర్తిగా అధికార యంత్రాంగంపైనే ఆధారపడుతోందని అన్నారు. అందువల్ల ఇందిరమ్మ కమిటీలను పునరుద్ధరించాలని కోరారు. అది సాధ్యం కాని పరిస్థితుల్లో ప్రతి గ్రామంలో ప్రత్యేక గ్రామసభలు నిర్వహించి ప్రజల సమక్షంలో లబ్ధిదారుల జాబితాను పరిశీలించాలని డిమాండ్ చేశారు.

**అర్హతే ప్రామాణికంగా ఉండాలి**

ఇందిరమ్మ ఇళ్ల మంజూరులో రాజకీయ సిఫార్సులు, వ్యక్తిగత ఒత్తిళ్లు పలుకుబడికి ఎలాంటి అవకాశం ఇవ్వకూడదని జీవన్ స్పష్టం చేశారు. నిబంధనల ప్రకారం సొంత ఇల్లు లేని నిరుపేద కుటుంబాలు, ఆర్థికంగా వెనుకబడిన కుటుంబాలకు ప్రాధాన్యం కల్పించాలని కోరారు. ఇప్పటికే సొంత ఇల్లు లేదా మెరుగైన గృహ సదుపాయం ఉన్న కుటుంబాలు అర్హుల జాబితాలో ఉంటే క్షేత్రస్థాయిలో పరిశీలించి వాస్తవాలను నిర్ధారించాలని సూచించారు. అదే సమయంలో దుర్భర పరిస్థితుల్లో నివసిస్తున్న అర్హులైన పేదలను గుర్తించి వారికి ప్రాధాన్యం ఇవ్వాలని అన్నారు.

**ప్రత్యేక గ్రామసభల ద్వారా జాబితా ఖరారు చేయాలి**

లబ్ధిదారుల ఎంపికలో మరింత పారదర్శకత కోసం ప్రతి గ్రామంలో ప్రత్యేక గ్రామసభలు నిర్వహించాలని జీవన్ డిమాండ్ చేశారు. గ్రామసభలో ప్రాథమిక లబ్ధిదారుల జాబితాను ప్రజల ముందు ఉంచి, అర్హతలపై ప్రజల అభిప్రాయాలు, అభ్యంతరాలు, సూచనలు స్వీకరించాలని అన్నారు. అనంతరం అధికారులు క్షేత్రస్థాయిలో విచారణ జరిపి వాస్తవాలను నిర్ధారించిన తర్వాతే తుది జాబితాను రూపొందించాలని కోరారు. ఎంపిక చేసిన లబ్ధిదారుల జాబితాను సంబంధిత గ్రామపంచాయతీ కార్యాలయాల్లో బహిరంగంగా ప్రదర్శించి, అభ్యంతరాలు తెలియజేసేందుకు ప్రజలకు అవకాశం కల్పించాలని సూచించారు.



**క్షేత్రస్థాయి విచారణ తప్పనిసరి**

ప్రతి దరఖాస్తుదారుడి ఇంటి పరిస్థితి, కుటుంబ ఆర్థిక స్థితి, కుటుంబ అవసరాలు, సొంత ఇల్లు ఉందా లేదా అనే అంశాలను అధికారులు ప్రత్యక్షంగా పరిశీలించిన తర్వాతే లబ్ధిదారులను ఖరారు చేయాలని జీవన్ కోరారు. గ్రామాల్లో ఇల్లు లేని పేద కుటుంబాలు ప్రభుత్వ సహాయం కోసం ఎదురుచూస్తున్నాయని, వారికి న్యాయం చేయాల్సి న బాధ్యత అధికారులపై ఉందన్నారు. అధికారుల నిర్లక్ష్యం కారణం గా నిజమైన అర్హులు పథక ప్రయోజనానికి దూరమయ్యే పరిస్థితి రాకూడదన్నారు.

**నిజమైన లబ్ధిదారులకే ప్రయోజనం అందాలి**

ఇందిరమ్మ ఇళ్ల పథకం పేదల సంక్షేమం కోసం ఉద్దేశించినదని, నిజమైన అర్హులైన కుటుంబాలకు ఇళ్లు మంజూరైనప్పుడే ప్రభుత్వ లక్ష్యం నెరవేరుతుందని జీవన్ పేర్కొన్నారు. అర్హత లేని వారికి ఇళ్లు మంజూరు చేసి, నిజమైన పేదలను పక్కన పెట్టే పరిస్థితి రాకూడదన్నారు. ఇప్పటికే రూపొందించిన లబ్ధిదారుల జాబితాను మరోసారి సమగ్రంగా పరిశీలించి, అవసరమైతే ప్రత్యేక బృందాలను గ్రామాలకు పంపి క్షేత్రస్థాయి విచారణ నిర్వహించాలని కోరారు. గ్రామసభల ద్వారా ప్రజల అభిప్రాయాలను తెలుసుకుని పారదర్శకంగా తుది జాబితాను రూపొందించాలని డిమాండ్ చేశారు.

**రాజకీయ జోక్యాలకు తావులేకుండా అమలు చేయాలి**

పేదల కోసం అమలు చేస్తున్న ఇందిరమ్మ ఇళ్ల పథకంలో రాజకీయ జోక్యాలు, సిఫార్సులు, వ్యక్తిగత ఒత్తిళ్లకు తావులేకుండా అధికారులు నిష్పక్షపాతంగా వ్యవహరించాలని జీవన్ స్పష్టం చేశారు. కాబట్టి కార్యాలయాల్లో కూర్చొని ఖరారు చేసిన జాబితాను పునఃపరిశీలించి, ప్రతి గ్రామంలో క్షేత్రస్థాయి విచారణ చేపట్టి, ప్రత్యేక గ్రామసభల ద్వారా అభ్యంతరాలు స్వీకరించి, అన్ని అంశాలను పరిశీలించిన అనంతరం నిజమైన అర్హులైన నిరుపేద కుటుంబాలకు మాత్రమే ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేయాలని నియోజకవర్గ మాజీ అధ్యక్షుడు జీవన్ డిమాండ్ చేశారు.

# నిర్మల్‌లో టీజీఈజేఏసీ ఆధ్వర్యంలో మహా ధర్నా





## ఉద్యోగుల సమస్యలు వెంటనే పరిష్కరించాలని డిమాండ్

**నిర్మల్ జిల్లా ప్రతినిధి, ఆగస్టు 27, ( ప్రజా జ్యోతి )** నిర్మల్ జిల్లా కేంద్రంలోని మున్సిపల్ కార్యాలయం ఎదుట టీజీఈజేఏసీ ఆధ్వర్యంలో మహా ధర్నా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ప్రభుత్వ ఉద్యోగులు, ఉపాధ్యాయులు, గెజిటెడ్ అధికారులు, పెన్షనర్లు పెద్ద సంఖ్యలో హాజరై తమ సమస్యల పరిష్కారం కోసం గళం విప్పారు. ఉద్యోగుల దీర్ఘకాలిక సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని నాయకులు డిమాండ్ చేశారు. 2వ పీఆర్సీని తక్షణమే అమలు చేయాలని, పెండింగ్‌లో ఉన్న ఆరు డీఏలను విడుదల చేయాలని కోరారు. ఉద్యోగులు, పెన్షనర్లకు ఈ హెచ్ఎస్‌ను సమర్థవంతంగా అమలు చేయడంతో పాటు సీపీఎస్‌ను రద్దు చేసి ఓపీఎస్‌ను అమలు చేయాలని డిమాండ్ చేశారు. అదేవిధంగా ఉద్యోగులకు సంబంధించిన సుమారు రూ.10 వేల కోట్ల పెండింగ్ బిల్లులను ప్రతి నెలా విడుదల చేయాలని ప్రభుత్వాన్ని కోరారు. ఉద్యోగుల సమస్యలను వెంటనే పరిష్కరించకపోతే రాబోయే రోజుల్లో మరింత పెద్ద ఎత్తున ఆందోళనలు చేపడతామని నాయకులు హెచ్చరించారు. ఈ మహా ధర్నాకు వివిధ రాజకీయ పార్టీల నాయకులు రామ్ కిషన్ రెడ్డి, మారుకొండ రాము, రావుల రాంనాథ్ మద్దతు తెలిపారు. ఎంసీ లింగన్న మాట్లాడుతూ ఉద్యోగుల డిమాండ్లను ప్రభుత్వం పరిష్కరించకపోతే రానున్న రోజుల్లో పెద్ద ఎత్తున ఉద్యమాలు నిర్వహిస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. జాతీయ కళాకారులు డా. ఫిరంగి జోసెఫ్ బాబూరావు, తెలంగాణ ధూంధాం కళాకారులు దరువు భోజన్న, ఎడగనూరు దినేష్ తమ పాటలతో పాల్గొన్న వారిని అలరించారు.

# భూభారతి, 22-ఏ సమస్యలు వెంటనే పరిష్కరించాలి

ప్రతి మండలంలో పైలట్ ప్రాతిపదికన
సమగ్ర భూ రీ-సర్వే



**నిర్మల్ జిల్లా ప్రతినిధి ,ఆగస్టు 27 ,( ప్రజాజ్యోతి ).**రాష్ట్రంలోని భూభారతి, 22-ఏ, సమగ్ర రిసర్వే చేసేందుకు నిర్దేశించిన అంశాల పై గురువారం రాష్ట్ర రెవెన్యూ కార్యదర్శి లోకేష్ కుమార్ జిల్లా కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష నిర్వహించారు. ఈ వీడియో కాన్ఫరెన్స్ లో భాగంగా రెవెన్యూ కార్యదర్శి లోకేష్ కుమార్ మాట్లాడుతూ, భూభారతి డాటా ఆధారంగా ఎక్కడైనా 22 ఎ ఎక్స్ టెంట్ లో తేడాలు వస్తే వాటిని భూభారతి పోర్టల్ లోనే పరిష్కరించాలని సూచించారు. వ్యవసాయ, వ్యవసాయేతర భూముల్లో 22 ఎ కింద నమోదు అయినట్లు ఉంటే వాటిని గుర్తించి, నిర్ణీత ప్రొఫార్మాలో తహసిల్దార్ల నుంచి సేకరించి నివేదిక సమర్పించాలని పేర్కొన్నారు. ఇందుకోసం స్టాండర్డ్ ఆపరేషన్ సిస్టం అమలు చేయాలని తెలియజేశారు. ఎస్ ఆర్ ఓ లో వచ్చిన ఫిర్యాదులను తక్షణమే పరిష్కరించే విధంగా చర్యలు తీసుకోవాలని సూచించారు. ప్రతి మండలంలో ఒక గ్రామాన్ని ఎంచుకొని ఆగ్రామంలో సమగ్రంగా భూ రీసర్వే నిర్వహించేందుకు చర్యలు తీసుకోవాలని వాటి సత్ఫలితాలు ఆధారంగా అన్ని గ్రామాల్లో రీ-సర్వే చేయాల్సి ఉంటుందని తెలియజేశారు. భైంసా సబ్ కలెక్టర్ కార్యాలయం నుంచి ఈ వీసీలో జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా, భైంసా సబ్ కలెక్టర్ అజ్మీరా సంకేత్ కుమార్, ఇతర అధికారులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

## ప్రజా సంక్షేమమం లో పార్టీలతో పట్టింపు లేదు ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్ వెల్లడి



**ఖానాపూర్ ఆగస్టు 27( ప్రజా జ్యోతి )** ప్రజా సంక్షేమంలో అభివృద్ధి ధ్యేయంగా పార్టీల పట్టింపు లేకుండా పనిచేయాలని ఖానాపూర్ శాసనసభ్యులువెడ్మ బొజ్జు పటేల్ అన్నారు నిర్మల్ జిల్లా కడెం మండలం లింగాపూర్ గ్రామంలో సర్ ఫేజ్--2లో భాగంగా నిర్వహించిన గ్రామ సభలో ఖానాపూర్ శాసన సభ్యులు వెడ్మ బొజ్జు పటేల్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ రానున్న రోజుల్లో కూడా ఇదే సంప్రదాయాన్ని కొనసాగిస్తూ గ్రామాల అభివృద్ధి, ప్రజల సంక్షేమానికి కృషి చేస్తానని అన్నారు. ఎన్నికల సమయంలో మాత్రమే రాజకీయాలు ఉంటాయని, ఎన్నికలు పూర్తయిన తర్వాత ప్రజల సమస్యల పరిష్కారం, ప్రజా శ్రేయస్సే తన ప్రధాన లక్ష్యమని ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్ స్పష్టం చేశారు. నియోజకవర్గంలోని ప్రతి గ్రామాన్ని సమానంగా అభివృద్ధి చేయడంతో పాటు, ప్రజలకు అందుబాటులో ఉంటూ వారి సమస్యలను పరిష్కరించేందుకు నిరంతరం కృషి చేస్తానని ప్రజలకు హామీ ఇచ్చారు సర్ ప్రక్రియలో భాగంగా అర్హత కలిగిన ప్రతి ఒక్కరి పేరు ఓటరు జాబితాలో ఉండేలా చూడాలని, 18 సంవత్సరాలు నిండిన యువతీ యువకులు ఓటరుగా నమోదు చేసుకోవాలని ఎమ్మెల్యే సూచించారు. ఓటరు జాబితాలో ఏవైనా తప్పులు ఉంటే సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లి సరిచేసుకోవాలని గ్రామస్తులను కోరారు.

# ఆత్రం సక్కు సతీమణిని పరామర్శించిన కాంగ్రెస్ నాయకులు



**ఆసిఫాబాద్, ఆగస్టు 27 ప్రజా జ్యోతి** ఆసిఫాబాద్ మాజీ ఎమ్మెల్యే ఆత్రం సక్కు సతీమణికి హైదరాబాద్‌లోని నిమ్స్ ఆసుపత్రిలో మోకాలికి శస్త్రచికిత్స జరిగిన విషయం తెలుసుకున్న కాంగ్రెస్ నాయకులు గురువారం ఆమెను పరామర్శించారు. ఆసుపత్రికి వెళ్లిన నాయకులు ఆమె ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. శస్త్రచికిత్స అనంతరం వైద్యుల సూచనల మేరకు విశ్రాంతి తీసుకోవాలని సూచించారు. ఆమె త్వరగా సంపూర్ణ ఆరోగ్యంతో కోలుకోవాలని భగవంతుడిని ప్రార్థించారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ నాయకులు మాట్లాడుతూ ఆత్రం సక్కు కుటుంబానికి పార్టీ నాయకులు, కార్యకర్తలు ఎల్లప్పుడూ అండగా ఉంటారని తెలిపారు. శస్త్రచికిత్స విజయవంతంగా పూర్తయినందుకు సంతోషం వ్యక్తం చేశారు. ప్రస్తుతం ఆమె ఆరోగ్యం నిలకడగా ఉందని, త్వరలోనే సాధారణ స్థితికి చేరుకోవాలని ఆకాంక్షించారు. పరామర్శించిన వారిలో కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు, మాజీ మండల అధ్యక్షులు మసాదే చరణ్, లావుడే రమేష్, గురునులే నారాయణ, చిత్తూరి సాగర్, ఆత్రం కూసుమ్ రావు, వి. మురళి, వి. బాబ్లు తదితరులు పాల్గొన్నారు.

## ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణపై గ్రామీణ ప్రాంతాల్లో ప్రత్యేక గ్రామసభలు



**సోనాల, ఆగస్టు 26 ( ప్రజా జ్యోతి ):**ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ ప్రక్రియలో భాగంగా గ్రామ పంచాయతీల్లో ప్రత్యేక గ్రామసభలను నిర్వహించారు. గ్రామ స్థాయిలో బూత్ లెవల్ అధికారులు ముసాయిదా ఓటర్ల జాబితాలను ప్రజల సమక్షంలో బహిరంగంగా చదివి వినిపించారు. మరణించిన వారి పేర్లు, డూప్లికేట్ లేదా బోగస్ ఓట్ల తొలగింపుకు సంబంధించి అన్‌మ్యాపింగ్ లేదా వివరాల్లో వ్యత్యాసాలు ఉండి నోటీసులు పొందిన ఓటర్లు సమర్పించాల్సిన ఆధారాల గురించి అధికారు అవగాహన కల్పించారు. ఓటు హక్కు కలిగిన ప్రతీ ఒక్కరూ తమ వివరాలను సరిచూసుకో వాలని, ఏవైనా మార్పులు లేదా చేర్పులు ఉంటే వెంటనే దరఖాస్తులు అందజేయాలని అధికారులు ఈ సందర్భంగా సూచించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో రత్నాకర్ రావు, సర్పంచ్ బిందు జ సుధీర్ రెడ్డి, మండల కన్వీనర్ గాజుల పోతన్న తదితరులు పాల్గొన్నారు.

## శ్రీ శ్రీ శ్రీ పరమహంస సద్గురు పూలాజీబాబా 102వ జయంతి మహోత్సవ పోస్టర్

ఆవిష్కరించిన ఎమ్మెల్యే బొజ్జు పటేల్



**ఖానాపూర్ ఆగస్టు 27( ప్రజా జ్యోతి)**శ్రీశ్రీశ్రీ పరమహంస సద్గురు పూలాజీ బాబా 102వ జయంతి మహోత్సవాలను పురస్కరించుకుని రూపొందించిన కార్యక్రమ పోస్టర్‌ను ఖానాపూర్ శాసన సభ్యులు వెడ్మ బొజ్జు పటేల్ గురువారం ఆవిష్కరించారు. ఈ నెల 29, 30 తేదీలలో నిర్వహించనున్న జయంతి మహోత్సవ కార్యక్రమాలకు హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని నిర్వాహకులు ఎమ్మెల్యే ని ఆహ్వానించారు.

## అనారోగ్య బాధితుడికి 10వెల ఆర్థిక సాయం

నల్ల వినయ్ రెడ్డి



**ఖానాపూర్ (లక్ష్మ ణ చందా) ఆగస్టు 27 (ప్రజా జ్యోతి)** లక్ష్మణ చందా మండలంలో గల వడ్యాల్ వాసినల్ల వినయ్ రెడ్డితన మానవత్వాన్ని చాటుకున్నాడు. నిర్మల్ పట్టణంలోని చింతకుంట వాడ చెందిన ఒస మధు ప్రమాదానికి గురై ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న విష యం తెలుసుకున్న నల్లా వినయ్ రెడ్డి వెంటనే ఆసుపత్రికి వెళ్లి మధును పరామర్శించారు ఆయన ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకుని, కుటుంబానికి అండగా నిలుస్తూ 10వెల నగదు ఆర్థిక సహాయం అందించారు. కుటుంబ సభ్యులు కృతజ్ఞతలు తెలియజేశారు

# సమస్యలు పరిష్కరించకపోతే సమరమే కొనసాగిస్తాం

**ఆదిలాబాద్ టౌన్, జూలై 27 ( ప్రజా జ్యోతి )** తెలంగాణ రాష్ట్రంలోని ఉద్యోగులు, ఉపాధ్యాయులు, పెన్షనర్లు, కాంట్రాక్ట్ ఉద్యోగుల సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని జేఏసీ రాష్ట్ర స్టీరింగ్ కమిటీ నాయకులు ఎ. వెంకట్ డిమాండ్ చేశారు. సమస్యలను పరిష్కరించకపోతే ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు.ఆదిలాబాద్ జిల్లా కలెక్టర్ కార్యాలయం ఎదుట గురువారం నిర్వహించిన మహాధర్నాలో ఆయన మాట్లాడుతూ, ఉద్యోగుల సమస్యలన్నింటినీ పరిష్కరిస్తామని హామీ ఇచ్చి అధికారంలోకి వచ్చిన ప్రభుత్వం, ప్రతి నెల ఒకటో తేదీన వేతనాలు చెల్లించడం మినహా ఇతర సమస్యలను పరిష్కరించలేదని విమర్శించారు.పీఆర్సీ నివేదిక సిద్ధంగా ఉన్నప్పటికీ ముఖ్యమంత్రి స్వీకరించి అమలు చేయకపోవడం బాధాకరమన్నారు. నిత్యావసర వస్తువుల ధరలు భారీగా పెరిగిన నేపథ్యంలో ప్రతి ఆరు నెలలకు ఒకసారి పెరగాల్సిన డీఏలను మూడేళ్లుగా పెండింగ్‌లో ఉంచడం వల్ల ఉద్యోగులకు తీవ్ర నష్టం వాటిల్లిందన్నారు. వెంటనే ఆరు డీఏలను విడుదల చేయాలని డిమాండ్ చేశారు.సీపీఎస్ విధానాన్ని అధికారంలోకి వచ్చిన వెంటనే రద్దు చేస్తామని హామీ ఇచ్చి మూడేళు గడిచినా ఆ దిశగా చర్యలు తీసుకోకపోవడం సరికాదన్నారు. రూ.10 వేల కోట్ల పెండింగ్ బిల్లులను బేషరతుగా వెంటనే చెల్లించాలని, ఎంప్లాయీస్ హెల్త్ స్కీమ్‌ను పకడ్బందీగా అమలు చేయాలని కోరారు. కాంట్రాక్ట్ ఉద్యోగులకు వారి శ్రమకు తగిన వేతనాలు చెల్లించాలని డిమాండ్ చేశారు.ఈ సమస్యలన్నింటినీ ప్రభుత్వం తక్షణమే పరిష్కరించాలని, లేకపోతే సెప్టెంబర్ 10న ఉద్యోగులు, ఉపాధ్యాయులు, పెన్షనర్లు, కార్మికులను పెద్ద ఎత్తున హైదరాబాద్‌కు తరలించి నగరాన్ని దిగ్బంధనం చేస్తామని హెచ్చరించారు.మహాధర్నాకు టీఎన్‌జీవో ప్రధాన కార్యదర్శి నవీన్ అధ్యక్షత వహించారు. ఆయన మాట్లాడుతూ, సమస్యల పరిష్కారం కోసం పెద్ద ఎత్తున ఉద్యోగులు తరలిరావడం హర్షణీయమన్నారు. సెప్టెంబర్ 10లోపు ప్రభుత్వం స్పందించకపోతే ఆదిలాబాద్ జిల్లా నుంచి వేలాది మందితో ఛలో హైదరాబాద్ కార్యక్రమాన్ని చేపడతా మని హెచ్చరించారు.ఈ మహాధర్నాలో టీజీవో అధ్యక్షుడు కె. శివకుమార్, కె. కృష్ణకుమార్ (పీఆర్‌టీయూ), టీఎన్ స్వామి (పీ ఆర్‌టీయూటీజీ), కె. కిష్టన్న, వి. అశోక్ (టీఎస్‌యూటీఎఫ్), ఎం. శ్రీనివాస్, జె. రవికుమార్ (ఎస్‌టీయూ), బి. వృకోధర్ (టీపీటీఎఫ్), నవీన్ యాదవ్, నూర్‌సింగ్ (టీపీఆర్‌టీయూ), సీహెచ్. సతీష్, చంద్రశేఖర్ (టీఆర్‌టీఎఫ్), కె. విజయ్, నవీన్ (టీఎస్‌ఎస్‌పీఈయూ), ఎండీ. రియాజ్, సత్యనారాయణ (టీఎస్‌పీటీఏ), ఎస్. నర్సింహులు, ఆశన్న (4వ తరగతి ఉద్యోగులు), సప్దర్ అలీ (డ్రైవర్స్ అసోసి యేషన్), జలంధర్ రెడ్డి, శ్రీకాంత్ (టీయూటీఎఫ్), ఎస్. సుదర్శన్ (టీటీయూ), లక్ష్మారెడ్డి, కె. రమేష్ (పెన్షనర్స్ అసోసియేషన్), శ్యామ్యూల్, నగేష్ (డీటీఎఫ్), శశికళ, గోపాల్‌సింగ్ తిలావత్ (జీహెచ్‌ఎం అసోసియేషన్), బ్రహ్మానంద్ రెడ్డి (మెడికల్ అండ్ హెల్త్ అసోసియేషన్)తో పాటు వివిధ సంఘాల నాయకులు, ఉద్యోగులు, ఉపాధ్యాయులు, పెన్షనర్లు భారీ సంఖ్యలో పాల్గొన్నారు.




# దేవదుర్గ గని నుంచి బంగారం, రాగి వెలికితీసి దేశ సంపదను పెంచుదాం

## స్థానికుల సహకారంతో అన్వేషణ పనులను వేగవంతం చేయాలి డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క

## దేవదుర్గలో సైట్ క్యాంప్ ఆఫీస్, హెలిప్యాడ్ ఏర్పాటు చేయాలని సింగరేణి అధికారులకు ఆదేశం

**మంచిర్యాల, 27, ఆగస్టు (ప్రజా జ్యోతి):** కర్ణాటకలోని దేవదుర్గ గని నుంచి పెద్ద ఎత్తున బంగారం, రాగి ఖనిజాలను వెలికితీసి దేశ సంపదను పెంపొందించేందుకు అందరం కలిసికట్టుగా కృషి చేయాలని తెలంగాణ రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క పిలుపునిచ్చారు. స్థానికుల సహకారంతో ఖనిజ అన్వేషణ పనులను త్వరితగతిన పూర్తి చేయాలని ఆయన సింగరేణి అధికారులను ఆదేశించారు. రాయచూర్ జిల్లా దేవదుర్గ తాలూకా లింగదహళ్లి గ్రామంలో సింగరేణి సంస్థ ఆధ్వర్యంలో చేపట్టనున్న కాపర్, గోల్డ్ మైనింగ్ అన్వేషణ కార్యక్రమాన్ని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క అధికారికంగా ప్రారంభించారు. అనంతరం అన్వేషణ చేపట్టనున్న ప్రాంతాలను క్షేత్రస్థాయిలో స్వయంగా పరిశీలించారు. దాదాపు 136 సంవత్సరాల సుదీర్ఘ మైనింగ్ అనుభవం కలిగిన సింగరేణి సంస్థ కేంద్ర ప్రభుత్వం నిర్వహించిన టెండర్లలో దేవదుర్గ బ్లాక్ ఎక్స్‌ప్లోరేషన్ హక్కులను దక్కించుకున్న విషయాన్ని ఆయన గుర్తుచేశారు. క్షేత్రస్థాయి పరిశీలన అనంతరం భట్టి విక్రమార్క మాట్లాడుతూ దేవదుర్గలో ఖనిజ అన్వేషణ పనులను సింగరేణి సంస్థ త్వరలోనే మరింత వేగవంతం చేస్తుందని తెలిపారు. ఈ ప్రాజెక్టు విజయవంతమై బంగారం, రాగి ఖనిజాలు విరివిగా లభిస్తే ఈ ప్రాంతంలోని నిరుద్యోగ యువతకు పెద్ద ఎత్తున ఉపాధి అవకాశాలు లభించడంతో పాటు ప్రాంతీయంగా అభివృద్ధి వేగవంతమవుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. అన్వేషణ పనుల పర్యవేక్షణ కోసం సింగరేణి అధికారులు స్థానికంగా అందుబాటులో ఉండేలా దేవదుర్గలో సైట్ క్యాంప్ ఆఫీస్ ఏర్పాటు చేయాలని ఆయన ఆదేశించారు. అలాగే రాకపోకల సౌకర్యార్థం హెలిప్యాడ్‌ను కూడా ఏర్పాటు చేయాలని సూచించారు. స్థానిక రెవెన్యూ అధికారులు స్థలాన్ని కేటాయించిన వెంటనే సైట్ ఆఫీస్, హెలిప్యాడ్ నిర్మాణ పనులు ప్రారంభించనున్నట్లు తెలిపారు. రెండు రాష్ట్రాల అభివృద్ధికి దోహదం అవుతుందని అన్నారు. కృష్ణానదికి ఇరువైపులా నివసిస్తున్న తెలుగు, కర్ణాటక ప్రజల మధ్య చారిత్రక, సాంస్కృతికంగా విడదీయరాని బంధం ఉందని భట్టి విక్రమార్క పేర్కొన్నారు. ఒకప్పుడు ఈ ప్రాంతం హైదరాబాద్ రాష్ట్రంలో భాగంగా ఉండేదని, అందువల్ల ఇరు ప్రాంతాల ప్రజల మూలాలు ఒక్కటేనని గుర్తుచేశారు. స్థానిక ప్రజల సహకారం, అండదండలతో దేవదుర్గ ఖనిజ అన్వేషణ ప్రాజెక్టును విజయవంతంగా పూర్తి చేసి దేశ సంపదను పెంచేందుకు వినియోగించుకోవాలని పిలుపునిచ్చారు. దేవదుర్గలో లభించే ఖనిజ సంపదను వెలికితీయడం ద్వారా రెండు రాష్ట్రాల పురోగతికి, దేశ ఆర్థిక వ్యవస్థ బలోపేతానికి ఎంతో దోహదపడుతుందని ఆయన ఆకాంక్షించారు.

**ఖనిజ నమూనాల ప్రదర్శన పరిశీలన...........**

లింగదహళ్లి గ్రామానికి చేరుకున్న ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్కకు కర్ణాటక మాజీ మంత్రి బోసురాజు తనయుడు, కాంగ్రెస్ నాయకుడు రవి బోసురాజు, స్థానిక సర్పంచ్ ఎల్లమ్మ తదితరులు ఘన స్వాగతం పలికారు. అనంతరం దేవదుర్గ బంగారు ఖనిజ బ్లాక్ వ్యూ పాయింట్ నుంచి అన్వేషణ చేపట్టనున్న ప్రాంతాలను ఆయన క్షుణ్ణంగా పరిశీలించారు. సింగరేణి అధికారులు సేకరించిన వివిధ రకాల ఖనిజ నమూనాలతో ఏర్పాటు చేసిన ప్రదర్శనను తిలకించిన భట్టి విక్రమార్క, బంగారం, రాగి ఖనిజాల అన్వేషణ, వెలికితీతకు సంబంధించిన వివరాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం సింగరేణి అధికారులు, కర్ణాటక రాష్ట్ర అధికార యంత్రాంగంతో సమీక్షా సమావేశం నిర్వహించి ఖనిజ అన్వేషణ పనులపై దిశానిర్దేశం చేశారు.

**పరమానంద శివాలయంలో ప్రత్యేక పూజలు.........**

క్షేత్రస్థాయి పర్యటన ముగించుకుని లింగదహళ్లి గ్రామంలోని



చారిత్రక నేపథ్యం కలిగిన శ్రీ పరమానంద శివాలయాన్ని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క దర్శించుకున్నారు. ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు.

**దేవదుర్గతో ప్రత్యేక అనుబంధం :**

**సింగరేణి సీఎండీ డాక్టర్ బుద్ధప్రకాష్ జ్యోతి................**

దేవదుర్గ ప్రాంతంతో తనకు ప్రత్యేక అనుబంధం ఉందని సింగరేణి సంస్థ చైర్మన్, ఎండీ డాక్టర్ బుద్ధప్రకాష్ జ్యోతి తెలిపారు. గతంలో తాను ఈ ప్రాంతంలో సీఐగా పనిచేశానని, ప్రస్తుతం సింగరేణి సంస్థ చైర్మన్, ఎండీ హోదాలో ఇక్కడ బంగారం, రాగి ఖనిజ అన్వేషణ పనులను స్థానికుల సమక్షంలో ప్రారంభించడం ఆనందంగా ఉందన్నారు. శ్రీ పరమానంద స్వామి ఆశీస్సులతో దేవదుర్గలో సమృద్ధిగా బంగారు నిక్షేపాలు లభించాలని, తద్వారా స్థానిక ప్రజలకు పెద్ద ఎత్తున ఉపాధి అవకాశాలు కలగాలని ఆయన ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో సింగరేణి సంస్థ డైరెక్టర్ సీకే వెంకటేశ్వర్లు, జీఎం పంకజ్ కుల శ్రేష్ట, తెలంగాణ, కర్ణాటక రాష్ట్రాల ప్రజాప్రతినిధులు, సింగరేణి ఉన్నతాధికారులు, స్థానిక నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# ఏఐటీయూసీ మహాసభలకు కార్మికులు తరలి రావాలి




**నేరడిగొండ, ఆగస్టు 27 (ప్రజాజ్యోతి):**కార్మికుల హక్కుల పరిరక్షణ కోసం పోరాడుతూ అనేక హక్కులను సాధించిన ఏఐటీయూసీ తెలంగాణ 4వ మహాసభలను జయప్రదం చేయాలని ఏఐటీయూసీ జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ కళ్లేపల్లి గంగయ్య పిలుపునిచ్చారు. గురువారం నేరడిగొండ మండల కేంద్రంలో ఏఐటీయూసీ మండల కమిటీ ఆధ్వర్యంలో మహాసభల పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కళ్లేపల్లి గంగయ్య మాట్లాడుతూ.. కరీంనగర్ జిల్లా కేంద్రంలో నిర్వహించనున్న ఏఐటీయూసీ తెలంగాణ 4వ మహాసభల్లో కార్మికుల సమస్యలు, హక్కులపై విస్తృతంగా చర్చించనున్నట్లు తెలిపారు. కేంద్ర ప్రభుత్వం అవలంబిస్తున్న కార్మిక వ్యతిరేక విధానాలను, నాలుగు లేబర్ కోడ్‌లను రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ మహాసభలు నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. ప్రతి కార్మికుడు పెద్ద సంఖ్యలో పాల్గొని మహాసభలను విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ మండల నాయకులు పెరుమాళ్ల నరసయ్య, గంగాధరి గంగయ్య, రౌట్ల రాజేశ్వర్, గురువయ్యతో పాటు పలువురు కార్మిక నాయకులు పాల్గొన్నారు.

# చింతల్ బోరిలో ఓటర్ల సమగ్ర సవరణపై గ్రామసభ



**సోనాల, ఆగస్టు 27 ( ప్రజాజ్యోతి):** సోనాల మండల పరిధిలోని చింతల్ బోరి గ్రామంలో ఓటర్ల సమగ్ర సవరణ పై ప్రత్యేక గ్రామసభ నిర్వహించారు. ఈ సందర్భంగా అధికారులు మాట్లాడుతూ, ఓటర్ లిస్టులో పేర్లు తప్పుగా నమోదైన వారు తమ దృష్టికి తీసుకురావాలని తెలిపారు. గ్రామసభలో బిఎల్ఓలు గ్రామ సర్పంచ్ గాయక్వాడ్ శ్రీరామ్, ఇతర ప్రజాప్రతినిధులు మరియు గ్రామస్తులు పాల్గొన్నారు. ఓటరు జాబితాలో తమ పేర్లను సరిచూసుకోవాలని, ఎలాంటి తప్పులున్నా వెంటనే అధికారుల దృష్టికి తీసుకురావాలని ఈ సందర్భంగా గ్రామస్తులకు అవగాహన కల్పించారు.

# కడెం మండలంలో పలు బాధిత కుటుంబాలను పరామర్శించిన ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్





**ఖానాపూర్ ఆగస్టు 27 (ప్రజా జ్యోతి)** ఖానాపూర్ నియోజకవర్గం కడెం మండలంలోని పలు గ్రామాల్లో ఇటీవల మృతి చెందిన కుటుంబాలను, అనారోగ్యంతో బాధపడుతున్న బాధితులను ఖానాపూర్ శాసన సభ్యులు వెడ్మ బొజ్జు పటేల్ గురువారం పరామర్శించారు. ఈ సందర్భంగా బాధిత కుటుంబ సభ్యులను ఆప్యాయంగా కలుసుకుని వారి పరిస్థితులను అడిగి తెలుసుకుని, ధైర్యం చెప్పారు. కడెం మండలం సారంగాపూర్ గ్రామానికి చెందిన మార్కపు లక్ష్మణ్ తండ్రి, మృతి చెందడంతో వారి కుటుంబ సభ్యులను ఎమ్మెల్యే పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలిపారు. అలాగే కోల శ్రీనివాస్ తండ్రి అనారోగ్యం తో ఉండగా వాళ్లని పరామర్శించి ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు ఎలగడప గ్రామానికి చెందిన ముప్పిడి నర్సయ్య తల్లి ఇటీవల మృతి చెందడంతో ఆ కుటుంబాన్ని పరామర్శించారు. అలాగే అబ్దుల్ రహీం కాలు విరిగి చికిత్స పొందుతున్న విషయం తెలుసుకుని పరామర్శించి ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. నచ్చనెల్లాపూర్ గ్రామానికి చెందిన దుర్గం లక్ష్మణ్ దుబాయ్‌లో మృతి చెందడంతో ఆకుటుంబ సభ్యులను పరామర్శించి సానుభూతి తెలిపారు. కొండుకూరు గ్రామానికి చెందిన పీవీ రావు ధర్మాజీపేట గ్రామానికి చెందిన మంతెన శ్రీనివాస్ ఇటీవల మృతి చెందడంతో వాళ్ల కుటుంబ సభ్యులను కలిసి పరామర్శించారు. చిట్యాల్ గ్రామానికి చెందిన మేడి రాజేందర్ ప్రమాదవశాత్తు తీవ్రంగా గాయపడటంతో కాలు పూర్తిగా తొలగించాల్సి రావడంతో వారిని పరామర్శించి ఆరోగ్య పరిస్థితిని తెలుసుకున్నారు. నవాబ్‌పేట గ్రామానికి చెందిన సిందం గంగన్న ఇటీవల మృతి చెందడంతో కుటుంబ సభ్యులను కలిసి సానుభూతి ఎమ్మెల్యే బొజ్జు పటేల్ తెలిపారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. కష్టకాలంలో ప్రజలకు అండగా ఉండటం తన బాధ్యత అని, బాధిత కుటుంబాలకు ఎల్లప్పుడూ తన సహాయ సహకారాలు అందిస్తానని తెలిపారు. ప్రజల సుఖదుఃఖాల్లో భాగస్వామిగా ఉంటూ వారికి ధైర్యం కల్పించేందుకు ఎల్లప్పుడూ ముందుంటానని ఎమ్మెల్యే బొజ్జు పటేల్ భరోసా ఇచ్చారు.

## కానర్‌గాంలో ఓటరు జాబితా ప్రత్యేక సవరణపై అవగాహన

**అర్హులందరి పేర్లు ఓటరు జాబితాలో ఉండాలి**

**ఓటు హక్కును ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలి**



**ఆసిఫాబాద్ , ఆగస్టు 27 ప్రజా జ్యోతి** ఓటరు జాబితా ప్రత్యేక సవరణలో భాగంగా వాంకిడి మండలంలోని కానర్‌గాం గ్రామపంచాయతీ పరిధిలో గురువారం ప్రత్యేక గ్రామసభ నిర్వహించారు. సర్పంచ్ కొట్నాక భీమ్‌రావు, ఉప సర్పంచ్ జీవన్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ గ్రామసభలో ఓటరు జాబితాను పరిశీలించారు. అర్హులైన ప్రతి ఒక్కరి పేరు ఓటరు జాబితాలో ఉండేలా చూడాలని సూచించారు. ఈ సందర్భంగా సర్పంచ్ కొట్నాక భీమ్‌రావు మాట్లాడుతూ.. ఓటు హక్కు ప్రతి పౌరుడికి ఉన్న రాజ్యాంగ హక్కు అని అన్నారు. 18 ఏళ్లు నిండిన అర్హులైన ప్రతి ఒక్కరూ ఓటరుగా నమోదు చేసుకోవాలని సూచించారు. ఓటరు జాబితాలో పేర్లు, చిరునామాలు, ఇతర వివరాల్లో ఏమైనా తప్పులు ఉంటే ప్రత్యేక సవరణ ప్రక్రియ ద్వారా సరిచేసుకోవాలని కోరారు. ఓటు హక్కును ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు, పంచాయతీ కార్యదర్శి, బీఎల్ఓ, బీఎల్ఏ, గ్రామ ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

## ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలను వెంటనే విడుదల చేయాలి

**బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు అరిగెల నాగేశ్వరరావు**



**ఆసిఫాబాద్, ఆగస్టు 28 ప్రజా జ్యోతి** ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలను రాష్ట్ర ప్రభుత్వం వెంటనే విడుదల చేసి నిరుపేద విద్యార్థులను ఆదుకోవాలని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు, సీనియర్ నాయకుడు అరిగెల నాగేశ్వరరావు డిమాండ్ చేశారు. గురువారం జిల్లా కేంద్రంలోని అంబేద్కర్ చౌక్‌లో బీజేవైఎం ఆధ్వర్యంలో నిర్వహించిన ధర్నాలో ఆయన పాల్గొని మాట్లాడారు. ముఖ్యమంత్రి వద్ద విద్యాశాఖ ఉన్నప్పటికీ ఫీజు రీయింబర్స్‌మెంట్ నిధులు విడుదల చేయకపోవడంతో రాష్ట్రంలో కొన్ని వందల కళాశాలలు మూతపడే పరిస్థితి ఏర్పడిందన్నారు. ఫీజులు చెల్లించలేక అనేక మంది నిరుపేద విద్యార్థులు చదువులను మధ్యలోనే నిలిపివేయాల్సి వస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం వెంటనే బకాయిలను విడుదల చేయాలని, లేనిపక్షంలో బీజేపీ ఆధ్వర్యంలో మరిన్ని ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు. కార్యక్రమంలో బీజేవైఎం జిల్లా అధ్యక్షుడు సుచిత్, బీజేపీ జిల్లా యువజన అధ్యక్షుడు గాజుల రాజేంద్రప్రసాద్, సింగిల్ విండో వైస్ చైర్మన్ రుకుం ప్రహ్లాద్, నాయకులు ప్రసాద్ గౌడ్, మేకర్తి లచ్చన్న, సప్తే శ్రీనివాస్, శంకర్ ప్రశాంత్ తదితరులు పాల్గొన్నారు.

## 9వ వార్డు సర్ సర్వే సభలో పాల్గొన్న మున్సిపల్ చైర్ పర్సన్ అంకం మౌనిక మహేందర్



**ఖానాపూర్ ఆగస్టు 27 (ప్రజా జ్యోతి )**ఖానాపూర్ పట్టణంలోని శాంతినగర్ కాలనీ 9వ వార్డులో గురువారం సర్ సర్వేకు వార్డు సభ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ అంకం మౌనిక మహేందర్ పాల్గొన్నారు ఈ సందర్భంగా మాట్లాడుతూ కొన్ని రోజుల క్రితం జరిగిన సర్ సర్వే పత్రములలో ఇంటి పేర్లు తదితర వివరాలు తప్పుగా ఉన్నవారి ఫారములు సరి చేసుకోవడానికి మళ్లీ ఒక అవకాశం కల్పిస్తూ బి ఎల్ ఓ లు మీ ఇంటి వద్దకు వచ్చి మీ యొక్క ఫారమును మీకు అందజేసి వివరాలు అడిగి సవరణ చేసుకుంటార అని అన్నారు దీనికి సహకరించి ఓటు పోకుండా పగడ్బందీగా ఓటు కాపాడుకునే విధంగా సమాచారం అందించాలని మౌనిక కోరారుఈ కార్యక్రమంలో సర్ సర్వే సూపర్వైజర్ కిషన్ బి ఎల్ ఓ లు అజయ్ కుమార్ కొండ రాజలింగు.రాజు బి ఎల్ ఏ లు కాలనీవాసులు తదితరులు పాల్గొన్నారు

## వింధ్య పాఠశాల లో ఘనంగా రాఖీ పౌర్ణమి వేడుకలు



**సారంగాపూర్, ఆగస్టు 27,ప్రజా జ్యోతి** మండలంలోని వింధ్య పాఠశాల లో రాఖీ పౌర్ణమి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు ఒకరికొకరు రాఖీలు కట్టుకుంటూ సోదరభావాన్ని చాటుకున్నారు."నీవు నాకు రక్ష... నేను నీకు రక్ష... మనం దేశానికి రక్ష" అనే సందేశంతో విద్యార్థులు రాఖీలు కట్టుకోవడం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది.రక్షాబంధన్ పండుగ మానవ సంబంధాలకు, ముఖ్యంగా సోదర సోదరీమణుల అనుబంధానికి ప్రతీక అని పాఠశాల కరస్పాండెంట్ ఆకుల రమేష్ తెలిపారు. విద్యార్థుల్లో పరస్పర ప్రేమ, ఆప్యాయత, బాధ్యతా భావం పెంపొందించేందుకు ఇటువంటి వేడుకలు ఎంతగానో దోహదపడతాయని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపల్ కే. నవీన్ కుమార్, శ్రీరాం శ్రీనివాస్, సాయినాథ్, శ్రీనివాస్ గౌడ్, శ్రీలత, పల్లవి, సుమన్య, లావణ్య, సంధ్యారాణి, స్రవంతి, సులోచన, గౌతమి, దివ్య, సౌజన్య, పావని, ప్రేరణ, శరణ్య, జ్యోతి తదితర ఉపాధ్యాయులు విద్యార్థులు పాల్గొన్నారు.


## వివేకానంద పాఠశాలలో ఘనంగా రాఖీ బంధన్ వేడుకలు



**సారంగాపూర్, ఆగస్టు 27, ప్రజా జ్యోతి:** మండలంలోని వివేకానంద పాఠశాలలో రాఖీ పౌర్ణమిని పురస్కరించుకుని ముందస్తుగా రాఖీ బంధన్ వేడుకలను ఘనంగా నిర్వహించారు. పాఠశాల ప్రాంగణంలో నిర్వహించిన ఈ వేడుకల్లో విద్యార్థులు ఎంతో ఉత్సాహంగా పాల్గొని, భారతీయ సంస్కృతి, సంప్రదాయా ల గొప్పతనాన్ని చాటిచెప్పారు.ఈ సందర్భంగా విద్యార్థులు ఒకరికొకరు రాఖీలు కట్టుకుని సోదర సోదరీమణుల మధ్య ప్రేమ, ఆప్యాయత, అనుబంధం మరియు పరస్పర రక్షణకు ప్రతీకగా నిలిచే రాఖీ బంధన్ పండుగ విశిష్టతను ప్రదర్శించారు. రంగురంగుల దుస్తుల్లో విద్యార్థులు పాల్గొనడంతో పాఠశాల ప్రాంగణం పండుగ వాతావరణాన్ని సంతరించుకుంది. విద్యార్థులకు రాఖీ బంధన్ పండుగ ప్రాముఖ్యతను కరస్పాండెంట్ సముద్రాల గీత, వివరించారు. మన భారతీయ సంస్కృతి, సంప్రదాయాలను చిన్నారులకు పరిచయం చేయడంతో పాటు వాటిని భావితరాలకు అందించడం ప్రతి ఒక్కరి బాధ్యత అని ఈ సందర్భంగా పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపల్ నేరెళ్ల ఉషారాణి, వైస్ ప్రిన్సిపల్ మద్రి కళ్యాణ్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొని వేడుకలను విజయవంతం చేశారు.

# కేజీబీవీలలో విద్యార్థులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా చూడాలి





### జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా



**నిర్మల్ జిల్లా ప్రతినిధి ,ఆగస్టు 27 ,( ప్రజాజ్యోతి ).**కేజీబీవీలలో విద్యార్థులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా చూడాలని జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా అధికారులను ఆదేశించారు. గురువారం జిల్లా కలెక్టర్ భైంసా కేజీబీవీను (కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయం) ఆకస్మికంగా తనిఖీ చేశారు.పాఠశాల పరిసర ప్రాంతాలను పరిశీలించారు. పరిసరాలను ఎప్పటికప్పుడు శుభ్రం చేసుకుంటూ ఉండాలన్నారు. విద్యార్థులు ఉపాధ్యాయులు, సిబ్బంది సంఖ్య, హాజరైన వారి సంఖ్య, విద్యార్థులకు కల్పిస్తున్న సౌకర్యాలు, ప్రతిరోజు అందిస్తున్న భోజనం, విద్య, తదితర వివరాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించడమే కాకుండా, మెరుగైన వసతులను, మెనూ ప్రకారం ఆహారాన్ని తప్పనిసరిగా అందించాలన్నారు.పదవ తరగతి విద్యార్థులతో ముఖాముఖి మాట్లాడుతూ ప్రతిరోజు మెనూ ప్రకారం నాణ్యమైన భోజనం అందిస్తున్నారా, కల్పిస్తున్న సౌకర్యాలు, ఏవైనా ఇబ్బందులు ఉన్నాయేమో అని వాకబు చేశారు. పదవ తరగతి విద్యార్థులతో ఇప్పటివరకు పూర్తయిన సిలబస్ నుండి గణితం, భౌతిక శాస్త్రం తదితర సబ్జెక్టుల్లో పలు పాఠాలను విద్యార్థులకు చెప్పి, ప్రశ్నలను వేసి వారి నుంచి జవాబులు రాబట్టారు. జవాబులు చెప్పిన విద్యార్థులను అభినంచి, పెన్నులు బహుమతులుగా ఇచ్చారు. కష్టపడి చదువుకోవాలని తెలిపారు.ఈ తనిఖీలో జిల్లా విద్యాశాఖ అధికారి భోజన్న, ఎంపీడీవో నీరజ్ కుమార్, ఎంఈవో సుభాష్, ఎంపీఓ ప్రదీప్, ఇతర అధికారులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

## మహిళలకు అండగా పోలీసులు

### జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్

### జిల్లా ఎస్పీకి రాఖీ కట్టి, మిఠాయి తినిపించిన విద్యార్థినులు





**ఆదిలాబాద్ బ్యూరో, ఆగష్టు 27, (ప్రజా జ్యోతి)**మహిళలకు పోలీసులు ఎప్పుడు అండగా ఉంటారని జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్ అన్నారు. రక్షాబంధన్ సంద ర్భంగా ఆదిలాబాద్ జిల్లా పోలీసు ముఖ్య కార్యాల యంలో శ్రీ సరస్వతి శిశు మందిర్ విద్యార్థినులు, బ్రహ్మకుమారీస్ సభ్యులు, ప్రజాఫిర్యాదుల విభాగం అధి కారి జై స్వాల్ కవిత జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్ ఐపీ ఎస్‌కు రాఖీ కట్టి రక్షాబంధన్ శుభాకాంక్షలు తెలిపారు. అ నంతరం ఎస్పీకి మిఠా యి తినిపించి తమ ఆప్యాయ తను చాటుకున్నారు. అదేవిధంగా దాబా (బి) గ్రామంలో నిర్వహించిన 'పోలీసులు మీకోసం' కార్యక్ర మంలో పాల్గొన్న ఇచ్చోడ విద్యాలయ పాఠశాల విద్యార్థులు డ్రగ్స్, రోడ్డు భద్రత పై చక్కటి కళా ప్రదర్శన నిర్వహించి అవగాహన కల్పించారు. అనంతరం జిల్లా ఎస్పీకి రాఖీ కట్టి, తమకు రక్షగా ఉండాలని కోరారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ జిల్లాలోని ప్రతి మహిళ, బాలిక కు పోలీసు శాఖ ఎల్లప్పు డూ అండగా ఉంటుందని తెలిపారు. విద్యార్థులు, విద్యార్థినులు ధైర్యంగా ఉండి చదువుపై దృష్టి సారించి ఉన్నత లక్ష్యాలను సాధిం చాలని సూచించారు.

# ఒక కెమెరా 100 కళ్ళతో సమానం



మాదాపూర్ గ్రామంలో 21 సీసీటీవీ కెమెరాల ప్రారంభం

రోడ్ భద్రత నియమాలు పాటించాలి

గంజాయి కి దూరంగా ఉండాలి జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్



**ఇచ్చోడ, ఆగస్టు 27, (ప్రజా జ్యోతి )** ఒక్క సిసి కెమెరా వంద కళ్ళ తో సమానమని, ప్రతి గ్రామంలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్ అన్నారు. గురువారం ఇచ్చోడ మండలం మాదా పూర్ గ్రామంలో గ్రామ ప్రజలు ఏ ర్పాటు చేసిన 21 సీసీ టీవీ కెమెరాలను జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్ ఐపీఎస్ ప్రారంభించారు. మాదాపూర్ గ్రామానికి చేరుకున్న జిల్లా ఎస్పీకి గ్రామ ప్రజలు ఘన స్వాగతం పలికారు. అనంతరం మహాత్మా గాంధీ, డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ చిత్ర పటాలకు పూలమాలలు వేసి నివాళులు అర్పించి కార్యక్ర మాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ మాట్లాడుతూ గ్రామంలో ఏర్పా టు చేసిన సీసీటీవీ కెమెరాలు శాంతిభద్రతల పరిరక్షణతో పాటు నేరాల నియంత్ర ణకు ఎంతగానో ఉపయోగ పడతాయని తెలిపారు. ప్రజలు ట్రాఫిక్ నిబంధనలు పాటిస్తూ ద్విచక్ర వాహనాలు నడిపేటప్పుడు తప్పని సరిగా హెల్మెట్ ధరించాలని సూచించారు. యువత గం జాయికి దూరంగా ఉండాలని, మత్తు పదార్థాల వల్ల కలిగే అనర్థాలపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని సూచించారు. గ్రామంలో అన్ని మతాల ప్రజలు పరస్పరం సోదర భావంతో, ఐక్యమత్యంగా ఉంటూ శాంతి యుత వాతావరణాన్ని కొనసాగించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఉట్నూర్ఏఎస్పీ రుత్విక్ సాయి కొట్టే ఐపీఎ స్, ఇచ్చోడ ఎస్ హెచ్ ఓ కె. నరేష్ కుమార్, గ్రామ సర్పంచ్ షేక్ ఇమ్రాన్, గ్రామ పెద్దలు, పోలీసు సిబ్బంది, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

## బాబా పూర్ లో సర్ ఓటర్ పైన సమీక్ష



**లక్ష్మణ చాంద, ఆగస్టు 27** (ప్రజా జ్యోతి) మండల కేంద్రంలో గల బాబాపూర్ గ్రామంలో గురువారం రోజున సర్ ఓటర్స్ పైన రాష్ట్ర ఉర్దూ అకాడమీ చైర్మన్ తహర్ బిన్ హందన్, ఏఎంసి చైర్మన్ సోమ్ భీమ్ రెడ్డి సమీక్ష కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు కొండ్ర నరేష్ రెడ్డి, మార్కెట్ కమిటీ ఉపాధ్యక్షులు ఈటల శ్రీనివాస్, మాజీ జెడ్పీటీసీ నారా గౌడ్, గ్రామ సర్పంచ్ పడిగెల లక్ష్మి, ఉప సర్పంచ్ సురేష్ రెడ్డి, మాజీ సర్పంచ్ నారాయణ, మాజీ ఎంపీపీ రాజేశ్వర్, వద్యాల్ ఉప సర్పంచ్ రవీందర్, లక్ష్మణ చాంద కాంగ్రెస్ మైనార్టీ అధ్యక్షులు తదితరులు పాల్గొన్నారు.

## సిర్పూర్(టి)పోలీస్ స్టేషన్ పరిధిలో పోలీసులు వాహనాలను తనిఖీ నిర్వహిస్తున్న సమయంలో

**టీఎస్ 20 టి7422 నంబర్ గల బొలెరో వాహనంలో ఏలాంటి అనుమతి పత్రలు లేకుండా తరలిస్తున్న 33 క్వింటల్లా పిడిఎస్ బియ్యాన్ని స్వాధీనం చేసుకొని బొలెరో వాహనం జప్తు చేశారు**

**పంచనామ నిర్వహించిన డిటి.రాజ్ కుమార్ ఫిర్యాదు మేరకు:**

**కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్న సిర్పూర్ (టి) ఎస్.ఐ, డి.సాగర్:**



**ఆగస్ట్ 27 సిర్పూర్ (టి) ఆర్.సి ప్రజాజ్యోతి:** కొమురం భీం ఆసిఫాబాద్ జిల్లా సిర్పూర్(టి) మండల కేంద్రంలోని పోలీస్ స్టేషన్ పరిధిలో ఎస్.ఐ, డి.సాగర్ ఆధ్వర్యంలో వాహనాలను తనిఖీ నిర్వహిస్తున్న సందర్భం లో టీఎస్ 20 టి 7422 నంబర్ గల బొలెరో వాహనాన్ని తనిఖీ చేయగా,అట్టి బొలెరో వాహనంలో ఎటువంటి అనుమతి పత్రాలు లేకుండా 33 క్వింటాళ్ల పిడిఎస్ బియ్యాన్ని కొమురం భీం ఆసిఫాబాద్ జిల్లా కౌటాల మండలం కన్నెపల్లి గ్రామానికి చెందిన మోర్లే మధుకర్, తండ్రి నారాయణ, వయస్సు 42 సం"అనే వ్యక్తి నిరుపేదలకు ప్రభుత్వం సరఫరా చేస్తున్న పిడిఎస్ బియ్యాన్ని అక్రమంగా తరలిస్తుండగా అదుపులోకి తీసుకుని అతని వద్ద నుండి 33 క్వింటాళ్ల పిడిఎస్ బియ్యాన్ని స్వాధీనం చేసుకొని టీఎస్ 20 టి 7422 నంబర్ గల బొలెరో వాహనాన్ని జప్తు చేసుకున్నామని సిర్పూర్(టి) పోలీసులు తెలిపారు. సమాచారం అందుకున్న డిటి రాజ్ కుమార్ ఘటన స్థలానికి చేరుకొని పంచనామ నిర్వహించారు. అనంతరం పోలీసులకు ఫిర్యాదు చేశారు. డిటి రాజ్ కుమార్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు దర్యాప్తు చేస్తున్నామని సిర్పూర్ (టి) ఎస్.ఐ, డి. సాగర్ తెలిపారు. అనంతరం ఎస్సై సాగర్ మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రజా పంపిణీ వ్యవస్థ నిరుపేదలకు అందిస్తున్న పిడిఎఫ్ బియ్యాన్ని అక్రమంగా తరలించడం నిల్వ చేయడం లేదా విక్రయించడం వంటి చర్యలకు పాల్పడే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్సై సాగర్ తెలిపారు.

## బెజ్జూర్ పోలీసులకు అందిన పక్కా సమాచారం మేరకు కృష్ణపల్లి బ్రిడ్జి వద్ద నిషేధిత గడ్డి మందు తరలిస్తున్న ఇద్దరు వ్యక్తుల అరెస్ట్



వారి వద్ద నుండి నిషేధిత గడ్డి మందు తో కూడిన,20 లీటర్ల 2 క్యాన్లను,2 మొబైల్ ఫోన్ లతో పాటు 1 స్కూటీ స్వాధీనం

వీరిపై కేసు నమోదు చేసి తదుపరి దర్యాప్తును ముమ్మరం చేస్తున్న ఎస్ఐ సర్తాజ్ పాషా:

**ఆగస్టు26,సిర్పూర్(టి) కానిస్టెన్సీ కరస్పాండెంట్ ప్రజాజ్యోతి:** కొమురం భీం ఆసిఫాబాద్ జిల్లా సిర్పూర్(టి)నియోజక వర్గంలోని బెజ్జూర్ మండల కేంద్రంలో నిషేధిత గడ్డి మందును తరలిస్తున్నరని బెజ్జూర్ పోలీసులకు అందిన పక్క సమాచారం మేరకు ఎస్సై సర్తాజ్ పాషా పోలీసులతో కలిసి బెజ్జూర్ మండల కేంద్రంలోని కృష్ణపల్లి గ్రామం బ్రిడ్జి వద్ద తనిఖీ చేస్తున్న సందర్భంలో నిషేధిత గడ్డి మందును తరలిస్తున్న ఇద్దరు వ్యక్తులను పట్టుకున్నట్టు ప్రకటించారు. ఎస్సై సర్తాజ్ పాషా తెలిపిన వివరాల ప్రకారం బెజ్జూర్ మండలం సలుగుపల్లి గ్రామానికి చెందిన బోర్కుట్ పురుషోత్తం, డేటి సుధాకర్ అనే ఇద్దరు వ్యక్తులు మహారాష్ట్ర లోని అహేరి ప్రాంతం నుండి నిషేధిత గడ్డి మందును కొనుగోలు చేసి 20 లీటర్ల సమర్థ్యం కలిగిన రెండు క్యాన్లలో తీసుకువచ్చారని అన్నారు.సలుగుపల్లి గ్రామ పరిసర ప్రాంతాల్లో ప్రజలను మోసం చేసే ఉద్దేశంతో నిషేధిత గడ్డి మందును విక్రయించేందుకు తరలిస్తున్నరని తెలిపారు. ఉదయం సుమారు 6 గంటలకు వారిని పట్టుకున్నామని పోలీసులు తెలిపారు. వారి వద్ద నుండి నిషేధిత గడ్డి మందు తో కూడిన 20 లీటర్ల 2 క్యాన్లను అదేవిధంగా 2 మొబైల్ ఫోన్లతో పాటు 1 స్కూటీని స్వాధీనం చేసుకున్నామని ఎస్ఐ సర్తాజ్ పాషా తెలిపారు. ఈ ఘటనకు సంబంధించిన నిషేధిత గడ్డి మందుతో పట్టుబడిన వీరిపై కేసు నమోదు చేసి తదుపరి దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై తెలిపారు. అనంతరం బెజ్జూర్ ఎస్.ఐ, సర్తాజ్ పాషా మాట్లాడుతూ... నిషేధిత మందులు, అక్రమ వ్యవసాయ ఉత్పత్తుల విక్రయాలు లేదా రవాణాకు పాల్పడే వారిపై చట్టపరమైన కఠిన చర్యలు తీసుకుంటా మని ఎస్ ఐ సర్తాజ్ పాషా తెలిపారు.

# గ్రామాల్లో పోలీసు-ప్రజల సత్సంబంధాల బలోపేతమే లక్ష్యం







ఇచ్చోడ మండలం దాబాబి గ్రామంలో 'పోలీసులు మీకోసం' కార్యక్రమం

గంజాయి, గుడుంబా పై ఉక్కుపాదం జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్

సమాచారం ఉంటే పోలీసు లకు తెలియజేయాలి

రోడ్డు భద్రతపై అవగాహన..ఉచిత వైద్య శిబిరం నిర్వాహణ

హెల్మెట్‌తో ప్రమాదాల శాతం తగ్గే అవకాశం

మహిళలు, బాలికల ఆరోగ్యం పై ప్రత్యేక అవగాన

**ఆదిలాబాద్ బ్యూరో,ఆగస్టు 27, (ప్రజా జ్యోతి )** ప్రజలకు మరింత చేరు వైవారి సమస్యలను నేరుగా తెలుసుకోవడం, గ్రామాల్లో పోలీసు-ప్రజల సత్సంబంధాలను బలోపేతం చేయడం, నేరాల నియంత్రణలో ప్రజల భాగస్వామ్యాన్ని పెం పొందించడం లక్ష్యంగా ఆదిలాబాద్ జిల్లా పోలీసు శాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న 'పోలీసులు మీకోసం' కార్యక్రమంలో భాగంగా గురువారం ఇచ్చోడ మండలం దాబా (బి) గ్రామంలో జిల్లా ఎ స్పీ అఖిల్ మహాజన్ ఐపీ ఎస్ ఆధ్వర్యంలో ప్రత్యేక కా ర్యక్రమం, ఉచిత మెడికల్ క్యాంప్ నిర్వహించారు.ఈ సందర్భంగా గ్రామ సభ్యులు ఆదివాసి సంస్కృతి, డప్పు వాయిద్యాలు నడుమ జిల్లా ఎస్పీకి ఘన స్వాగతం పలి కారు. మొదటగా గ్రామంలో ఉన్న ఆంజనేయ స్వామి ఆలయంలో ప్రత్యేక పూజ కార్యక్రమాన్ని నిర్వహించి, పోలీసు మీకోసం కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కా ర్యక్రమంలో జిల్లా ఎస్పీ మాట్లాడుతూ గ్రామాల్లో ప్రజల భద్రత, ఆరోగ్యం,విద్య, యువత భవిష్యత్తు కోసం పోలీసు శాఖ నిరంతరం కృషి చే స్తోందన్నారు. గ్రామస్తులు తమ సమస్యలను పోలీసుల దృష్టికి తీసుకువస్తే వాటి పరిష్కారానికి చర్యలు తీసు కుంటామని తెలిపారు గంజాయి, గుడుంబా, ఇతర మాదకద్రవ్యాల నిర్మూలనకు ప్రజల సహకారం ఎంతో అవసరమని పేర్కొన్నారు. గ్రామంలో ఎవరైనా గంజాయి సాగు చేస్తున్నా, విక్రయి స్తున్నా లేదా మాదకద్రవ్యాల వినియోగానికి పాల్పడు తున్నా వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని కోరారు. గంజాయికి దూరంగా ఉండాలని యువత కు సూచించారు. మాదక ద్రవ్యాల వల్ల కలిగే నష్టాలపై విద్యార్థులు, యువతలో అవగాహన పెంచాలని తెలిపారు. జిల్లాలో ఇప్పటి వరకు గంజాయి పండించిన రైతు లకు ప్రభుత్వ పథకాలు వ ర్తించకుండా సిఫార్సు చేయడం జరిగిందని తెలిపారు.సీసీటీవీ కెమెరాల ప్రాధాన్య తను వివరించిన జిల్లా ఎస్పీ, గ్రామాల్లో సీసీటీవీల ఏర్పాటుతో నేరాల నియంత్ర ణతో పాటు నేరస్తులను గు ర్తించడం సులభమవుతుందని అన్నారు. గ్రామ భద్రతలో సీసీటీవీ లు కీలక పాత్ర పోషిస్తాయని, ప్రజలు వీటి ఏర్పాటుకు ముందుకు రావాలని సూచించారు.రోడ్డు ప్రమాదాల నివారణ ప్రతి ఒక్కరి బాధ్యత అని ఎస్పీ తెలిపారు. ద్విచక్ర వాహన దారులు తప్పనిసరి గా హెల్మెట్ ధరించాలని, మద్యం సేవించి వాహనం నడప కూడదని, నంబర్ ప్లేట్ లేని వా హనాలను ఉపయోగించ కూడదని సూచించారు. దొంగిలించబడిన వాహనాలను కొనుగోలు చేయడం లేదా ఉపయోగించడం కూడా నేరమేనని తెలిపారు.వాహనం కొనుగోలు చేసే సమయంలో ఆర్సీ, ఇన్సూరె న్స్, ఇతర సంబంధిత పత్రాలను తప్పనిసరిగా పరిశీలించి, వాహనం వివరాలను ధృవీకరించుకోవాలని సూచించారు. హెల్మెట్ విని యోగంతో రోడ్డు ప్రమాదా ల్లో ప్రాణనష్టం గణనీయంగా తగ్గుతుందని, జిల్లాలో హె ల్మెట్ వినియోగం పెరగడంతో, రోడ్డు భద్రతా నియమాలు పాటించడంతో ప్రమాదాలు సుమారు 25 శాతం వర కు తగ్గినట్లు తెలిపారు. కు టుంబాల్లో మహిళలు కూ డా తమ భర్తలు, పిల్లలు హెల్మెట్ ధరించేలా ప్రోత్స హించాలని ఎస్పీ సూచించారు. ఈ సందర్భంగా గ్రామ ప్రజలకు 10 హెల్మెట్లను పంపిణీ చేశారు. ఇచ్చోడ విద్యాలయ పాఠశాల విద్యార్థులు రోడ్డు భద్రత, మాదకద్రవ్యాల దుష్ప్రభావాలపై అవగా హన కార్యక్రమం నిర్వహిం చారు. విద్యార్థులు ఆకట్టు కునే విధంగా స్కిట్ ద్వారా రోడ్డు భద్రత, డ్రగ్స్‌కు దూరంగా ఉండటం వంటి అంశాల పై సందేశాన్ని అందించారు. విద్యార్థులు చదువుతో పాటు క్రీడలు, సాంస్కృతిక కా ర్యక్రమాల్లో పాల్గొని తమ ప్ర తిభను పెంపొందించు కో వాలని ఎస్పీ సూచించారు.ఈ కార్యక్రమంలో భాగంగా నిర్వహించిన ఉచిత మెడి కల్ క్యాంప్‌ను గ్రామ ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఎస్పీ కోరారు. వైద్యులు మహిళలు, బాలికలకు సంబంధించిన పిసి ఓడి, రక్త హీనత (లో బ్లడ్/అనీమియా) వంటి సమస్యలపై అ వగాహన కల్పించారు. అదే విధంగా డెంగ్యూ, మలేరియా నివారణ లక్షణాలు, తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ప్రజలకు వివరించారు. ప్రజలు తమ ఆరోగ్య సమస్యలను నిర్లక్ష్యం చేయకుండా వైద్య శిబిరాలను సద్విని యోగం చేసుకోవాలని సూచించారు. కంటి సమస్యల తో బాధపడేవారికి అవసర మైన చోట ఉచిత కంటి శ స్త్రచికిత్స వంటి వైద్య సేవలను ఉచితంగా అందజేయడం జరుగు తుందని తెలిపారు. ప్రజలు ఆరోగ్య కర మైన ఆహారం తీసుకోవాల ని, జొన్నలు వంటి పోషక విలువలు కలిగిన ఆహారాన్ని ఆహారంలో భాగంగా చేసుకోవాలని జిల్లా ఎస్పీ సూచించారు. అలాగే నకిలీ బాబాలు, మోసగాళ్ల మాటలను నమ్మి ప్రజలు డబ్బులు కోల్పో వద్దని, అనుమానాస్పద వ్యక్తులు లేదా మోస పూరిత కార్యకలా పాలపై పోలీసులకు సమాచారం అందించాలని ఎస్పీ సూచించారు. పాఠశాల విద్యార్థులు జిల్లా ఎస్పీకి రాఖీని కట్టిర క్షాబంధన్ శు భాకాంక్షలు తెలియజేశారు.ఈ కార్యక్రమంలో ఉట్నూర్ ఏఎస్పీ రుత్వి క్ సాయి కొట్టే ఐపీఎస్, ఇ చ్చోడ సీఐ కె నరేష్ కుమార్, గ్రామ సర్పంచ్ ఈశ్వర్, గ్రామ పెద్దలు, ప్రజాప్రతి నిధులు, పోలీసు అధికారులు, ఆదిలాబాద్ ప్రైవేట్ వై ద్యులు, వైద్య సిబ్బంది, వి ద్యార్థులు, మహిళలు, యువత, గ్రామ ప్రజలు పాల్గొ న్నారు.

# తాటిగూడ గ్రామ పంచాయతీలో '2026' డ్రాఫ్ట్ ఓటర్ లిస్ట్‌పై ప్రత్యేక గ్రామసభ

**కాసిపేట, ఆగస్టు 27,(ప్రజాజ్యోతి):** ఈ రోజు కాసిపేట మండలం తాటిగూడ గ్రామ పంచాయతీ కార్యాలయంలో 'ఇ×=-2026' డ్రాఫ్ట్ ఓటర్ లిస్ట్‌పై ప్రత్యేక గ్రామసభను గురువారం నిర్వహించారు.

ఈ సందర్భంగా సర్పంచ్ మడావి వెంకటేష్ మాట్లాడుతూ డ్రాఫ్ట్ ఓటర్ జాబితా ఆధారంగా ప్రతి ఒక్కరూ తమ వివరాలను సరిచూసుకోవాలని సూచించారు.

**గ్రామసభలోని ప్రధాన అంశాలు:**

**ఓటర్ల వివరాల పరిశీలన:** సభలో అధికారుల సమక్షంలో 2026 డ్రాఫ్ట్ జాబితాను ప్రజలకు చదివి వినిపించారు. ఓటర్ల పేర్లు, వివరాలపై ఉన్న సందేహాలు, అభ్యంతరాలు మరియు తప్పుల సవరణలపై గ్రామస్తులతో సమగ్రంగా చర్చించారు.

**అభ్యంతరాల స్వీకరణ:** సభలో ప్రజల నుంచి వచ్చిన వివిధ సూచనలు, దరఖాస్తులను అధికారులు నమోదు చేసుకున్నారు.






పరిశీలన అనంతరం తగిన చర్యలు చేపట్టి, తప్పులను నివారించి తుది జాబితాను సిద్ధం చేస్తామని హామీ ఇచ్చారు.

ఈ కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ మడావి వెంకటేష్, ఉప సర్పంచ్, తమ్మినేడి విజయలక్ష్మి శ్యామ్ శేఖర్ వార్డు మెంబర్లు, మడావి దేవు మడావి.జమున సిడం.శ్రీనివాస్, పంచాయతీ సెక్రటరీ అన్నపూర్ణ, బూత్ లెవెల్ ఆఫీసర్ (బీఎూ) కొయ్యాల సరోజ, పంచాయతీ సిబ్బంది, గ్రామ యువత మరియు గ్రామ ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

## వెలిగొండ ప్రాజెక్టు అడుగులు

**ఒంగోలు :** ప్రకాశం జిల్లా ప్రజలు ఎన్నో ఏళ్లుగా ఎదురుచూస్తున్న వెలిగొండ ప్రాజెక్టు ఇప్పుడు కీలక దశకు చేరుకుంది. మూడు దశాబ్దాల క్రితం తానే శంకుస్థాపన చేసిన ప్రాజెక్టును ఇప్పుడు ముఖ్యమంత్రిగా తానే ప్రారంభించే అవకాశం రావడం తనకు ఎంతో ఆనందంగా ఉందని సీఎం చంద్రబాబు నాయుడు తెలిపారు. ఈ విషయాన్ని ఆయన సోషల్ మీడియా వేదికగా ప్రజలతో పంచుకున్నారు. 1996 మార్చి 5న ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో వెలిగొండ ప్రాజెక్టుకు శంకుస్థాపన చేసిన విషయాన్ని చంద్రబాబు గుర్తుచేసుకున్నారు. అప్పట్లో ప్రకాశం జిల్లాలోని పశ్చిమ ప్రాంత ప్రజలు ఎదుర్కొంటున్న సాగునీటి ఇబ్బందులకు శాశ్వత పరిష్కారం చూపాలనే ఉద్దేశంతో ఈ ప్రాజెక్టుకు రూపకల్పన చేసినట్లు తెలిపారు. అయితే వివిధ కారణాలతో పనులు సుదీర్ఘకాలం కొనసాగాయి. ఎన్నో అడ్డంకులు ఎదురైనా ప్రాజెక్టును పూర్తి చేయాలన్న లక్ష్యంతో ముందుకు సాగామని సీఎం పేర్కొన్నారు. ఈ నెల 31న వెలిగొండ ప్రాజెక్టు తొలి దశ పనులను అధికారికంగా ప్రారంభించేందుకు ప్రభుత్వం ఏర్పాట్లు చేస్తోంది. దాదాపు 30 ఏళ్ల క్రితం వేసిన పునాదికి ఇప్పుడు ఫలితం కనిపించడం తనకు ప్రత్యేకమైన అనుభూతిని ఇస్తోందని చంద్రబాబు అన్నారు. తన సంకల్పం నెరవేరుతున్న ఈ సందర్భాన్ని ఒక గొప్ప అనుభవంగా ఆయన అభివర్ణించారు. దీనికి సంబంధించిన 1996 నాటి ఫొటోలను కూడా సోషల్ మీడియాలో పంచుకున్నారు. వెలిగొండ మొదటి దశ పూర్తవడంతో ప్రకాశం జిల్లాలోని పశ్చిమ ప్రాంతంలో సాగునీటి పరిస్థితుల్లో గణనీయమైన మార్పు వస్తుందని ప్రభుత్వం భావిస్తోంది. ఈ దశ ద్వారా సుమారు 1.19 లక్షల ఎకరాల ఆయకట్టుకు సాగునీరు అందే అవకాశం ఉంది. దీంతో వర్షాలపై ఆధారపడే రైతులకు ఎంతో ఊరట లభించనుంది. వ్యవసాయానికి నీటి లభ్యత పెరగడంతో పంటల సాగు విస్తీర్ణం, దిగుబడులు కూడా మెరుగుపడే అవకాశం ఉంది. తాగునీటి విషయంలోనూ ఈ ప్రాజెక్టు కీలక ప్రయోజనాన్ని అందించనుంది. సుమారు నాలుగు లక్షల మంది ప్రజలకు తాగునీటి అవసరాలను తీర్చేందుకు ప్రాజెక్టు ఉపయోగపడనుంది. శ్రీశైలం రిజర్వాయర్ నుంచి 10.7 టీఎంసీల కృష్ణా వరద జలాలను నల్లమలసాగర్ రిజర్వాయర్‌కు తరలించేందుకు తొలి దశ మార్గం సుగమం చేస్తుంది. ప్రకాశం, నెల్లూరు , కడప జిల్లాల్లోని ఫ్లోరైడ్ ప్రభావిత, కరవు ప్రాంతాలకు సురక్షితమైన తాగునీటిని అందించడంలో కూడా వెలిగొండ ప్రాజెక్టు ఉపయోగపడనుంది. భూములు ఇచ్చిన రైతులకు విడతల వారీగా పరిహారం అందించామని చంద్రబాబు తెలిపారు. గతంలో ప్రాజెక్టు పూర్తికాకుండానే పూర్తయినట్లు ప్రచారం చేశారని ఆయన విమర్శించారు. ఇప్పుడు నిజంగా పనులను పూర్తి చేసి ప్రజలకు ప్రయోజనం అందించడమే లక్ష్యమని ప్రభుత్వం చెబుతోంది. మూడు దశాబ్దాల నిరీక్షణకు తెరదించే ఈ ప్రాజెక్టు ప్రారంభం ప్రకాశం జిల్లా అభివృద్ధిలో కీలక మలుపుగా నిలిచే అవకాశం ఉంది.

## నగరిపై గురి...

**తిరుపతి :** ఉమ్మడి చిత్తూరు జిల్లాలోని నగరి మున్సిపల్ ఎన్నికలు ఇప్పుడు రాజకీయ వర్గాల్లో ఆసక్తిని పెంచుతున్నాయి. ముఖ్యంగా వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ) నాయకురాలు, మాజీ మంత్రి ఆర్కే రోజా కు ఈ ఎన్నికలు కీలకంగా మారే అవకాశం ఉందనే చర్చ జరుగుతోంది. గత అసెంబ్లీ ఎన్నికల్లో ఆమె ఓటమి తర్వాత నగరి రాజకీయాల్లో పరిస్థితులు మారాయి. తెలుగుదేశం పార్టీ ( నుంచి గాలి భాను ప్రకాష్ నాయుడు ) విజయం సాధించడంతో నియోజకవర్గంలో కొత్త రాజకీయ సమీకరణాలు ఏర్పడ్డాయి. అసెంబ్లీ ఎన్నికల ఫలితాలను రోజా పెద్దగా పట్టించుకోనప్పటికీ, ఇప్పుడు జరగబోయే మున్సిపల్ ఎన్నికల ఫలితాలు ఆమె రాజకీయ ప్రభావానికి ఒక కొలమానంగా మారవచ్చని స్థానికంగా చర్చ సాగుతోంది. దీంతో నగరి మున్సిపాలిటీపై వైసీపీ ఎలా వ్యూహం రచిస్తుందనేది ఆసక్తికరంగా మారింది. మరోవైపు ఎమ్మెల్యే భాను ప్రకాష్ మాత్రం ఈ ఎన్నికలను తనకు వచ్చిన అవకాశంగా భావిస్తున్నట్లు తెలుస్తోంది. నగరి పట్టణంలోని ప్రతి వార్డులో టీడీపీ బలాన్ని పెంచేందుకు భాను ప్రకాష్ నాయుడు విస్తృతంగా పర్యటిస్తున్నారు. కౌన్సిలర్ అభ్యర్థులతో పాటు స్థానిక ప్రజలను కలుస్తూ వారి సమస్యలను తెలుసుకుంటున్నారు. ఇప్పటికే పరిష్కరించిన సమస్యలను ప్రజలకు వివరిస్తూ, భవిష్యత్‌లో చేపట్టబోయే కార్యక్రమాలపై హామీలు ఇస్తున్నారు. అసెంబ్లీ ఎన్నికల్లో సాధించిన విజయాన్ని మున్సిపల్ స్థాయిలోనూ పునరావృతం చేయాలన్న లక్ష్యంతో ఆయన ముందుకు వెళ్తున్నట్లు తెలుస్తోంది. రోజాను లక్ష్యంగా చేసుకుని భాను వర్గం చేస్తున్న రాజకీయ విమర్శలు కూడా చర్చకు వస్తున్నాయి. ఆమె నియోజకవర్గానికి తరచూ రావడం లేదంటూ 'విజిటింగ్ లీడర్' అనే ప్రచారాన్ని టీడీపీ వర్గాలు తెరపైకి తెస్తున్నాయి. మాజీ ఎమ్మెల్యేగా నియోజకవర్గంలో ప్రజలకు అందుబాటులో ఉండటం లేదన్న అంశాన్ని కూడా ఎన్నికల ప్రచారంలో ప్రస్తావించే అవకాశం ఉంది. గతంలో చోటుచేసుకున్న ఆడుదా వ్యవహారం కూడా రాజకీయంగా చర్చకు వస్తోందినగరిలో జనసేన కు కూడా కొంత ప్రభావం ఉంది. అయినప్పటికీ టీడీపీ నాయకులు, కార్యకర్తల మధ్య సమన్వయం ఉండటం భాను ప్రకాష్‌కు అదనపు బలంగా మారే అవకాశం కనిపిస్తోంది. స్థానిక ఎన్నికల్లో ఎమ్మెల్యేలకు ఎక్కువ బాధ్యతలు అప్పగించిన పరిస్థితుల్లో మున్సిపల్ ఫలితం తన నాయకత్వానికి కూడా ప్రతిబింబంగా ఉంటుందని భావిస్తూ ఆయన మరింత దూకుడుగా వ్యవహరిస్తున్నారని పార్టీ వర్గాలు చెబుతున్నాయి. మరోవైపు రోజా మాత్రం ఇప్పటివరకు మున్సిపల్ ఎన్నికలపై పెద్దగా దృష్టి పెట్టలేదనే అభిప్రాయం ఉంది. నియోజకవర్గంలో ఆమె కార్యక్రమాలు తక్కువగా కనిపించడం వైసీపీకి ఇబ్బందిగా మారే అవకాశముంది. దీనికి తోడు పార్టీలోని అంతర్గత విభేదాలు కూడా ఆమెకు సవాలుగా మారుతున్నాయి. ఈ నేపథ్యంలో నగరి మున్సిపల్ ఎన్నికల్లో వైసీపీ ఎంతవరకు తన పాత ప్రభావాన్ని నిలబెట్టుకుంటుందో, టీడీపీ కొత్త బలంతో ఎలాంటి ఫలితాన్ని సాధిస్తుందో చూడాలి. ఫలితం రోజా రాజకీయ భవిష్యత్తుపై, భాను ప్రకాష్ స్థానిక నాయకత్వంపై ప్రభావం చూపే అవకాశం ఉంది.

## రోడ్డు ప్రమాదం: ప్రయాణికులపైకి దూసుకెళ్లిన బెంగళూరు బస్సు.. మంది మృతి

**చిలకలూరిపేట :** పట్టణంలోని అవుట్రోడ్డు సెంటర్లో గురువారం తెల్లవారుజామున తీవ్ర విషాదం చోటుచేసుకుంది. కోటప్పకొండ నుండి వేలూరు గ్రామానికి బయలుదేరిన ప్రయాణికులను బెంగళూరు వెళ్తున్న ఒక ప్రైవేట్ ట్రావెల్స్ బస్సు వేగంగా వచ్చి ఢీకొట్టింది. ఈ ఘోర ప్రమాదంలో ఘటనా స్థలిలోనే సుమారు 4 నుంచి 6మంది దుర్మరణం చెందినట్లు ప్రాథమిక సమాచారం అందుతోంది. పలువురు తీవ్రంగా గాయపడ్డారు. ప్రమాద తీవ్రతకు ప్రయాణికులు రోడ్డుపై చెల్లాచెదురుగా పడిపోవడంతో స్థానికంగా భయాందోళనలు నెలకొన్నాయి. సమాచారం అందుకున్న వెంటనే స్థానిక పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని సహాయక చర్యలు చేపట్టారు. క్షతగాత్రులను చికిత్స నిమిత్తం సమీపంలోని ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

## అక్రమంగా పీడీఎస్ బియ్యం నిల్వ, రవాణా

**మిర్యాలగూడ:** మిర్యాలగూడ రూరల్ పోలీస్ స్టేషన్ పరిధిలో అక్రమంగా పీడీఎస్ బియ్యం నిల్వ చేసి, రవాణా చేస్తున్నారన్న ఆరోపణలపై పోలీసులు నలుగురిని అరెస్ట్ చేశారు. అవంతిపురం గ్రామ శివారులోని శ్రీ లక్ష్మి గణపతి ఆగ్రో ప్రొడక్ట్స్ రైస్ మిల్ వద్ద పీడీఎస్ బియ్యం అక్రమంగా నిల్వ చేసినట్లు అందిన సమాచారం మేరకు 26-08-2026న సాయంత్రం సుమారు 4:30 గంటలకు పోలీసులు తనిఖీలు నిర్వహించారు. తనిఖీల్లో ప్రభుత్వ ప్రజా పంపిణీ వ్యవస్థ (పీడీఎస్) ద్వారా తెల్ల రేషన్ కార్డుదారులకు పంపిణీ చేయాల్సిన బియ్యాన్ని అక్రమంగా కొనుగోలు చేసి రైస్ మిల్లుకు తరలించి నిల్వ చేసినట్లు పోలీసులు గుర్తించారు. అనంతరం బియ్యాన్ని పాలిష్ చేసి ఇతర బస్తాల్లో ప్యాక్ చేసి విక్రయించేందుకు ప్రయత్నిస్తున్నట్లు వెల్లడించారు. ఈ సందర్భంగా సుమారు 21 టన్నుల పీడీఎస్ బియ్యం, మొత్తం 420 సంచులు (ఒక్కో సంచి 50 కిలోలు) స్వాధీనం చేసుకున్నారు. అలాగే బియ్యం రవాణాకు ఉపయోగించినట్లు పేర్కొన్న ఐచర్ మినీ డీసీఎం (టీఎ 05 జఈ 6431) వాహనాన్ని కూడా పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. నలుగురు అరెస్ట్ఈ కేసులో ఏ-1 సోమ రామకృష్ణ, ఏ-2 చిమ్మట వెంకన్న, ఏ-3 చిమ్మట లోకేష్, ఏ-4 సయ్యద్ నదీమ్లను అరెస్ట్ చేసినట్లు పోలీసులు తెలిపారు. దర్యాప్తులో ఏ-1 వివిధ తెల్ల రేషన్ కార్డుదారుల వద్ద నుంచి పీడీఎస్ బియ్యాన్ని తక్కువ ధరకు కొనుగోలు చేసి రైస్ మిల్లులకు తరలిస్తున్నట్లు, ఏ-2, ఏ-3 బియ్యాన్ని పాలిష్ చేసి రీప్యాకింగ్ చేయడంలో సహకరిస్తున్నట్లు, ఏ-4 డ్రైవర్‌గా బియ్యాన్ని రవాణా చేస్తున్నట్లు వెల్లడైనట్లు పోలీసులు తెలిపారు.

## ఓటరు జాబితాను సరిచూసుకోవాలి

**ఎస్ఐఆర్ సవరణపై సూపక గ్రామపంచాయతీ లో అవగాహన గ్రామసభ**



**మంచిర్యాల, 27,ఆగస్టు (ప్రజాజ్యోతి):** మంచిర్యాల జిల్లా చెన్నూరు నియోజకవర్గ ము కోటపల్లి మండలంలోని సూపక గ్రామపంచాయతీలో ఎస్ఐఆర్ సవరణ ప్రక్రియపై అవగాహన కల్పించేందుకు గురువారం గ్రామసభ నిర్వహించారు. గ్రామ సర్పంచ్ కాశెట్టి సతీష్ కుమార్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో ఓటరు జాబితా సవరణకు సంబంధించిన అంశాలపై గ్రామస్తులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఓటరు జాబితాలో ప్రతి ఒక్కరూ తమ పేరు, చిరునామా, ఇతర వివరాలను పరిశీలించుకోవాలని సూచించారు. జాబితాలో ఏవైనా తప్పులు, అభ్యంతరాలు ఉంటే సకాలంలో సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లి సరిచేయించుకోవాలని తెలిపారు. అర్హులైన ప్రతి ఒక్కరి పేరు ఓటరు జాబితాలో ఉండేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో కోటపల్లి ఎం.ఆర్.ఓ. ఇన్‌చార్జ్ కర్ణ సాగర్, మాజీ జెడ్‌పీటీసీ పోటు రాంరెడ్డి, కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జ్ చెన్న సూర్యనారాయణ, మండల అధ్యక్షులు కాట్రాల మల్లన్న, డీసీసీ కార్యదర్శి కొండు వెంకటేష్, మండల ఉపాధ్యక్షులు తోట అశోక్, కొల్లూరి మధూకర్, బద్రీనాయక్, ఉపసర్పంచ్ రామక్క, పంచాయతీ కార్యదర్శి దామోదర్, వార్డు సభ్యులు, జీపీఓ, బీఎల్‌ఓలు, బీఎల్‌ఏలు, గ్రామ ప్రజలు, పార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## నూతన చేయూత పెన్షన్ దరఖాస్తులపై విస్తృత ప్రచారం

**అర్హులందరికీ సమాచారం చేరేలా అవగాహన కల్పించాలి కలెక్టర్ హరిత**




**ఆసిఫాబాద్, ఆగస్టు 27 ప్రజా జ్యోతి** నూతనంగా చేయూత పెన్షన్లు మంజూరు చేయనున్న నేపథ్యంలో అర్హులైన ప్రతి ఒక్కరికీ సమాచారం చేరేలా విస్తృతంగా అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని జిల్లా కలెక్టర్ కె.హరిత అధికారులను ఆదేశించారు. నూతన పెన్షన్ల కోసం దరఖాస్తు చేసుకునేందుకు ఈ నెల 31 వరకు గడువు ఉన్నందున మారుమూల గ్రామాల ప్రజలకు సైతం సమాచారం అందేలా చర్యలు చేపట్టాలని సూచించారు. జిల్లా కేంద్రంలోని సమీకృత కలెక్టరేట్ సమావేశ మందిరంలో గురువారం అదనపు కలెక్టర్ (రెవెన్యూ) ఎం.డేవిడ్, జిల్లా రెవెన్యూ అధికారి దాసరి వేణుతో కలిసి నూతన చేయూత పెన్షన్‌పై రూపొందించిన గోడ ప్రతులను కలెక్టర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అర్హత కలిగిన ప్రతి ఒక్కరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని గడువులోగా పెన్షన్‌కు దరఖాస్తు చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో జిల్లా గ్రామీణ అభివృద్ధి అధికారి దత్తారావు, కలెక్టరేట్ పర్యవేక్షకులు శశిధర్, ఏపీఓ (పెన్షన్) రామకృష్ణ, ఏపీఓ ధన్‌రాజ్, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.